పుస్తక ప్రియులకు ఇదే మా ఆహ్వానం
38వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శన
తెలంగాణ కళాభారతి (ఎన్టీఆర్ స్టేడియం), హైదరాబాద్
డిసెంబర్ 19 నుండి 29 వరకు - మ॥ 1 నుండి రా॥ 9 వరకు
నవచేతన బుక్ హౌస్ స్టాల్ నం. 292 - 295
నవచేతన పబ్లిషింగ్ హౌస్ స్టాల్ నం. 339 - 344



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



ఒడిశాలో నక్సల్స్ లొంగుబాటు

ప్రియాంకకు రాజకీయాల్లో ఉజ్వల భవిష్యత్తు

కర్బీ ఆంగ్లాంగ్‌లో హింస 05



సంపుటి 28, సంచిక: 184 | బుధవారం | 24-12-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00




## 40% నిధులను రాష్ట్రాలు భరించలేవు

● కేంద్రం కొత్తచట్టం తీసుకురావడం దుర్మార్గం ● సంపన్నులకు బకాయిలు రద్దుచేసి పేదలకు అన్యాయం చేస్తోంది ● ఎంజి నరేగాను నిర్వీర్యం చేస్తోంది ● మోదీ సర్కార్‌పై సిపిఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ ఆగ్రహం

ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి పేరును రద్దుచేసి దాని స్థానంలో విబి జీ రామ్ జీ పేరుతో కొత్త చట్టాన్ని తీసుకువచ్చి నీరుగారిచే ప్రయత్నం చేస్తోందని సిపిఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. సిపిఐ రాష్ట్ర సమితి సమావేశం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి అధ్యక్షతన మంగళవారం సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో డాక్టర్ నారాయణ మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 40 శాతం నిధులను రాష్ట్రాలు భరించలేని విధంగా కొత్త చట్టం తీసుకురావడం దుర్మార్గమన్నారు. సంపన్న కుటుంబాలకు పాత బకాయిల పేరుతో రూ.28 లక్షల కోట్లను రద్దు చేసిన కేంద్రం పేదలకు అన్యాయం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంటులో బిజెపి అనుకూల బిల్లులు ఆమోదింపజేసుకుంటోందన్నారు. ట్రంప్ వెనిజులా అధ్యక్షుడిని చంపుతానంటున్నాడని, అమెరికా టారీఫ్‌ల పేరుతో పెంచుకుంటూ పోతున్న ట్రంప్‌కు అనుకూలంగా మోదీ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. న్యూయార్క్‌లో జరిగిన సంఘటన ట్రంప్‌కు షాక్ ఇచ్చిందన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. అనంతరం ఇటీవల రాష్ట్రంలో జరిగిన రాజకీయ పరిణామాలు, ఇతర అంశాలపై సమావేశంలో చర్చించారు.

# సమన్వయం లేకుంటే ఫలితాలు రావ్



● ప్రభుత్వ శాఖలమధ్య సమన్వయం చేసుకునేందుకు యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకోవాలి ● ప్రభుత్వం ఎంత గొప్ప కార్యాచరణ తీసుకున్నా అధికారుల సహకారం అవసరం ● అందరూ జవాబుదారీతనంతో పనిచేయాలి ● శాఖల కార్యదర్శులు ప్రతినెలా సిఎస్‌కు నివేదిక సమర్పించాలి ● ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం ● 26 లోగా అన్ని కార్యాలయాలు ప్రభుత్వ భవనాల్లోకి మారాలి

ప్రజాపక్షం/హైదరాబాద్


అభివృద్ధి విషయంలో ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం చేసుకునేందుకు ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ శాఖల మధ్య, శాఖల అధికారుల మధ్య సమన్వయం లేకపోతే ఎలాంటి ఫలితాలు రావని, అధికారులందరూ సమన్వయం చేసుకుని పనిచేయడం అత్యంత కీలకమని సూచించారు. ప్రభుత్వ శాఖల పనితీరుపై వివిధ శాఖల కార్యదర్శులతో ముఖ్యమంత్రి మంగళవారం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సచివాలయంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో అధికారులను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం స్పష్టమైన విధివిధానాలతో ముందుకు వెళుతున్నదని ప్రభుత్వం ఎంత గొప్ప కార్యాచరణ తీసుకున్నప్పటికీ అధికారుల సహకారం ఉండాలని, అధికారులు జవాబుదారీతనంతో పనిచేయాలన్నారు. ప్రతీ నెల ప్రభుత్వ శాఖల కార్యదర్శుల పనితీరును ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్) సమీక్షిస్తారని, కార్యదర్శులు సిఎస్‌కు ప్రతీ నెల నివేదిక సమర్పించాలన్నారు. ప్రతీ మూడు నెలలకు ఒకసారి శాఖల కార్యదర్శుల పనితీరుపై తాను స్వయంగా సమీక్ష నిర్వహిస్తానని సిఎం చెప్పారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిందని, ఈ రెండేళ్లలో కొన్ని విజయాలు సాధించామని, కొన్ని ప్రణాళికలు రూపొందించుకున్నామన్నారు. గతంలో ఎనర్జీ, ఎడ్యుకేషన్, ఇరిగేషన్, హెల్త్ లాంటి వివిధ శాఖలకు సంబంధించి ఒక విధానమంటూ లేకపోవడంతో కొన్ని సమస్యలు వచ్చాయని, ఈ నేపథ్యంలో ముఖ్యమైన విభాగాలకు ఒక విధానాన్ని రూపొందించామన్నారు. రాష్ట్రానికి ఒక పాలసీ ఉండాలని తరువాయి 2లో

## ‘పాలమూరు’ పాపం బిఆర్‌ఎస్‌దే

● పనులు మెల్లగా చేయాలని, ఒక టిఎంసి నీటిని తగ్గించుకోవాలని గత ప్రభుత్వమే ఇఎన్‌సి ద్వారా ఆదేశాలు జారీచేసింది ● కాళేశ్వరంపై చూపిన ప్రేమ పాలమూరు ప్రాజెక్టుకు నిధులు కేటాయిస్తే పూర్తయ్యేది ● ప్రాజెక్టుపై శాసనసభలో చర్చకు మేం సిద్ధం

ప్రజాపక్షం/హైదరాబాద్

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్ పనులను మెల్లగా నిర్వహించాలని, ఒక టిఎంసి నీటిని తగ్గించుకోవాలని గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం నీటి పారుదల శాఖ ఇఎన్‌సి ద్వారా ఆదేశాలు జారీ చేసినట్టు రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. 90 శాతం పనులను పూర్తి చేశామని చెబుతున్న బిఆర్‌ఎస్, కాళేశ్వరం ప్రాజెక్ట్‌పైన చూపిన ప్రేమను పాలమూరు రంగారెడ్డికి నిధులను కేటాయిస్తే పూర్తయ్యేది కదా ? అని ప్రశ్నించారు. ప్రాజెక్ట్‌పైన శాసన సభ సమావేశంలో తరువాయి 2లో




అసెంబ్లీలో పవర్‌పాయింట్‌ను స్వాగతిస్తున్నాం : హరీశ్

తెలంగాణకు మరణశాసనం రాసిందే కెసిఆర్ : రాంచందర్‌రావు 04


ఫోన్ ట్యాపింగ్ కేసు



## కెసిఆర్, హరీష్‌కు త్వరలో నోటీసులు?

విచారణ వేగవంతం చేసిన సిట్

ప్రజాపక్షం /హైదరాబాద్

ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలన పరిణామాలు చోటుచేసుకోబోతున్నాయా అంటే ఔననే సంకేతాలు వెలువడుతున్నాయి. హైదరాబాద్ కమిషనర్ విసి.సజ్జనార్ ఆధ్వర్యంలో తొమ్మిది మంది పోలీసు ఉన్నతాధికారులతో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ప్రధాన నిందితుడు మాజీ ఎస్ఐబి చీఫ్ ప్రభాకర్ రావు ఇచ్చిన స్టేట్‌మెంట్, ఎఫ్ఎస్ఎల్ ఇచ్చిన డేటా ఆధారంగా కొత్తగా ఏర్పాటైన సిట్ బృందం తొలిసారి రాజకీయ అగ్ర నేతలకు నోటీసులు తరువాయి 2లో

## రవాణాశాఖ డిసికి కోట్లలో అక్రమాస్తులు

● హైదరాబాద్, నిజామాబాద్, కామారెడ్డి ప్రాంతాల్లో సోదాలు ● రూ.12కోట్లకు పైగా విలువైన ధ్రువపత్రాలు, డాక్యుమెంట్స్, బంగారం స్వాధీనం ● కిషన్ నాయక్‌ను అరెస్టు చేసిన ఎసిబి అధికారులు



హైదరాబాద్ : ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో రవాణాశాఖ మహబూబ్‌నగర్ డిప్యూటీ కమిషనర్ కిషన్ నాయక్‌ను ఎసిబి అధికారులు అరెస్టు చేశారు. మంగళవారం ఉదయం 5గంటల నుంచి సోదాలు నిర్వహించిన అధికారులు రూ.12కోట్లకు పైగా విలువైన ఆస్తులకు సంబంధించిన ధ్రువపత్రాలు, తరువాయి 2లో

## పోటీ పడకుంటే సింగరేణి భవిష్యత్తు ప్రశ్నార్థకమే

● సంస్థపై ఆధారపడిన 80వేల మంది జీవితాలు రోడ్డునపడే ప్రమాదం ● తెలంగాణలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా సింగరేణి జెండా ఎగరాలి ● టెక్నాలజీకి అనుగుణంగా సంస్థ పరుగులు పెట్టాలి ● డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ● శైలు బంకర్ బాధితులకు పునరావాసం ఏర్పాటు చేయండి ● ఎమ్మెల్యే రాగమయి



ప్రజాపక్షం/సత్తుపల్లి

ప్రతి రంగంలోనూ తీవ్రమైన పోటీ వస్తుందని, ఇతర రంగాలతో పోటీ పడకపోతే సింగరేణి భవిష్యత్ ప్రశ్నార్థకమయ్యే ప్రమాదం ఉందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో నూతనంగా నిర్మించిన జిఎం కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా తరువాయి 12లో

## లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న సార్వత్రిక సమ్మె

సిటియు ఉమ్మడి వేదిక పిలుపు




న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 12వ తేదీన సార్వత్రిక సమ్మె జరుగుతుంది. కేంద్ర కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక (జెపి సిటియు) ఈ పిలుపు ఇచ్చింది. అమానుషమైన నాలుగు లేబర్ కోడ్స్‌ను మోదీ ప్రభుత్వం ఏకపక్షంగా అమలులోకి తీసుకురావడమే కాకుండా, ప్రజల హక్కులు, వారు ఉపాధి అవకాశాలపైన కూడా పార్లమెంటు వెలుపలా–లోపలా దేశ పాలక వర్గం బహుముఖ దాడులు చేయడాన్ని ప్రతిఘటిస్తూ కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక ఈ సమ్మె పిలుపు ఇచ్చింది. ఈ సమ్మె ద్వారా మోదీ ప్రభుత్వానికి ఒక బలమైన సందేశాన్ని పంపించాలని ఐక్యవేదిక నిర్ణయించింది. రాబోయే సార్వత్రిక సమ్మె కోసం యావత్ కార్మికలోకం, ఇతర శ్రామిక వర్గాలు దేశవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలను ధృతం చేయాలని ఈ సందర్భంగా సిటియు పిలుపు ఇచ్చింది. పోరాటాన్ని తీవ్రతరం చేసేందుకు తమ తమ సంస్థలు, సంఘాలను సన్నద్ధం చేయాలని కోరింది. దేశ శ్రామిక ప్రజానీకం మౌలిక హక్కులను సంరక్షించేందుకు, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను సంరక్షించేందుకు పార్లమెంటులోని ప్రతిపక్షాలు, వివిధ వర్గాల ప్రజలు ప్రత్యేకించి యువకులు,విద్యార్థులు సార్వత్రిక సమ్మెకు మద్దతు, సంఘీభావం ప్రకటించేందుకు ముందుకు రావాలని పిలుపు ఇచ్చింది. సార్వత్రిక సమ్మెకు బేషరతుగా మద్దతు ప్రకటించిన సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం)కు సిటియు శాల్యూట్ చేసింది. వచ్చేనెల (జనవరి) తొమ్మిదో తేదీ మధ్యాహ్నం న్యూఢిల్లీ హెచ్‌కెఎస్ భవన్‌లో తరువాయి 2లో

ఆరావళీ పర్వత శ్రేణిని పునర్నిర్వచించడానికి

## ఎందుకంత పట్టుదల?

● మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ విమర్శలు ● ఎవరి ప్రయోజనం కోసం అని నిలదీత



న్యూఢిల్లీ : ‘ఆరావళీలు దేశ సహజ వారసత్వ సంపద అని, వాటికి గొప్ప పర్యావరణ విలువ ఉంది’ అని కాంగ్రెస్ పేర్కొంది. మోదీ ప్రభుత్వం ఈ పర్వత శ్రేణిని పునర్నిర్వచించడానికి ఎందుకు పట్టుబడుతోందని, అది ఎవరి ప్రయోజనం కోసం అని ఆ పార్టీ ఘాటుగా ప్రశ్నించింది. పురాతన పర్వత శ్రేణిపై పర్యావరణ, అటవీ శాఖ మంత్రి ఇటీవల ఇచ్చిన వివరణలపై మరిన్ని ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ‘ఆరావళీలు మన సహజ వారసత్వంలో భాగం. వాటికి గొప్ప పర్యావరణ విలువ ఉంది. వాటికి గణనీయమైన పునరుద్ధరణ, అర్థవంతమైన రక్షణ అవసరం. మోదీ ప్రభుత్వం వాటిని పునర్నిర్వచించడానికి ఎందుకు పట్టుబడుతోంది? ఏ ఉద్దేశ్యంతో? ఎవరి ప్రయోజనం కోసం? ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా వంటి వృత్తిపరమైన సంస్థ సిఫార్సులను ఎందుకు ఉద్దేశపూర్వకంగా విస్మరించి పక్కన పెడుతున్నారు’ అని ఆయన ప్రశ్నించారు. ఆరావళీ సమస్యపై కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి ఇచ్చిన తరువాయి 12లో

## సోయా రైతులను ఆదుకోండి

● కేంద్రానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి ● మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు ప్రత్యేక లేఖలు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో వానాకాలం (ఖరీఫ్) 2025–26 సీజన్‌లో కురిసిన అకాల, దీర్ఘకాలిక భారీ వర్షాల కారణంగా తీవ్రంగా నష్టపోయిన సోయాబీన్ రైతులను ఆదుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ప్రత్యేక లేఖలు రాసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలంగాణ తరువాయి 12లో




## పేరు మార్చిన నూతన చట్టంతో ఉపాధి ధ్వంసం

అన్ని జిల్లాల్లో నిరసన ప్రదర్శనలు చేపట్టిన వామపక్షాలు, ప్రజాసంఘాలు

వార్తలు 3లో



# ప్రపంచం
WORLD NEWS

## లైంగిక నేరస్థుడు ఎప్‌స్టీన్ జెట్స్‌లో ఇరవైయేళ్ళ యువతితో ట్రంప్ ప్రయాణం

**వాషింగ్టన్ :** లైంగిక నేరస్థుడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు సంబంధించిన ఫైల్స్‌లో మరిన్ని పేజీలను జస్టిస్ విభాగం (డిఓజె) విడుదల చేసింది. ఎప్‌స్టీన్‌కు సంబంధించిన ప్రైవేటు విమానాలలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విచ్చలవిడిగా అనేకసార్లు ప్రయాణాలు చేశారని ఈ ఫైల్స్ ద్వారా తాజాగా బహిర్గతమైంది. గడచిన మూడు రోజులుగా 11,000 ఫైల్స్‌తోపాటు 400 వీడియోలను (10 జిబి) కూడా ఇప్పటివరకూ విడుదలయ్యాయి. 1993 నుండి 1996 వరకూ జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు సంబంధించిన విమానాలలో అనేక సార్లు ప్రయాణం చేసినట్లు రికార్డుల్లో ఉందని అమెరికా డిఓజె వెల్లడించింది. ఎనిమిది విమానాల్లో అనేకసార్లు ప్రయాణాలు చేసినట్లు ఇప్పటివరకూ తెలిసిందని తాజాగా విడుదల చేసిన ఇ-మెయిల్స్ ద్వారా డిఓజె తెలిపింది. ఒక విమానంలో మాత్రం కేవలం ముగ్గురే ముగ్గురు ప్రయాణించారని, వారిలో ఒకరు ట్రంప్, మరొకరు ఎప్‌స్టీన్ కాగా వారిద్దరితో 20 ఏళ్ళ వయసుగల యువతి ఉందని డిఓజె తెలిపింది. లైంగిక ఆరోపణలపై ఎప్‌స్టీన్ చివరకు జైలుశిక్ష అనుభవిస్తూ 2019లో జైలులోనే మరణించాడు.

# ట్రంప్...ముందు నీ ఇల్లు చక్కదిద్దుకో

### మెత్తగా చీవాట్లు పెట్టిన వెనిజులా అధ్యక్షుడు మదురో




**వాషింగ్టన్ :** అమెరికా–వెనిజులా మధ్య ఉద్రిక్తతలు చల్లారడంలేదు. ఇప్పటికే రెండు చమురు నౌకలను స్వాధీనం చేసుకున్న అమెరికా మూడో నౌకను కూడా స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు చేస్తోంది. వెనిజులా నుండి చమురు కొనుగోలు చేసేందుకు వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించేందుకు అనుమతి పొందిన నౌకలను స్వాధీనం చేసుకోవాలని ఇటీవల ట్రంప్ ఆదేశం ఇచ్చిన తర్వాత ఉద్రిక్తతలు మరింతగా పెరిగాయి. ఈ పరిస్థితుల మధ్య "వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో కఠినంగా వ్యవహరించడం మానేయాలి, ఆయన తన పదవికి రాజీనామా చేయడం తెలివైన పని" అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉచిత సలహా ఇచ్చారు. దీనిపై నికోలస్ మదురో చాలా తీవ్రంగా స్పందిస్తూ, "ట్రంప్...ముందు నువ్వు నీ ఇంటిని చక్కదిద్దుకో, నీ దేశంలో ఉన్న సమస్యలు పరిష్కరించుకోవడంలో పొరుగుదేశాల నిర్వహణలో జోక్యం చేసుకోవద్దు, వెనిజులా నౌకల 'పైరసీ' మానుకో" అని హెచ్చరిక చేశారు. ఫ్లోరిడాలోని తన మార్–ఎ–లాగో రిసార్ట్‌లో విదేశాంగమంత్రి మార్కో రుబియో, రక్షణమంత్రి పీటర్ హెగ్సెత్‌లతో కలిసి మాట్లాడుతూ ట్రంప్ చేసిన ప్రకటనపై మదురో తీవ్రంగా స్పందించారు. "ట్రంప్ జాగ్రత్తగా ఉంటే తన సొంత దేశంలో ఆర్థిక సామాజిక విషయాలలో మెరుగైన పాలన అందిస్తారు, తన దేశ వ్యవహారాలను చక్కబెట్టుకోగలిగితే ప్రపంచ వ్యాపంగా ఆయన మెరుగైన స్థానంలో ఉండగలుగుతారు" అని ట్రంప్‌కు మదురో మెత్తగా చీవాట్లు వేశారు. వెనిజులా నౌకల అక్రమ స్వాధీనం "పైరసీ" తప్ప మరేమీ కాదని అన్నారు.

**వెనిజులా ఆయిల్ మేం వాడుకుంటాం లేదంటే అమ్ముకుంటాం**

వెనిజులాకు చెందిన చమురు నౌకలను అమెరికా స్వాధీనం చేసుకోవడం ఆపలేదు. "ఈ నౌకల్లో ఉన్న చమురును మా దగ్గర ఉంచుకుంటాం, లేకపోతే అమ్ముకుంటాం లేదంటే మేమే మా అవసరాల కోసం వాడుకుంటాం" అని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పారు. ఆ దేశాధ్యక్షుడు నికోలస్ మదురో రాజీనామా చేసేవరకూ ఒత్తిడి తీసుకువస్తామని ఫ్లోరిడాలో పాత్రికేయులకు చెప్పారు. వెనిజులా నౌకలు మాదక ద్రవ్యాలను మోసుకువెళుతున్నాయని, చమురు విక్రయించడం ద్వారా వచ్చిన సొమ్మును వెనిజులా డ్రగ్స్ ముఠాలకు, వారి నేరాలకు ఉపయోగిస్తోందని ట్రంప్ ఆరోపించారు.

**వెనిజులాకు రష్యా, చైనా మద్దతు**

కరీబియన్ జలాలలో తీవ్ర ఉద్రిక్తతలు ముసురుకుంటున్న తరుణంలో రష్యా–చైనా దేశాలు తీవ్రంగా స్పందించాయి. వెనిజులాకు రష్యా ప్రభుత్వం తన పూర్తి మద్దతు తెలియజేసింది. అక్కడ జరుగుతున్న పరిణామాలపై రష్యా విదేశాంగమంత్రి సెర్గీ లావరోవ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కరీబియన్ జలాలలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా పేరుతో మరో పడపై అమెరికా రక్షణ దళాలు దాడి చేశాయి. ముగ్గురిని హతమార్చాయి. ఈ ఘటనలపై చైనా కూడా స్పందిస్తూ, అమెరికా దాడులు అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమే అవుతుందని విమర్శించింది. వెనిజులా సార్వభౌమాధికారాన్ని, భద్రతను ఉల్లంఘన చర్యలను వ్యతిరేకిస్తున్నట్లు చైనా విదేశీమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ చెప్పారు.

# మయన్మార్‌లో 28 నుండి ఎన్నికల తంతు మొదలు







**ప్యాంగ్‌యాంగ్ :** మయన్మార్‌లో జుంటా సైనిక పాలకులు తమ అధికారాన్ని స్థిరీకరించుకోవడం కోసం దేశంలో నామమాత్రంగా ఎన్నికల తంతు నిర్వహించేందుకు రంగం సిద్ధం చేశారు. మూడు విడతలుగా జరిగే ఈ సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ మొదటి దశ వచ్చే ఆదివారం (డిసెంబరు 28వతేదీ) ప్రారంభం అవుతుంది. జనవరి 11న రెండో విడత పోలింగ్, జనవరి 25న మూడో విడత పోలింగ్ ప్రక్రియ పూర్తిచేస్తారు.

ఐదుకోట్ల మంది ఉన్న మయన్మార్‌లో తిరుగుబాటుదారులున్న ప్రాంతాలలో ఎన్నికలను రద్దుచేశారు. పాలక నాయకుడు మిన్ ఆంగ్ హ్లైంగ్ ఏడాదిక్రితమే ముందుగా ప్రకటించిన విధంగా ఈ ఎన్నికల తంతుకు రంగం సిద్ధమైంది. ఐతే చాలా దేశాలు ఈ ప్రక్రియను వ్యతిరేకిస్తున్నాయి. అధికారాన్ని స్థిరీకరించుకోవడానికి నామమాత్రంగా ఈ ప్రక్రియ నిర్వహిస్తున్నారని విమర్శిస్తున్నాయి. ప్రజాస్వామ్య ఉద్యమ నాయకురాలు, నోబెల్ బహుమతి గ్రహీత ఆంగ్‌సాన్ సూకీ (80) 33 ఏళ్ళు జైలుశిక్షకు గురయ్యారు. అమె ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజాజీవితంలోకి వచ్చే అవకాశాలు లేవు. జుంటా పాలకులు అధికారం తీసుకున్నప్పటినుండి గడచిన ఐదేళ్ళుగా దేశంలో పౌర ముఠాలకు, సైన్యానికి మధ్య తీవ్రమైన అంతర్యుద్ధం కొనసాగుతున్నది. తీవ్ర అణచివేత చర్యల మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల్లో పాల్గొనడం ప్రజలకు ఇష్టం లేదు. కానీ ఓటింగ్‌కు దూరంగా ఉంటే చాలా కష్టాలను అనుభవించాల్సి వస్తుందని ప్రజలు భయపడుతున్నారు.

అత్యున్నత పార్లమెంటు పైతూ హ్లుట్టాలో ఉన్న 440 స్థానాలకుగాను 315 స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. మెజారిటీతో ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే 221 స్థానాలు గెలుచుకోవాలి. అదే విధంగా అమియోతా హ్లుట్టాలోని 224 స్థానాలకుగాను 16 సీట్లకు ఎన్నికలు జరుగుతాయి. 133 స్థానాలను ఏ పార్టీ అయినా గెలుచుకుంటే మెజారిటీ పొందినట్టు భావిస్తారు. సైన్యం సొంతంగా ఒక పార్టీని స్థాపించింది. కానీ ఇది నేరుగా సైన్యమే నిర్వహించదు. యూనియన్ సాలిడారిటీ అఫ్ డెవలప్‌మెంట్ పార్టీ (యుఎస్‌డిపి) సైనికులకు అనుకూలంగా పనిచేస్తుంది. ఈ పార్టీ గతంలో 2020 చివరిలో జరిగిన ఎన్నికల్లో ఆంగ్‌సాన్ సూకీకి చెందిన నేషనల్ లీగ్ అఫ్ డెమోక్రసీపార్టీ చేతిలో చిత్తుగా ఓడిపోయింది. దీంతో ఎన్నికల్లో దారుణమైన అక్రమాలు, అవినీతి జరిగిందని ఆరోపించిన జుంటా సైన్యం ఆ ఎన్నికలను రద్దుచేసి నాయకులందరినీ జైలులో నిర్బంధించి 2021 ఫిబ్రవరిలో అధికారం స్వాధీనం చేసుకుంది. ఎన్నికల తీర్పును రద్దు చేసింది. గెలిచిన పార్టీ నాయకులపై సైనికకోర్టులో ఏకపక్ష విచారణ జరిపి శిక్షలు విధించింది. ఇందులో భాగంగానే ఆంగ్‌సాన్ సూకీ జైలులో అనేక కేసుల్లో శిక్షలు విధించి ఇక జీవితంలో ఆమె బాహ్య ప్రపంచాన్ని చూసే అవకాశం లేకుండా చేశారు. దేశంలో సైనికుల ఆధిపత్యం నిర్మూలిస్తామని, అందుకు అనుకూలంగా చట్టాలు తీసుకువస్తామని ఆనాడు ఎన్నికల్లో సూకీ వాగ్దానాలు చేసి సైన్యం ఆగ్రహానికి గురయ్యారు. సూకీ పార్టీ రద్దయింది. ప్రస్తుతం సైనిక అనుకూలపార్టీ యుఎస్‌డిపి నాయకుడు ఖిన్ యీ (73) ఎన్నికలకు సారథ్యం వహిస్తున్నారు. ఆయన దేశ సైన్యాధిపతి మిన్ ఆంగ్ హ్లైంగ్‌కు సన్నిహితుడు.

# బంగ్లాదేశ్‌లో మైనార్టీవర్గాలపై పెరిగిన దాడులు,హింస

### ఐరాస ప్రధాన కార్యదర్శి గుటెర్రెస్ ఖండన

**న్యూయార్క్ :** బంగ్లాదేశ్‌లో ఇటీవల జరుగుతున్న హింస, మైనారిటీ వర్గాలపై పెరుగుతున్న దాడులు హత్యలపట్ల ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్ జులై ఉద్యమ నాయకుడు ఒస్మాన్ హది మరణానంతరం బలూకాలో ఒక పరిశ్రమ గేటువద్ద హిందూమతానికి చెందిన కార్మికుడు దీపూ చంద్ర దాస్ (25)ను దారుణంగా కొట్టి చంపి, అల్లరిమూకలు జాతీయ రహదారి పక్కనే దహనం చేసిన ఘటనపై గుటెర్రెస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రత్యేకించి కొద్దిరోజులుగా బంగ్లాదేశ్‌లో మైనారిటీ వర్గాలపై దాడులు పెరిగిపోయాయన్నారు. "ఔను, మేం చాలా తీవ్ర ఆందోళన చెందుతున్నాం, బంగ్లాదేశ్‌లో హింసను చూస్తున్నాం" అని ఆంటోనీ గుటెర్రెస్ తరపున ఆయన అధికార ప్రతినిధి స్టీఫెన్ డుజర్రెక్ ఒక పత్రికాగోష్ఠిలో విమర్శించారు. ఒక ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ, కొద్దిరోజులుగా ప్రత్యేకించి హిందూ మైనారిటీ వర్గాలపై దాడులు పెరిగిపోయాయన్నారు. "వారు బంగ్లాదేశీ కావచ్చు, మరొక దేశీయుడు కావొచ్చు,ఒకదేశంలో మైనారిటీ వర్గంగా ఉన్నవారు చాలా సురక్షితంగా ఉండాలి, అందుకు వీలుగా బంగ్లాదేశ్ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని మేం ఆశాభావంతో ఉన్నాం" అన్నారు. కాగా దీపూ చంద్ర దాస్ హత్యకేసులో మరో ఇద్దరిని ఆదివారంనాడు బంగ్లాదేశ్ పోలీసులు అరెస్టు చేశారు. దీంతో ఇప్పటివరకూ ఈ కేసులో అరెస్టుల సంఖ్య 12కు పెరిగింది.

# ఉక్రేన్‌లో 13 ప్రాంతాలపై రష్యా దాడులు : ముగ్గురు మృతి

**కీవ్ :** ఉక్రేన్‌పై డ్రోన్లు, క్షిపణులతో రష్యా దాడులు ఉద్ధృతం చేసింది. రష్యా సైన్యంలో ఆపరేషనల్ ట్రైనింగ్ విభాగం అధిపతి లెఫ్టినెంట్ జనరల్ ఫనిల్ సర్వరోవ్ (56) దక్షిణ మాస్కోలో సోమవారం ఉదయం కారు బాంబు పేలుడు ఘటనలో మరణించిన నేపథ్యంలో ఉక్రేన్‌లోని 13ప్రాంతాలపై దాడుల తీవ్రత పెంచింది. మంగళవారం తెల్లారకముందుగానే రష్యా దాడులు చేసింది. 600 డ్రోన్లు, 36 క్షిపణులను ఈదాడులకు రష్యా సైన్యం ఉపయోగించింది. ఈ దాడుల్లో నాలుగేళ్ళ బాలుడు సహా ముగ్గురు మరణించారు. ఇళ్ళు, పవర్ గ్రిడ్ విభాగాలపై దాడులు చేసింది. ఉక్రేన్ స్పెషల్ సర్వీసెస్ విభాగమే తమ సైనిక ప్రముఖులను చంపుతోందని రష్యా పూర్తిగా విశ్వసించింది. ఇప్పటికే ముగ్గురు రష్యన్ అధికారులు ఇదేవిధంగా బాంబు దాడుల్లో మరణించారు. రష్యా సాయుధ దళాల ఆపరేషన్ శిక్షణా విభాగంలో డైరెక్టర్ జనరల్‌గా పనిచేస్తున్న సర్వరోవ్ మరణించినట్లు రష్యన్ ఇన్వెస్టిగేటివ్ కమిటీ ప్రతినిధి చెప్పారు. ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ రష్యా దాడులపై స్పందిస్తూ, తమ దేశాన్ని శిక్షించాలని పుతిన్ కోరుకుంటున్నారన్నారు. అమెరికా చేస్తున్న శాంతి ప్రయత్నాలపట్ల పుతిన్‌కు ఎంతమాత్రం చిత్తశుద్ధి లేదని జెలెన్స్కీతోపాటు యూరోపియన్ యూనియన్ నాయకులు కూడా విమర్శించారు. రష్యా దేనికి ప్రాధాన్యత ఇస్తోందో ఈ దాడులవల్ల స్పష్టంగా తెలిపోయిందని అన్నారు. క్రిస్మస్ వేడుకలకు ముందు నుండీ ప్రజలు తమ కుటుంబాలతో హాయిగా గడపాలని కోరుకుంటారని, కానీ పుతిన్ మాత్రం ఆ విచక్షణ లేకుండా వరుస దాడులు చేస్తున్నారని, ఇళ్ళకు భద్రత లేకుండా చేస్తున్నారని విమర్శించారు. క్రిస్మస్ వేడుకలకు ముందుగా డిసెంబరు 23,24,25 తేదీలలో ఉక్రేన్ ప్రజలపై దారుణమైన దాడులు చేయడం రష్యాకు గడచిన నాలుగు సంవత్సరాలుగా ఒక అలవాటుగా మారిందని జెలెన్స్కీ విమర్శించారు.



## ఫలితాలు రావ్

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ రైజింగ్–2047 విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేశామని, రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ జోన్‌లుగా విభజించి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించుకుంటున్నామని వివరించారు.

**26లోగా కార్యాలయాలన్నీ ప్రభుత్వ భవనాలలోకి మారాలి**

అద్దె భవనాలలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను ఖాళీ చేసి జనవరి 26వ తేదీ లోపు ప్రభుత్వ భవనాలలోకి మారాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాలలో ఉండకూడదని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుందని సిఎం స్పష్టం చేశారు. ప్రతీ సెక్రటరీ తమ శాఖలలో ఉన్న రెగ్యులర్, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు సంబంధించి పూర్తి వివరాలు జనవరి 26వ తేదీలోగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అందించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అందాల్సిన జీతాలు, ఈపిఎఫ్, ఈఎస్ఐ సదుపాయం అందుతున్నాయో లేదో సంబంధిత శాఖాధిపతులు పరిశీలించాలని సూచించారు. ఈ ప్రక్రియను జనవరి 26వ తేదీ లోగా పూర్తి చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు.

## సార్వత్రిక సమ్మె

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించే కార్మికుల జాతీయ సదస్సులో నిర్దేశిత ఒక రోజు సమ్మె పిలుపును లాంఛనంగా ఆమోదిస్తారు. దాంతోపాటే సమ్మె కార్యాచరణకు సంబంధించిన సవిరణాత్మకమైన ప్రణాళికను కూడా ఈ జాతీయ సదస్సులో రూపొందిస్తారు. కేంద్ర ప్రభుత్వం లేబర్‌కోడ్స్‌ను ఆమోదించి చట్టరూపంలోకి తీసుకువచ్చింది. యావత్ వ్యవస్థాగత ప్రభుత్వ యంత్రాంగం, మీడియా, ప్రభుత్వ రంగ యాజమాన్యాలను ఉపయోగించుకోవడం ద్వారా అమానుషమైన లేబర్‌కోడ్స్ చుట్టూ ఒక సానుకూలమైన వాతావరణాన్ని సృష్టించేందుకు తీవ్రమైన ప్రయత్నాలు చేపట్టింది. అదేసమయంలో కేంద్ర కార్మిక సంఘాలు తమ పూర్తి శక్తిసామర్థ్యాలను ఉపయోగించి ప్రభుత్వ ఏకపక్ష చర్యలను వ్యతిరేకిస్తూ, లేబర్‌కోడ్స్‌ను రద్దు చేయించేందుకు పోరాటాలకు సన్నద్ధమయ్యాయి.

దేశవ్యాప్తంగా కార్మికులు సార్వత్రిక సమ్మెకు సన్నద్ధమవుతున్న పరిస్థితుల్లో కూడా కేంద్ర ప్రభుత్వం గనుక లేబర్‌కోడ్స్‌ను రద్దు చేయకుండా అందులో ఉన్న నిబంధనలను అమలు చేసేందుకే ప్రయత్నం చేస్తే కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక ఇక తదుపరి అనేక రోజులపాటు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె చేపట్టడంతోపాటు బలమైన కార్యాచరణ అమలు చేసేందుకే కట్టుబడి ఉంటుందని, దీంతోపాటు వివిధ విభాగాలకు చెందిన కార్మిక సంఘాలు కూడా విడివిడిగా ప్రతిఘటన కార్యాచరణకు పూనుకుంటాయని జెపి సిటియు మంగళవారం ఒక ప్రకటన ద్వారా హెచ్చరిక చేసింది. ఎఐటియుసి, ఐఎన్‌టియుసి, హెచ్‌ఎంఎస్, సిఐటియు, ఎఐయుటియుసి, టియుసిసి, ఎస్‌ఇడబ్ల్యు, ఎఐసిసిటియు, ఎల్‌పిఎఫ్, యుటియుసి, ఇతర విభాగాలకు చెందిన సమాఖ్యలు, అసోసియేషన్లు ఈ ఉమ్మడి ప్రకటనపై సంతకాలు చేశాయి.

అదేవిధంగా విద్యుత్ ఉద్యోగులు–ఇంజనీర్ల జాతీయ సమన్వయ కమిటీ (ఎన్‌సిసిఓఇఇ) కూడా అదేరోజున (ఫిబ్రవరి 12వ తేదీ) విద్యుత్ కార్మికులు, ఇంజనీర్ల జాతీయస్థాయి సమ్మె నిర్వహిస్తామని ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ఆమోదించిన ప్రమాదకరమైన "శాంతి చట్టాన్ని" వ్యతిరేకిస్తూ మంగళవారం (డిసెంబరు 23) దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు జరపాలని ఎన్‌సిసిఓఇఇ, జెపిసిటియు, ఎస్‌కెఎం (సంయుక్త కిసాన్ మోర్చా) ఉమ్మడి సమావేశం ఇప్పటికే నిర్ణయించి అమలు చేసింది. కాగా విత్తన బిల్లు–2025, విద్యుత్ సవరణ బిల్లు–2025, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి బదులుగా కేంద్రం తెచ్చిన విబి జీ రామ్ జీ చట్టం–2025లకు వ్యతిరేకంగా, ప్రజల ఇతర డిమాండ్లకు మద్దతుగా సంయుక్త కిసాన్ మోర్చా జనవరి 16న (2026) గ్రామాలు, బ్లాక్ స్థాయిలో పూర్తి స్థాయి కార్యచరణ చేపడుతుంది.

**మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలు**

మోదీ ప్రభుత్వం పార్లమెంటు లోపలా–వెలుపలా ప్రజా వ్యతిరేక నిర్ణయాలకు పాల్పడుతోందని జెపి సిటియు తన ప్రకటనలో విమర్శించింది. ఇటీవలికాలంలో ప్రజలకు వ్యతిరేకంగా, వారికి హాని తలపెట్టేవిధంగా ఐదు ప్రధాన నిర్ణయాలు తీసుకుంది. లాభాపేక్షతో ప్రజల భద్రతను కేంద్ర ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోకుండా 'శాంతి చట్టం' (సస్టెయినబుల్ హార్నెస్సింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ నూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫామింగ్ ఇండియా) తెచ్చింది. ఈ చట్టంఅమలులోకి వస్తే ప్రైవేటు వ్యక్తులు పౌరుల విద్యుత్ అవసరాల నిమిత్తం అణు ఇంధనాన్ని ఉత్పత్తి చేయడం ప్రారంభిస్తారు. ప్రజల భద్రతను పణంగా పెట్టి లాభాలకోసమే కేంద్రం ఈ చర్యలకు దిగింది. పౌరుల విద్యుత్ అవసరాలు తీర్చడంకోసం అణు ఇంధనాన్ని ఉత్పత్తి చేస్తున్నప్పుడు ఎలాంటి ప్రమాదాలు సంభవించినాగానీ విదేశీ కంపెనీలకు ఏ బాధ్యతా ఉండదు. ఈ చట్టంలో ఆ విధమైన నిబంధనలు తెచ్చారు. ఉత్పత్తి చేసినవారిని ప్రమాద సమయాల్లో బాధ్యులుగా చేయకుండా దేశ అణు భద్రతను, సార్వభౌమాధికారాన్ని కేంద్ర ప్రభుత్వం పణంగా పెట్టి ఈ చట్టం తెచ్చింది.

మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి ఆ స్థానంలో విబి జీ రామ్ జీ (వికసిత్ భారత్–రోజ్‌గార్ హామీ–అజీవిక మిషన్) చట్టం–2025ను ఇటీవల కేంద్రం పార్లమెంటులో ఆమోదించింది. ఈ కొత్త చట్టం వల్లల గ్రామీణ ఉపాధి హామీ హక్కులు ప్రమాదంలో పడ్డాయి. ప్రజలు ఉద్యోగాలు లేకుండా సంకట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఇప్పటివరకూ ఉన్న చట్టం ద్వారా ఉపాధి హామీ లభించింది. కొత్త చట్టంవల్ల ఈ ఉపాధి హామీ ఇచ్చేందుకు ఉద్దేశించిన నిధులభారం ఇకమీదట రాష్ట్రాలపై కూడా పడుతుంది. అసలే రాష్ట్రాలు అస్తవ్యస్థమైన పన్నుల విధానంవల్ల లోటు బడ్జెట్టులలో నడుస్తున్నాయి. పంటల సమయంలో ఈ చట్టం కార్మికులకు ఉపాధిహామీని లేకుండా చేసింది. భూస్వాములకు చాలా చవగ్గా కార్మికులు అందుబాటులోకి వచ్చేవిధంగా కొత్త విబి జీ రామ్ జీ చట్టాన్ని కేంద్రం తెచ్చింది.

బీమా రంగంలో నూటికి నూరుశాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతిస్తూ కేంద్ర ప్రభుత్వం ఒక చట్టాన్ని తీసుకువచ్చింది. ఆచరణాత్మకంగా విదేశీ ప్రైవేటు వ్యక్తులకు మనదేశంలో ఉన్న బీమా కంపెనీలలో హక్కులు ఇచ్చేవిధంగా ఈ చట్టం తెచ్చారు.

వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు–2025ను పార్లమెంటు ఉభయసభల్లో కేంద్రం ప్రవేశపెట్టింది. ఐతే ఈ సమావేశాల్లో ఈ బిల్లు ఇంకా ఆమోదం పొందలేదు. అదేవిధంగా ముసాయిదా విత్తన బిల్లు, ముసాయిదా విద్యుత్ సవరణ బిల్లు–2025లను కూడా కేంద్రం తీసుకువచ్చింది.

ఈ బిల్లులు ఆమోదం పొందితే దేశ వ్యవసాయరంగంపై వినాశకరమైన ప్రభావం పడుతుంది. దేశీయ, సూక్ష్మ,చిన్న,మధ్య తరహా విద్యుత్ వినియోగదారులు, ప్రభుత్వ విద్యుత్ రంగాలు తీవ్ర సమస్యల్లో పడతాయి. అదేవిధంగా ఉత్తర భారతదేశంలో నెలకున్న ప్రస్తుత వాతావరణ సంక్షోభాన్ని కూడా కేంద్ర కార్మిక సంఘాలు తీవ్ర అంశంగా పరిగణనలోకి తీసుకున్నాయి. ఢిల్లీ–ఎన్‌సిఆర్‌లో దారుణమైన కాలుష్యం రాజ్యమేలుతోంది. సుప్రీంకోర్టు ప్రమాదకరమైన ఉత్తర్వులు ఇచ్చింది. థార్ ఎడారి విస్తరించకుండా ఉత్తర భారతదేశాన్ని రక్షిస్తున్న ఆరావళి పర్వతాలు ఈ ఉత్తర్వు వల్ల 90 శాతం మేరకు నాశనమయ్యే పరిస్థితులు వస్తాయి. అందువల్ల ఈ అమానుషమైన చట్టాలకు వ్యతిరేకంగా పోరాటం చేసే ప్రజలకు, ఉద్యమాలకు కేంద్ర కార్మిక సంఘాలు తమ బలమైన సంపూర్ణ సంఘీభావాన్ని అందిస్తాయని జెపి సిటియు ప్రకటన పేర్కొంది.

## పాపం బిఆర్‌ఎస్‌దే

(మొదటి పేజీ తరువాయి)

చర్చకు తాము సిద్ధమని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ హయాంలో ఒక్క ప్రాజెక్ట్ అయినా సంతృప్తిగా పూర్తయిందా ? అని అన్నారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ బిఆర్‌ఎస్ పదేళ్ల కాలంలో మొత్తం రూ. 17,77లక్షల కోట్ల బడ్జెట్‌లో నీటిపారుదలకు కేవలం రూ. 1,83 లక్షల కోట్లను మాత్రమే ఖర్చు చేశారని, ఇందులోనూ ఒకే ప్రాజెక్ట్‌కు పెద్ద మొత్తంలో ఖర్చు చేసి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో మూడు బ్యారేజీలు కూలిపోయాయయని ఉత్తమ్ వివరించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్ విషయంలో సవరణలు చేస్తూ రూ. 55,086 కోట్ల డిపిఆర్‌ను గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం సిడబ్ల్యుసికి సమర్పించిందని, ఇందులో భూసేకరణకు అయ్యే ఖర్చులను కూడా పొందుపర్చలేదని వివరించారు. బిఆర్‌ఎస్ పదేళ్ల కాలంలో కేవలం 30నుంచి 35 శాతం పనులను మాత్రమే పూర్తి చేసిందన్నారు. తాము అధికారంలోనికి వచ్చాక రూ. 7వేల కోట్లతో 11 పంపులను ఇన్‌స్టాల్ తదితర పనులను పూర్తి చేశామన్నారు. కృష్ణట్రిబ్యూనల్ తుది నిర్ణయం వరకు తెలంగాణకు 34 శాతం, ఆంధ్రకు 66 శాతం అని కెసిఆర్ అంగీకరించారని, ఇందులో పాలమూరు రంగారెడ్డితో పాటు పాలమూరు, నల్లగొండ జిల్లాకు చెందిన ప్రాజెక్ట్‌లకు కేటాయింపులు చేయకుండా అన్యాయం చేశారని మండిపడ్డారు. రాయలసీమ ప్రాజెక్ట్ ద్వారా రోజూ 3 టిఎంసిల నీటిని ఎపి తరలించుకునేందుకు కెసిఆర్ దోహదపడ్డారని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు.

10లక్షల ఎకరాల నీటి కేటాయింపులను 'జూరాల' నుంచి శ్రీశైలంకు తరలించారు...

నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నిమ్మితం పూర్తిగా తెలంగాణ నియంత్రణలో ఉండే జూరాల ప్రాజెక్ట్‌కు 10లక్షల ఎకరాలతో ప్రణాళికను రూపొందిస్తే, తెలంగాణ రాష్ట్రంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఆ పది లక్షల ఎకరాల నీటి కేటాయింపులను శ్రీశైలం రిజర్వాయర్‌కు బదిలీ చేశారని, ఈ రిజర్వాయర్ తెలంగాణ, ఆంధ్రకు ఉమ్మడిదని, తద్వారా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు అన్యాయం చేశారని ఆరోపించారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 2014 నుంచి తెలంగాణ రాష్ట్రం ఏర్పడి, బిఆర్‌ఎస్ పదేళ్ల అధికారాన్ని ముగిసే వరకు కూడా కల్వకుర్తి, బీమ, నెట్టెంపాడు, కోయల్ సాగర్ ప్రాజెక్ట్‌లు పెండింగ్‌లోనే ఉన్నాయని ఉత్తమ్ తెలిపారు.

## త్వరలో నోటీసులు?

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వబోతున్నట్లుగా తెలుస్తోంది. ఇక ఫోన్ ట్యాపింగ్ ఎవరి కోసం చేశారు? ఎవరి ఆదేశాల మేరకు చేశారన్న దారిపై సిట్ ప్రధానంగా ఫోకస్ పెట్టింది. ఈ నేపథ్యంలోనే మాజి సిఎం కెసిఆర్‌తో పాటు మాజీ మంత్రి హరీశ్ రావుకు నోటీసులు ఇచ్చి విచారణకు పిలవాలని యోచిస్తున్నట్లుగా సమాచారం.

అయితే, ఎంక్వైరీలో ప్రభాకర్ రావు పదేపదే అప్పటి డిజిపి మహేందర్ రెడ్డితో పాటు అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్ అనిల్ కుమార్ పేర్లను ప్రస్తావనకు తెస్తున్నట్లుగా సిట్ చీఫ్ సజ్జనార్ గుర్తించారు. ఇప్పటికే ఈ కేసులో మహేందర్ రెడ్డి స్టేట్‌మెంట్‌ను అధికారులు రికార్డు చేసిన విషయం తెలిసిందే. దీంతో అసెంబ్లీ సమావేశాల అనంతరం ఫోన్ ట్యాపింగ్ కేసులో ఊహించని పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది.

**ఎఫ్ఎస్ఎల్ ఇచ్చిన రిపోర్టు ఆధారంగా..**

అదేవిధంగా ఫోన్ ట్యాపింగ్ రివ్యూ కమిటీలో సభ్యులైన మాజీ సిఎస్‌లు సోమేష్ కుమార్, శాంతికుమారి, ఇతర అధికారులు తిరుపతి, శేషాద్రిలను సిట్ విచారించిన విషయం తెలిసిందే. అయితే, తమ దగ్గరికి ప్రభాకర్ రావు కొన్ని వేల నెంబర్లు తీసుకొచ్చారని వారు పేర్కొన్నారు. ఎస్‌బిఐ మీద ఉన్న నమ్మకంతో సంఘ విద్రోహులు, మావోయిస్టులు, టెర్రరిస్టులపై ఫోకస్ పెడతారని ఆ నెంబర్లను తాము వెరిఫై చేయలేకపోయామని సమాధానమిచ్చారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎఫ్ఎస్ఎల్ ఓ ప్రముఖ న్యూస్ ఛానల్ ఎండి శ్రవణ్ రావు, మాజీ డిఎస్‌పి ప్రణీత్ రావుకు మధ్య సంభాషణలను రీట్రీవ్ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆ డేటాను ఆధారంగా చేసుకుని సిట్ మాజి సిఎం కెసిఆర్, మాజీ మంత్రి హరీశ్ రావులకు నోటీసులు ఇస్తారనే ముచ్చట పొలిటికల్ సర్కిల్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

### మార్పులను అందిపుచ్చుకుని ముందుకు సాగితే..

# సింగరేణి సుస్థిర భవిష్యత్

### కార్మికుల భద్రత, సంక్షేమం, నైపుణ్యాభివృద్ధే ప్రాధాన్య అంశాలు

**సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో ఇన్‌చార్జి సిఎండి డి.కృష్ణ భాస్కర్**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సింగరేణి సంస్థ బలం కేవలం ఉత్పత్తిలో కాదని, తరతరాల శ్రమ, క్రమశిక్షణ, పరస్పర నమ్మకంతో పనిచేస్తున్న కార్మికులేనని సింగరేణి ఇన్‌చార్జి చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ డి.కృష్ణ భాస్కర్ అన్నారు. గత137 ఏళ్లుగా సింగరేణి దృఢంగా నిలబడటం వెనక కార్మికుల కృషి ఉందని తెలిపారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో మంగళవారం జరిగిన సింగరేణి ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. కార్మికుల భద్రత, సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి ప్రధాన ప్రాధాన్యాలని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే అమలులో ఉన్న పథకాలను మరింత మెరుగుపరచడం, పని పరిస్థితులను మరింత సురక్షితంగా చేయడమే లక్ష్యమన్నారు. ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా ప్రతీ ఒక్కరం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఏడాది ఎన్నో వాతావరణ ప్రతికూలతలు, సాంకేతిక సవాళ్లు, మార్కెట్ మార్పులు ఉన్నప్పటికీ భద్రత ప్రమాణాలను పాటిస్తూ వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ ముందుకు సాగినట్లు గుర్తు చేశారు. ఈ ప్రయత్నంలో ప్రతీ గని కార్మికుడు, సూపర్ వైజర్, అధికారి చూపిన బాధ్యతలను ఆయన ప్రశంసించారు. సింగరేణి భవిష్యత్‌పై అందరం ప్రశ్నించుకోవాలని, వాటికి సమాధానాలు వెతుక్కోవాల్సిన బాధ్యత మనదే అన్నారు. ఈ దిశలోనే ఉత్పత్తి సామర్థ్యం, సంస్థ స్థిరత్వం, భవిష్యత్తు అవకాశాల కోసం మన అనుభవం, సామర్థ్యంతో రాణించే ఇతర రంగాలపైనా దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో, కీలక ఖనిజాలు, అనుబంధ రంగాల్లో అవకాశాలు ఉన్నాయా అనే అంశాన్ని పరిశీలించడం ప్రారంభించామన్నారు. ఈ అంశాలు ఇంకా ఆలోచన దశలోనే ఉన్నప్పటికీ, భవిష్యత్తును నిర్లక్ష్యం చేయకుండా ముందే సిద్ధమవ్వాలన్న భావనతోనే ప్రయత్నాలు సాగిస్తున్నామని వివరించారు. ఇంధన రంగంలో జరుగుతున్న మార్పులను గమనిస్తూ, పునరుత్పాదక శక్తి వంటి రంగాల్లో సింగరేణి ఏ పాత్ర పోషించగలదనే దానిపై కూడా ఆలోచన చేస్తున్నట్లు వెల్లడించారు. మన పనితీరును మరింతగా మెరుగు పరచుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. సరైన వేగంతో, సరైన దిశలో, పరస్పర విశ్వాసంతో ముందుకు సాగితే సింగరేణి తన సుస్థిరతను కాపాడుకుంటూ మారుతున్న కాలానికి తగినట్టుగా మారగలదన్న నమ్మకం ఉందని ఆయన భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.వెంకన్న, అడ్వైజర్ ఫారెస్ట్రీ మోహన్ పరిగెన్, జనరల్ మేనేజర్ టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కోట్లలో అక్రమాస్తులు

(మొదటి పేజీ తరువాయి)

డాక్యుమెంట్స్, బంగారం స్వాధీనం చేసుకున్నట్టు ఎసిబి డిఎస్‌పి శ్రీధర్ తెలిపారు. హైదరాబాద్, నిజామాబాద్, కామారెడ్డి ప్రాంతాల్లో అక్రమ ఆస్తులను గుర్తించామన్నారు. హైదరాబాద్‌లో ఆరు చోట్ల, నిజామాబాద్‌లో మూడు చోట్ల, నారాయణఖేడ్‌లో 3 చోట్ల సోదాలు నిర్వహించినట్లు తెలిపారు. నారాయణఖేడ్‌లో 30 ఎకరాలు, నిజామాబాద్‌లో 10 ఎకరాల భూమికి సంబంధించి అక్రమ ఆస్తులను గుర్తించినట్లు వెల్లడించారు. పాట్ మార్కెట్ లోని అజిత్ గోల్డ్ దుకాణంలో కిషన్ నాయక్ పేరిట ఉన్న బంగారాన్ని తీసుకువచ్చి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఒక కిలో బంగారంతో పాటు, నిజామాబాద్‌లో లహరి అంతర్జాతీయ హోటల్, అపార్ట్‌మెంట్లకు సంబంధించిన పత్రాలను గుర్తించారు. డాక్యుమెంట్ విలువ ప్రకారం రూ.12 కోట్ల పైగా అక్రమ ఆస్తులు గుర్తించామని, బహిరంగ మార్కెట్లో వాటి విలువ రెండింతలు ఉండవచ్చని ప్రాథమికంగా అంచనాకు వచ్చామని ఎసిబి డిఎస్‌పి తెలిపారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని అతని బంధువు విజయ్ ఇంట్లో పలు డాక్యుమెంట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. కిషన్ నాయక్‌ను కస్టడీలోకి తీసుకొని మరిన్ని వివరాలు తెలుసుకుంటామని ఎసిబి అధికారులు చెప్పారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## జిఓలు పబ్లిక్ డొమైన్లో పెట్టండి
### రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వ జిఒలను వెంటనే పబ్లిక్ డొమైన్‌లో పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. ప్రభుత్వ ఉత్తర్వులు, నోటిఫికేషన్స్, రూల్స్, జిఒలు, సర్క్యులర్స్ అన్నింటినీ ప్రభుత్వ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలంటూ బిఆర్‌ఎస్‌కు చెందిన ఎర్రోళ్ల శ్రీనివాస్ వేసిన పిటిషన్‌ను జస్టిస్ సూరేపల్లి నందా మంగళవారం విచారించారు. 2022లో హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వుల మేరకు జిఒలను అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. జిఒలను పబ్లిక్ డొమైన్‌లో పెట్టి ప్రజలకు అందుబాటులో ఉండేలా చేయాలన్నారు. 2023 డిసెంబరు నుంచి 2025 జనవరి వరకు 19064 జిఒలు జారీ చేస్తే అందులో 3290 జిఒలే ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. 15,774 జిఒలు అందుబాటులో లేవు. జిఒలను అధికారిక వెబ్‌సైట్‌లో పెట్టాలంటూ రాష్ట్ర ప్రభుత్వం 2017లో జిఒ ఇచ్చింది. ఆ జిఒను అమలు చేయాలని 2022లో డివిజన్ బెంచ్ తీర్పు చెప్పింది. అయినప్పటికీ ప్రభుత్వం జిఒలను అప్‌లోడ్ చేయకుండా గుట్టుగా ఉంచింది.. అని పిటిషనర్ వాదన. దీనిపై న్యాయమూర్తి జిఒలను వెబ్సైట్లో అప్లోడ్ చేయాలని ప్రభుత్వానికి ఆదేశించి పిటిష్న విచారణ ముగించారు.

## పేరు మార్చిన నూతన చట్టంతో
# ఉపాధిహామీ పథకం విధ్వంసం

### కేంద్రంతీరును నిరసిస్తూ వామపక్షాల ఆందోళన

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం పేరును మార్చుతూ గ్రామీణ్ విబి జి రామ్ జి–2025ను తీసుకురావడానికి నిరసిస్తూ సిపిఐ, సిపిఎం, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లాకేంద్రంలోని సుభాష్ సెంటర్‌లో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్ కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్‌కె హాశం, న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి సాగర్‌లు మాట్లాడుతూ ఉపాధి హామీ వ్యవస్థను విధ్వంసం చేసేందుకే కేంద్ర ప్రభుత్వం నూతన చట్టం తెచ్చిందని ఆరోపించారు. నిరసన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, బోలుగూరి నరసింహ, నల్పరాజు రామలింగయ్య. వి.లెనిన్, ఎండి అక్బర్, సుజాత, విజయ, ముండ్ల ముత్యాలు, దోటి పండరి, అక్కలయ్య, వీరయ్య, షరీఫ్ మదర్, సిపిఐఎం జిల్లా నాయకులు బండ శ్రీశైలం, పి.ప్రభావతి, సలీం, పట్టణ కార్యదర్శి దండంపెల్లి సత్తయ్య, ఔటర్ రవీందర్, తుమ్మల పద్మ, కృష్ణారెడ్డి, న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు చిరంజీవి, బొంగురాల నరసింహ, బివి చారి, రావుల నరేష్, కల్లూరి అయోధ్య పాల్గొన్నారు.


హయత్‌నగర్(రంగారెడ్డి)..

### బిజెపి కుట్రలు తిప్పికొట్టాలి

**హయత్‌నగర్:** గ్రామీణ పేదలకు ఉపాధిని దూరం చేసే బిజెపి కుట్రలను తిప్పికొట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్ర చారి పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా హయత్ నగర్ మండల సమితి ఆధ్వర్యంలో మండల కార్యదర్శి శేషరాజుపల్లి శ్రీదేవి అధ్యక్షతన ఏర్పాటు చేసిన నిరసన దీక్ష కార్యక్రమానికి రవీంద్ర చారి, ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ జిరామ్‌జి చట్టాన్ని తక్షణమే రద్దు చేసి ఉపాధి చట్టాన్ని యధావిదంగా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమం లో సిపిఐ మండల సహాయ కార్యదర్శిలు మర్రి శోభన్, కర్నే సుజాత, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి సామిడి వంశీవర్ధన్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు బొంగు అరుణ్‌కుమార్‌గౌడ్, ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు మండల కార్యదర్శి సరిత, మందుల కృష్ణ, పారిజాత, సౌజన్య, సుమతి, యమునా, కళ్యాణి, అనిత, అలివేణి, ఆదిలక్ష్మి, వీరస్వామి, జానీ, గిరి, ఉపేందర్, రాములు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


నల్లగొండలో..


### గాంధీని అవమానించడమే..

**హుజూర్‌నగర్:** కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకం పేరులోని జాతిపిత మహాత్మాగాంధీ పేరును తొలగించడం దేశ చరిత్రను అవమానించడమేనని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని సిపిఐ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ పేరును తొలగించడాన్ని నిరసిస్తూ నిరసన వ్యక్తం చేసి గాంధీపార్కులోని మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు దేవరం మల్లీశ్వరి, దొంతగాని సత్యనారాయణ, జడ శ్రీనివాస్, మామిడి వెంకయ్య, సోమగాని కృష్ణ, కందుల వెంకటేశ్వర్లు, కొప్పోజు సూర్యనారాయణ, గుండా రమేష్, యల్లావుల ఉమా, సుందరి పద్మ, పొనుగులేటి వాసుదేవరావు, శ్యామ్‌సన్, బత్తిని మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

### పేరు మార్చడం కేంద్రానికి సిగ్గుచేటు

**గరిడేపల్లి:** ఉపాధి పథకానికి మహాత్మాగాంధీ పేరును తొలగించడం కేంద్రానికి సిగ్గుచేటని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు అన్నారు. సూర్యాపేట జిల్లా గరిడేపల్లిలో సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, సహాయ కార్యదర్శి పోటు పూర్ణచందర్‌రావు, మండల కార్యవర్గ సభ్యులు త్రిపురం సుధాకర్‌రెడ్డి, అంజిరెడ్డి, కిరణ్, తాళ్ల తిరపయ్య, నబీ, మస్తాన్, పీర్‌సాహెబ్, నర్సింరావు, గోవిందు, కట్ట అశోక్, కుందురు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మునగాల(సూర్యాపేట)..


గరిడేపల్లి(సూర్యాపేట)..


### జి రామ్‌జి చట్టాన్ని రద్దు చేయాలి

**నిర్మల్ టౌన్ :** జిల్లా కేంద్రంలో గాంధీ విగ్రహం ఎదుట ఎంజిఎన్‌ఆర్‌ఈజిఎస్ పథకాన్ని రద్దుచేసి తెచ్చిన జిరామ్‌జి చట్టాన్ని రద్దు చేయాలని వామపక్షాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా వామపక్ష నాయకులు నందిరామయ్య, దుర్గం నూతన్ కుమార్, ఎస్.ఎన్.రెడ్డి, జే.రాజు, కే.రాజన్న, సురేష్ మాట్లాడుతూ జీ రామ్ జీ చట్టం రద్దు అయ్యే వరకు పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు కె.లక్ష్మి, మహమూద్, రామ్ లక్ష్మణ్, బక్కన్న, సుజాత, వెంకటేష్, నారాయణ, గంగన్న పాల్గొన్నారు.

### నూతన చట్టాన్ని ఉపసంహరించాలి

**కరీంనగర్:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని రద్దుచేసి కొత్త చట్టం తేవడాన్ని నిరసిస్తూ మంగళవారం గాంధీ రోడ్డులోని గాంధీ విగ్రహం వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో తట్టలు, పారలు చేతబూని నిరసన ధర్నా చేశారు. కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, ఎఐఎఫ్‌బి రాష్ట్ర కన్వీనర్ అంబటి జోగిరెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లానాయకులు జిందం ప్రసాద్ మాట్లాడారు. కూలీలు ఉపాధి ఎగ్గొట్టేందుకే పేరు మార్పు అని, నిధులు నిలుపుదల చేయుటకు ఈకుట్ర అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని, కేంద్ర ప్రభుత్వమే నిధులు మంజూరు చేయాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వామపక్షనేతలు గుడి కందుల సత్యం, గీట్ల ముకుంద రెడ్డి, పిట్టల సమ్మయ్య, పైడిపల్లి రాజు, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, సత్యరావు, రాజశేఖర్, మల్లేశం రాజేశం, అజయ్ గజ్జల శ్రీకాంత్, జి.తిరుపతి నాయక్, గామినేని సత్యం, బాకం అంజయ్య, చెంచల మురళి, పుల్లెల మల్లయ్య, రాయి కంటి శ్రీనివాస్, రమేష్, శ్రీనివాస్ రెడ్డి, వినయ్, శ్రీనివాస్,రాకేష్, సాయికుమార్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.


నిర్మల్‌లో...



మహబూబ్‌నగర్‌లో...


వరంగల్‌లో..

### వికసిత్ భారత్ పేరుతో దోచుకునే నియంతృత్వ చట్టాలు

**వరంగల్ :** గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించే చట్టబద్ధ హక్కును తీసివేసే కుట్రలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ రోజ్ గార్ అజివిక మిషన్ గ్రామీణ్ (విబిజిరాంజి) చట్టాన్ని తీసుకువచ్చిందని, తక్షణమే ఈచట్టాన్ని రద్దు చేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని లేకపోతే దారిద్ర రేఖకు దిగువనున్న పేదలకు తీవ్రమైన నష్టం చేకూరుతుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్, ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ గ్రేటర్ కార్యదర్శి రాచర్ల బాలరాజు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్ అన్నారు. వామపక్ష పార్టీల పిలుపుమేరకు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వికసిత్ భారత్ జిరామ్‌జి అనే నూతన చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్లో ప్లకార్డ్స్ ధరించి నిరసన వ్యక్తం చేస్తూ చట్ట ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో సిపిఐ నగర నాయకులు జన్ను రవి, జాన్ పాల్, చిట్యాల, సువర్ణ, లలిత ఎంసిపిఐ(యు) నగర కార్యదర్శి మాలోత్ సాగర్, జిల్లా నగర సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, సుంచు జగదీశ్వర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ముక్కెర రామస్వామి, ఏరియా కార్యదర్శులు మహమ్మద్ మెహబూబ్ భాష, పరిమళ గోవర్ధన్, రాజు, ప్రభాకర్, అప్పనపురి నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

### నూతన చట్టంతో ఉపాధి నిర్వీర్యం

**మహబూబ్‌నగర్ :** గ్రామీణ ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నూతన చట్టం తెచ్చిందని వామపక్షాల నాయకులు ఆరోపించారు. నూతన చట్టాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని వామపక్షాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అల్వాల్ రెడ్డి, సిపిఎం నాయకులు కిల్లె గోపాల్, ఎన్.కురుమూర్తి, బొల్లె చంద్రకాంత్, రాజ్ కుమార్, ప్రశాంత్ చారి, సిపిఐ జిల్లా నాయకులు కోటకదిరి నరసింహ, ఇందిరా, సత్యనారాయణ రెడ్డి, లక్ష్మణ్, సుందర్ , రాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# బోడ సుదర్శన్ మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటు

### నివాళులర్పించిన సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/వలిగొండ :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) యాదాద్రి భువనగిరి జిల్లా కార్యవర్గ సభ్యుడు, నిరంతర ప్రజా పోరాట యోధుడు బోడ సుదర్శన్ మరణం పార్టీకి, ఈ ప్రాంతానికి తీరని లోటని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం యాదాద్రి జిల్లా వలిగొండ మండలం వెంకటాపురం గ్రామంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి సుదర్శన్ పార్థివ దేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ సుదర్శన్ గత నాలుగు దశాబ్దాలుగా పార్టీ కోసం అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. మోత్కూర్ కేంద్రంగా విద్యార్థి ఉద్యమాలలో క్రియాశీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. 15 ఏళ్ల పాటు వలిగొండ మండల కార్యదర్శిగా, జిల్లా కార్యవర్గ సభ్యుడిగా పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమించారని తెలిపారు. నిరంతరం ప్రజా సమస్యలపై పట్టువదలని పోరాటాలు చేసి, సామాన్యుల మనసు గెలుచుకున్న నాయకుడని ఆయన స్మరించుకున్నారు. 'సుదర్శన్ భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన చేసిన సేవలు, సాగించిన ఉద్యమాలు ఈ ప్రాంత ప్రజల గుండెల్లో నిరంతరం నిలిచి ఉంటాయన్నారు.



**చెరగని ముద్ర : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ దివంగత నేత మాజీ ఎమ్మెల్యే గుర్రం యాదగిరి రెడ్డి, అమరజీవి సురవరం సుధాకర్ రెడ్డి పార్లమెంటు సభ్యుడిగా ఉన్న సమయంలో వారి నిధుల ద్వారా ఈ ప్రాంతంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంలో సుదర్శన్ కీలక భూమిక పోషించారని గుర్తుచేసుకున్నారు. జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ సుదర్శన్ మృతి జిల్లా ఉద్యమానికి తీరని లోటుగా పేర్కొన్నారు. వలిగొండ మండల కేంద్రంలో జిల్లా మూడో మహాసభను విజయవంతంగా నిర్వహించారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొల్లూరి రాజయ్య, జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, చెడే చంద్రయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు, ఎషాల అశోక్, కళ్లెం కృష్ణ, ఎండి ఇమ్రాన్, కుసుమాని హరిచంద్ర, మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి, సహాయ కార్యదర్శి ఎల్లంకి మహేష్, సుద్దాల సాయికుమార్, కట్ల యాదగిరి, మారోజు నరసింహ చారి తదితరులు పాల్గొని తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

**సుదర్శన్ మృతి పట్ల ఎంపీ, ఎమ్మెల్యేల సంతాపం ..**

బోడ సుదర్శన్ ఆకస్మిక మరణం తమకు దిగ్భ్రాంతిని కలిగించిందని భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం సానుభూతిని తెలిపారు.

## బార్ కౌన్సిల్ ఎన్నికల్లో ఎస్‌సి, ఎస్‌టిలకు రిజర్వేషన్లపై పిటిషన్
### 'స్టే'కు హైకోర్టు నిరాకరణ

**హైదరాబాద్ :** రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించాలనే పిటిష్న హైకోర్టు విచారణ ఈ నెల 29కి వాయిదా పడింది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిందని, రిజర్వేషన్ల వ్యవహారం తేలేవరకు స్టే ఇవ్వాలని అడ్వొకేట్ పుట్టా పద్మారావు వేసిన పిటిషన్ తరఫు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ కోరారు. బార్ కౌన్సిల్ వాదనల తర్వాతే స్టే ఆదేశాలపై తగిన నిర్ణయం తీసుకుంటామని చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, మొహియుద్దీన్లతో కూడిన డివిజన్ బెంచ్ చెప్పింది. బార్కౌన్సిల్ పదవుల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తూ సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ ఇచ్చిందని, ఎస్సీ, ఎస్టీలకు కూడా రిజర్వేషన్లు కల్పించేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ వాదన. విచారణ ఈనెల 29కి వాయిదా పడింది.

## జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి
# గాంధీ పేరు తొలగించడం దుర్మార్గం

### జనవరి 3న దేశవ్యాప్తంగా ఐఎన్‌టియుసి నిరసన కార్యక్రమాలు
### సంఘం జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపి డా.జి.సంజీవరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్రామీణ పేద ప్రజలకు ఉపాధి అందిస్తూ గాంధీ పేరుతో పాటు ఆదర్శాలతో స్పష్టంగా ముడిపడి ఉన్న చట్టం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుండి గాంధీజీ పేరును తొలగించడం దుర్మార్గం అని ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షులు, మాజీ ఎంపి డా. జి. సంజీవ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్, బర్కత్ పురలోని అయన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో డా. జి. సంజీవ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ కుటుంబాలకు పని హామీలను క్రమపద్ధతిలో నిర్వీర్యం చేసేందుకు కేంద్ర బీజేపీ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టం స్థానంలో వికసిత్ భారత్‌గ్యారెంటీ ఫర్ రోజ్‌ఘర్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) (విబిజి రామ్ జి) బిల్లు తీసుకువచ్చిందని తెలిపారు. విబిజి రామ్ జి చట్టంలో ఆర్థిక బాధ్యతలో వచ్చిన మార్పు రాష్ట్రాలపై భారాన్ని గణనీయంగా పెంచుతుందని, వాటికి అర్థవంతమైన నిర్ణయాధికారం లేకుండా చేయబడిందని, రాష్ట్రాల మధ్య ఖర్చుభాగస్వామ్య ఒప్పందం దాదాపు 90:10గా ఉండగా, ఇప్పుడు ఇది 60:40 పెంచిందని, దింతో రాష్ట్రాలపై అధిక భారం పడి ఉపాధి పని కోసం డిమాండ్‌ను పరిమితం చేయవలసివస్తుందని, దింతో గ్రామీణ పేదలకు ఉద్దేశించిన హామీనే దెబ్బతీస్తుందని తెలిపారు. విబిజి రామ్ జి కొత్త చట్టాన్ని తీసుకురావడాన్ని ఖండిస్తూ 2026 జనవరి 3న దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఐఎన్‌టియుసి నిరసన కార్యక్రమాలు చేపడుతుందని, ఇందులో భాగంగా హైదరాబాద్, ఇందిరా పార్క్ వద్ద ఆ రోజు భారీ ధర్నా ను నిర్వహిస్తున్నామని డా. జి. సంజీవ రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి ఛైర్మన్ బి. జనక్ ప్రసాద్, ఐఎన్‌టియుసి తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జి. సత్యజిత్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఎం.బి. విజయ్ కుమార్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి జగన్ మోహన్ రెడ్డి, నేతలు రవి పాల్గొన్నారు.

**సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్**
ఆపరేషన్స్ : వికారాబాద్ సర్కిల్.
టెండరు నోటిఫికేషన్ నెం. 15/25-26
అవసరమైన సామాగ్రి సరఫరా నిమిత్తం అర్హులైన టెండరర్ల నుండి ప్రతిపాదనలకు ఆహ్వానం.1) డి.బాద్‌లో ఒఎఫ్‌సి సొసైటీ సమీపంలో 100 కిలోవాట్ల యాంపియర్ పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్ ప్రతిష్ఠాపన. 2) డి.బాద్‌లోని బి.పేట్ (వి) బస్‌స్టాండ్ వద్ద 100 కిలోవాట్ల యాంపియర్ పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్ ప్రతిష్ఠాపన 3) కెడిజిఎల్ లో 2.5 కిలోమీటర్ల మేరకు 11 కిలోవాట్ల లైన్ ప్రతిష్ఠింపజేయడం ద్వారా 11 కిలోవాట్ల ఎక్స్‌ప్రెస్ ఫీడర్ మరియు కొడంగల్ ఫీడర్‌ల అనుసంధానం చేయడం. 4) కెడిజిఎల్‌లో 11 కిలోవాట్ల లైన్‌ను 1.35 కిలోమీటర్ల మేరకు ప్రతిష్ఠించడం ద్వారా 11 కిలోవాట్ల పర్సాపూర్ ఫీడర్ మరియు కొడంగల్ ఫీడర్‌ను అనుసంధానం చేయడం. 5) తాండూర్‌లో 11 కిలోవాట్ల గౌథపూర్ ఫీడర్ బైఫర్‌కేషన్ నుండి బే ఎక్స్‌టెన్షన్‌తో 0.75 కిలోమీటర్లు మేరకు 11 కిలోవాట్ల లైన్ విసిబి మరియు విసిబి ప్రతిష్ఠాపన. 6) తాండూర్‌లో 11 కిలోవాట్ల ఓజిపూర్ ఫీడర్ మరియు 11 కిలోవాట్ల కరంకోట్ ఫీడర్ అనుసంధానం. 7) పెద్దెముల్‌లో 4.5 కిలోమీటర్ల లైన్ మరియు 11కిలోవాట్ల విసిబి ప్రతిష్ఠించడం ద్వారా న్యూతట్టిపల్లిలో 11 కిలోవాట్ల ఫీడర్‌ను ప్రతిష్ఠింపజేయాలి. తదుపరి వివరాల కోసం www.tgsouthernpower.com ను సందర్శించండి. సామాగ్రి వివరాలు అన్నీ పైన పేర్కొన్న వెబ్‌సైటులో తెలియజేయడమైనది.
ఫోన్ నెం. 8712469736 లేదా 8712469716
ఇ-మెయిల్ : sevkbtgspdcl@gmail.com
సం/- సూపరింటెండింగ్ ఇంజనీరు, ఆపరేషన్స్, టిజిఎస్‌పిడిసిఎల్ వికారాబాద్ సర్కిల్.
DIPR R.O. No. : 12414-PP/CL/ADVT/1/2025-26, Date: 22-12-2025

**శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం, భద్రాచలం**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణ రాష్ట్రం. ఫోన్ నం.08743-232428
ఆర్.సి నం. ఇ2/613/2024 ఈ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండరు ప్రకటన తేది: .12.2025
ఈ దేవస్థానం నందు గల విండో మరియు స్ప్లిట్ ఎ.సి.లకు ది.01.01.2026 నుండి ది.31.12.2026 వరకు ఒక సంవత్సర కాలమునకు Annual Maintenance మరియు ఇతర పనులకుగాను ఈ-ప్రొక్యూర్‌మెంట్ పద్ధతిలో టెండర్లు కోరబడుచున్నవి. డాక్యుమెంట్స్ డౌన్‌లోడ్ తేదీ: 24.12.2025 ఉదయం గం.11:00 ల నుండి, టెండరు దాఖలు చేయు చివరి తేదీ: 06.01.2026 ఉదయం గం.11:00 వరకు, టెక్నికల్ బిడ్ అదేరోజు ఉదయం గం.11:30 ని., ఫైనాన్షియల్ బిడ్ తెరచు తేదీ: 06.01.2026 మధ్యాహ్నం గం.12:00లకు. ఇతర వివరములు https://tender.telangana.gov.in నందు చూడగలరు.
సం/- కె. దామోదర్ రావు కార్యనిర్వహణాధికారి
DIPR R.O. No. : 12508-PP/CL/ADVT/1/2025-26, Date: 23-12-2025

**తెలంగాణ ప్రభుత్వము, అటవీశాఖ, పెద్దపల్లి**
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
Rc.No.266/2024/S4/Ramagiri Fort, తేది: 23-12-2025
పెద్దపల్లి జిల్లాలో 2025-26 సంవత్సరకాలంలో ఖిలారామగిరి రిజర్వు ఫారెస్టు, బేగంపేట్ మరియు రత్నాపూర్ గ్రామాల పరిధిలోని రామగిరి మండలం, రత్నాపూర్ బీటు, కల్వచర్ల సెక్షన్, పెద్దపల్లి రేంజ్ పరిధిలోని రామగిరి ఖిల్లా యందు ఇకొ టూరిజం పనుల నిర్మాణం కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం అంచనా విలువ: రూ. 83.774 లక్షలు (ECV). బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ తేది: 27.12.2025న ఉ.11:30 గం.ల నుండి, టెండరు ముగింపు కొరకు చివరి తేది: 06.01.2026న మ.2:00గం.ల వరకు, సాంకేతిక బిడ్ తెరచు తేది: 07.01.2026న ఉ.11:00 గం.లకు, Price bid (ధర) తెరచు తేది: 07.01.2026న సా.4:00 గం.లకు. అన్ని వివరాలను https://tender.telangana.gov.in నుండి పొందవచ్చును.
సం/- జిల్లా అటవీ అధికారి, పెద్దపల్లి.
DIPR R.O. No. : 12545-PP/CL/ADVT/1/2025-26, Date: 23-12-2025

**మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం :: జడ్చర్ల మున్సిపాలిటీ**
మహబూబ్‌నగర్ జిల్లా (టిఎస్)
ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు
2025-26 సంవత్సరానికి సాధారణ నిధుల కింద ఒక పని కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంలో టెండర్ పిలవడమైనది. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: **23.12.2025న మ.01.00గం.ల నుండి,** బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ముగింపు తేది: **30.12.2025న మ.01.00గం.ల వరకు.** మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా https://tender.telangana.gov.inలో చూడవచ్చు. బిడ్స్ ఆహ్వానించే అధికారి: కమిషనర్, జడ్చర్ల మున్సిపాలిటీ, తెలంగాణ స్టేట్. ఫోన్: 7337351867.
సం/- కమిషనర్, జడ్చర్ల మున్సిపాలిటీ.
DIPR R.O. No. : 12546-PP/CL/ADVT/1/2025-26, Date: 23-12-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
డివిజన్-14, జిహెచ్‌ఎంసి.
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు
NIT No. 59/E.E.14/GHMC/2025-26, తేది: 22.12.2025
పని పేరు: జిహెచ్‌ఎంసి, కెజెడ్, డివిజన్-14 క్రింద వివిధ సివిల్ ఇంజనీరింగ్ పనులు. అంచనా విలువ: రూ.236.00 లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 23.12.2025న ఉ.11.00గం.ల నుండి మరియు బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 30.12.2025న ఉ.11.00గం.ల వరకు. అధికారి పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-14, జిహెచ్‌ఎంసి. 5వ అంతస్తు అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-14, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 12534-PP/CL/ADVT/1/2025-26, Date: 23-12-2025



# జనరల్
STATE & REGIONAL NEWS

## వరదలు, పారిశ్రామిక ప్రమాదాలపై రాష్ట్రస్థాయి మాక్ డ్రిల్

**12 జిల్లాలు, 5 పారిశ్రామిక ప్రాంతాల్లో విన్యాసాలు**

**ప్రజాపక్షం /హైదరాబాద్:** వరదలు, పారిశ్రామిక ప్రమాదాల సమయంలో స్పందన సామర్థ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా రాష్ట్రస్థాయి మాక్ ఎక్సర్‌సైజ్‌ను నిర్వహించింది. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డిఎంఎ) సహకారంతో ఈ విన్యాసాలు చేపట్టారు. వాతావరణ మార్పుల కారణంగా అకస్మాత్తుగా సంభవిస్తున్న భారీ వర్షాలు, ఫ్లాష్ ఫ్లడ్స్ నేపథ్యంలో రాష్ట్ర యంత్రాంగం సంసిద్ధతను పరీక్షించారు. వరద ప్రభావిత ప్రాంతాల ఆధారంగా 12 జిల్లాలతో పాటు ప్రధాన పారిశ్రామిక ప్రాంతాల ఆధారంగా 5 జిల్లాలు, ఆర్‌జిఐఎ పరిధిలో మాక్ డ్రిల్లులు నిర్వహించారు.ఈ విన్యాసాల ద్వారా ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, కమ్యూనికేషన్, విభాగాల మధ్య సమన్వయం, ప్రజల తరలింపు, అత్యవసర సేవల సామర్థ్యాన్ని పరీక్షించినట్లు అధికారులు తెలిపారు. పారిశ్రామిక ప్రమాదాల సమయంలో పరస్పర సహకారం, ఆన్‌సైట్, ఆఫ్‌సైట్ ఎమర్జెన్సీ ప్లాన్లను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

## మహిళలకు అండగా తెలంగాణ మహిళా కమిషన్

**తెకమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళా కమిషన్ ఎల్లప్పుడూ మహిళలకు అండగా ఉంటుందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలంగాణ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో 'నారీ న్యాయ్: హియర్ హర్ ఔట్' అనే బహిరంగ విచారణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, అదనపు కలెక్టర్ కదిరవన్ పలని, ఉమెన్ సెఫ్టీ డిసిపిలు డా.లావణ్య, టి. ఉషా రాణి, జిల్లా రెవిన్యూ అధికారి ఈ.వెంకటాచారిలు ఉద్యోగ, గృహ హింస వేధింపులు,వివక్ష, ఆర్థిక, సైబర్ క్రైమ్ తదితర సమస్యలకు సంబంధించిన 100 మందికి పైగా మహిళా బాధితల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా శారద మాట్లాడుతూ మహిళల ఆవేదనను విని వారికి న్యాయం చేకూరేలా, త్వరితగతిన అవసరమైన చర్యలు చేపట్టేలా చూడటానికే 'నారీ న్యాయ్: హెయిర్ హర్ ఔట్' అనే బహిరంగ విచారణ ఏర్పాటు చేసి ఇందులో వివిధ విభాగాలను విచారణలో భాగస్వామ్యం చేయడం జరిగిందని తెలిపారు. తక్షణమే మహిళల పరిష్కారాలు సూచిస్తూ సంబంధిత శాఖల చర్యలు తీసుకోవడంతో పాటు పెండింగ్ ఫిర్యాదులపై నివేదికలు కోరారు. అధిక శాతం ఫిర్యాదులు గృహ హింసపై అందాయని ఎక్కువ ఫిర్యాదుల్లో నిందితులు ఎన్ఆర్ఐలై ఉండటం వల్ల ఈ విషయాన్ని కేంద్ర హోం శాఖ దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కమిషన్ కార్యదర్శి పద్మజా రమణ, సభ్యులు షాహిన్ అఫ్రోజ్, ఈశ్వరిబాయ్, శుద్ధం లక్ష్మి, గద్దల పద్మ, కొమ్ము ఉమాదేవి యాదవ్, ఏ రేవతి రావు,జిల్లా సంక్షేమ శాఖాధికారులు అక్కేశ్వర్ రావు, రాజేందర్, ప్రవీణ్ కుమార్, ఆర్. కోటాజీ, జి. ఆశన్న, ఇలియాజ్ అహ్మద్, వివిధ శాఖాధికారులు, వివిధ జోన్‌ల పోలీస్ అధికారులు, సఖి నిర్వాహకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 5 జిల్లాలలో యూరియా యాప్ ప్రయోగాత్మకంగా అమలు

**● యాప్ పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన రైతులు ● త్వరలో అన్ని జిల్లాలలో అమలుకు సన్నాహాలు ● వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వ్యవసాయ శాఖ ద్వారా 5 జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున యూరియా యాప్ విజయంతంగా కొనసాగుతోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గత రెండు రోజులుగా యాప్ అమలు తీరును క్షుణంగా పరిశీలించామని, 5 జిల్లాలలో దాదాపు లక్ష మందికి పైగా డౌన్ లోడ్ చేసుకున్నారన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో 897, జనగామ జిల్లాలో 5150, మహబూబ్ నగర్ 3741, నల్లగొండ 3618 , పెద్దపల్లి జిల్లాలోని 6289 మొత్తం 19695 మంది రైతులు ఈ యాప్ ద్వారా యూరియాను తమ సమీప డీలర్ దగ్గర 60,510 యూరియా బస్తాలు బుక్ చేసుకోవడం జరిగిందని తెలిపారు. అంతేకాకుండా 217 మంది కౌలు రైతులు కూడా 678 యూరియా బస్తాలు ఈ యాప్ ద్వారా బుక్ చేసుకున్నారని వెల్లడించారు. మొదటి రోజు అక్కడక్కడ తలెత్తిన సాంకేతిక సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించారన్నారు. రైతులు కూడా ఈ యాప్ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారని మంత్రి వెల్లడించారు. వారికి వారి ఊరిలో ఏ డీలర్ దగ్గర ఎంత స్టాక్ ఉందో తెలుస్తుందని, తద్వారా వారు బుక్ చేసుకొని, వారికి నచ్చిన సమయంలో షాప్ వద్దకు వెళ్లి ఒటిపి చూపించి కొనుగోలు చేశారని తెలిపారు. ఈ రెండు రోజుల్లో యాప్ విజయవంతం కావడంతో, ఈ యాప్‌ను మరికొన్ని రోజులు పరిశీలించి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయడానికి సిద్ధం కావాల్సిందిగా అధికారులను మంత్రి తుమ్మల ఆదేశించారు. మంగళవారం రైతునేస్తం కార్యక్రమంలో కూడా రైతులకు యాప్‌పై ఉన్న సందేహాలను నివృత్తి చేయడం జరిగిందన్నారు. ఈ రబీ సీజన్‌కు గాను రాష్ట్రానికి ఇప్పటికే 5.30 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. యూరియా వినియోగం అధికంగా ఉండే జనవరి, ఫిబ్రవరి నెలలకు గాను సరిపడ యూరియాను ముందస్తుగానే తెప్పించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి తెలిపారు.





## పివికి ఘన నివాళి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారతరత్న మాజీ ప్రధాన మంత్రి పివి. నరసింహారావుకుకాంగ్రెస్ శ్రేణులతో పాటు పలువురు ప్రముఖులు ఘనంగా నివాళ్లు అర్పించారు. పివి నరసింహారావు 21వ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి నివాళులు అర్పించారు. నెక్లెస్‌రోడ్ లోని పివిజ్ఞానభూమి వద్ద ముందు కేంద్ర బొగ్గు గనుల మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ప్రభుత్వ సలహాదారులు హర్కార వేణుగోపాల్,మాజీ రాజ్యసభ సభ్యులు కెవిపి రామచంద్రరావు, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, పివి కుటుంబ సభ్యులు, కార్పొరేషన్ చైర్మన్ లు, ఇతర ముఖ్య నేతలు పివి నరసింహారావు సమాధి వద్ద పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఆర్థిక అంశాల్లో దేశం ఈ రోజు నిలబడింది అంటే ప్రధానిగా పివి నరసింహా రావు చేపట్టిన సంస్కరణలు నిదర్శనమని పేర్కొన్నారు. పి.వి సేవలు చిరస్మరణీయమని, ఆర్థిక సంస్కరణలతో దేశం ముందంజ నిలిపిన మహానీయుడని కొనియాడారు. ప్రపంచ మాంద్యం వచ్చిన , కరోనా లాంటి విపత్తు వచ్చిన దేశం బయటపడి స్వయంగా నిలదొక్కుకుని నిలబడడానికి ఈ సంస్కరణలు స్ఫూర్తియని అన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ పివి నరసింహారావు ప్రధాన మంత్రిగా భారత ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చి దేశ ఆర్థిక వ్యవస్థను పట్టాలెక్కించి పరుగులు పెట్టించిన మహానీయులన్ని కొనియాడారు.

## ఎఎఒయు కార్యనిర్వాహక సభ్యుడిగా ఘంటా చక్రపాణి నియామకం



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** ఏషియన్ అసోసియేషన్ ఆఫ్ ఓపెన్ యూనివర్సిటీస్ (ఎఎఓయూ) కార్యనిర్వాహక సభ్యులుగా డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్.ఘంటా చక్రపాణి ఎంపికయ్యారు. 2026–2028 కాలానికి కార్యనిర్వాహక సభ్యులుగా ప్రొ ఫెసర్. ఘంటా చక్రపాణి ని నియమిస్తూ ఎఎఓయూ సెక్రటరీ జనరల్ ప్రొ. రహమ్మత్ బుదిమాన్ అధికారిక సమాచారాన్ని పంపించారు. ఆసియా ఖండంలోని అన్ని ఓపెన్ యూనివర్సిటీలు ఇందులో సభ్యులుగా ఉంటారు. బీజింగ్‌లో ఇటీవల జరిగిన 2025 సంవత్సరపు సాధారణ సర్వ సభ్య సమావేశంలో ఎఎఓయూ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రొ.ఘంటా చక్రపాణి మాట్లాడుతూ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఎఎఓయూకు కార్యనిర్వాహక సభ్యులుగా ఎంపిక కావడం తమ భాద్యతను మరింత పెంచిందన్నారు. తెలంగాణలో సార్వత్రిక విద్య గ్రామీణ ప్రాంతంలో మరింత విస్తరించేలా, అందరికీ అందుబాటులో ఉన్నత విద్య ఉండేలా ప్రయత్నం చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ డా. ఎల్‌వికె రెడ్డి, పలువురు డైరెక్టర్లు ప్రొ. పుష్పా చక్రపాణి, ప్రొ. రాబింద్రనాథ్ సోలమన్, ప్రొ. రాణి రజిత మాధురి, ప్రొ. రజని, ప్రొ. భోజు శ్రీనివాస్, డా. రమా దేవి, డా. దయాకర్ తదితరులు ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి ని అభినందించారు.

## కృష్ణా జలాలపై విషయంలో తెలంగాణకు కెసిఆర్ 'మరణ శాసనం'

**బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కృష్ణా జలాల పంపిణీ విషయం లో గత బిఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన వైఖరి తెలంగాణ రాష్ట్రానికి శాపంగా మారిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయం లో మంగళవారం కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ మాజీ సలహాదారు వెదిరె శ్రీరామ్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా నీటి పారుదల అంశాలను వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో రాంచందర్ రావు మాట్లాడుతూ కృష్ణా జలాల అంశంపై కెసిఆర్ చేస్తున్న విమర్శలను తిప్పికొట్టారు. కృష్ణా నదిలో ఉన్న మొత్తం 811 టిఎంసిల నీటిలో ఆంధ్రప్రదేశ్‌కు 512 టిఎంసిలు కేటాయించి, తెలంగాణకు కేవలం 299 టిఎంసిలు మాత్రమే సరిపోతాయని సంతకం పెట్టింది కెసిఆర్ కాదా? అని రాంచందర్ రావు ప్రశ్నించారు. సమర్థవంతంగా వాదించి ఉంటే 400 నుండి 450 టిఎంసిల వాటా దక్కేదని, కెసిఆర్ చేసిన ఆ చారిత్రక తప్పిదం గత పదేళ్లుగా తెలంగాణకు 'మరణ శాసనం'లా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

### కొత్త ట్రిబ్యునలే పరిష్కారం

కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొత్త ట్రిబ్యునల్ ద్వారానే కృష్ణా బేసిన్ నీటి పునర్విభజన శాస్త్రీయంగా జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సరైన టెక్నికల్, లీగల్ వాదనలు వినిపించకపోతే తెలంగాణ మరోసారి నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. అబద్ధపు ప్రచారాలు పక్కన పెట్టి, రాష్ట్ర ప్రయోజనాల కోసం పనిచేయాలని ఆయన డిమాండ్ చేశారు.

### కేంద్రంపై అబద్ధపు ప్రచారాలు..

పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం విషయంలో కెసిఆర్ కేంద్రంపై చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని రాంచందర్ రావు స్పష్టం చేశారు. డిపిఆర్‌లపై కేంద్రం అడిగిన ప్రశ్నలు గత ప్రభుత్వ హయాంలోనే మొదలయ్యాయన్నారు. వేరే రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రభావంతో కేంద్రం అడ్డుకుంటుందన్న మాటలు కేవలం రాజకీయ నాటకమని విమర్శించారు. ప్రజల సెంటిమెంట్‌తో ఆడుకోవడమే కెసిఆర్ ధ్యేయం అని ఆయన విమర్శించారు.

### బిజెపి ఆధ్వర్యంలో 'ప్రత్యేక అధ్యయన కమిటీ'

తెలంగాణలోని ఇరిగేషన్ ప్రాజెక్టుల స్థితిగతులను, క్షేత్రస్థాయి లోపాలను పరిశీలించేందుకు బిజెపి ఒక ప్రత్యేక స్టడీ టీమ్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు రాంచందర్ రావు ప్రకటించారు. ఈ కమిటీ రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి, ప్రాజెక్టుల వైఫల్యాలపై సమగ్ర నివేదికను రూపొందిస్తుందని తెలిపారు.

## అసెంబ్లీలో పవర్‌పాయింట్‌ను స్వాగతిస్తున్నాం

**మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సాగునీటి ప్రాజెక్ట్‌లపైన శాసన సభలో ప్రభుత్వం పవర్‌పాయింట్ ప్రజంటేషన్ పెట్ట డాన్ని స్వాగతిస్తున్నామని, ప్రతిపక్ష బిఆర్ఎస్‌కు కూడా పవర్‌పాయింట్‌కు అవకాశాన్ని కల్పించాలని బిఆర్ఎస్ మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు కోరారు. రాష్ట్రంలో ఉన్న అనేక సమస్యలపై చర్చించేందుకు అసెంబ్లీ సమావేశాలను కనీసం 15 రోజుల పాటు నిర్వహించాలన్నారు. తెలంగాణ భవన్‌లో జర్నలిస్టులతో హరీశ్‌రావు మంగళవారం ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో కృష్ణా జలాల్లో నీటి వాడకం కేవలం 28.49 శాతం మాత్రమేనని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి 45 టిఎంసిలు చాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉత్తరం రాయడం చారిత్రక తప్పిదమన్నారు. ప్రభుత్వం ఇరుకున పడినప్పుడల్లా ఫోన్ ట్యాపింగ్, ఫార్ములాఈ కార్ రేస్ అంటూ లీకులు ఇస్తూ డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని, అసెంబ్లీ ముగియగానే ఫోన్ ట్యాపింగ్ కేసులో తనకు నోటీసులు ఇస్తార అని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి మెప్పు కోసం అక్రమ కేసులు నమోదు చేస్తున్న పోలీసు అధికారుల పేర్లను రాసుకుంటున్నామని, ఎపిలో అధికారులకు పట్టిన గతే మీకు' పడుతుంది. రిటైర్ అయినా, విదేశాల్లో ఉన్నా తీసుకొస్తామని హెచ్చరించారు. సాగునీటి ప్రాజెక్టుల పేరుతో రూ.7వేల కోట్లను డిప్యూటీ సిఎం భట్టి, మంత్రి ఉత్తమ్ పంచుకున్నారని, 20 శాతం కమీషన్ ఇచ్చిన వారికే బిల్లులు ఇస్తున్నారని ఆరోపించారు.

## సిఎం ప్రజావాణిలో 433 దరఖాస్తులు

**దరఖాస్తులు స్వీకరించిన చిన్నారెడ్డి, దివ్య**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన సిఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 433 దరఖాస్తులు అందాయి. సిఎం ప్రజావాణి ఇన్‌చార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ ప్రజల దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి అక్కడిక్కడే పలు సమస్యలను పరిష్కరించారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 133, రెవెన్యూ శాఖకు సంబంధించి 36,ఇందిరమ్మ ఇండ్ల కోసం 177, ప్రవాసి ప్రజావాణికి 01 దరఖాస్తులు రాగా,ఇతర శాఖలకు సంబంధించి 86 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.



## సిఎం శిఖండి రాజకీయాలు చేయొద్దు

**● కాంగ్రెస్ ప్రభుత్వానికి 420 హామీల భయం.. ఎన్నికల నిర్వహణ నుండి పరార్ ● దమ్ముంటే సహకార ఎన్నికలు నిర్వహించాలి ● మాజీ మంత్రి,బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ ● నల్లగొండలో నూతన ప్రజాప్రతినిధుల అభినందన సభ**

**ప్రజాపక్షం/నల్లగొండ:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దమ్ముంటే, వెనుక నుండి లీకులు ఇవ్వడం మానేసి, నేరుగా కెమెరా ముందుకు వచ్చి ఏకేసు పెడుతున్నారో చెప్పాలని.. హోం మంత్రి కూడా ఆయనే కాబట్టి, ధైర్యంగా ముందుకు వచ్చి మాట్లాడాలి, శిఖండి రాజకీయాలు చేయడం తగదని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు విమర్శించారు. ప్రజా ప్రయోజనాల కంటే కేవలం కేసుల చుట్టూనే ప్రభుత్వాన్ని తిప్పుతున్నారని, కెసిఆర్ సాగునీటి ప్రాజెక్టులపై అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ప్రజల దృష్టి మళ్లించడానికి నోటీసుల డ్రామా ఆడుతున్నారని ఆరోపించారు. నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు,వార్డ్ మెంబర్ల అభినందన సభ ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి కెటిఆర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రజాప్రతినిధులను అభినందించి సన్మానించారు.ఈ సందర్భంగా సభను ఉద్దేశించి కెటిఆర్ మాట్లాడుతూ కృష్ణా నదీ జలాల విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై రాష్ట్ర మంత్రుల అజ్ఞానంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్ర ముఖ్యమంత్రికి నదీ జలాల అంశం పైన ఎలాంటి అవగాహన లేదని అన్నారు. నల్లగొండ జిల్లాకు చెందిన మంత్రులపై కెటిఆర్ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా సాగునీటి శాఖా మంత్రికి నీళ్లపై కనీస అవగాహన లేదని, ఇటీవల జరిగిన ఒక మీడియా సమావేశంలో నీళ్ల గురించి అడిగిన ప్రశ్నలకు నేను ప్రిపేర్ అయి రాలేదు, రేపు వచ్చి సమాధానం చెప్తాను అని తప్పించుకోవడాన్ని ఆయన తప్పుబట్టారు. నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల రైతాంగానికి కృష్ణా జలాల్లో న్యాయం జరిగే వరకు బిఆర్ఎస్ పోరాటం ఆగదని కెటిఆర్ ప్రకటించారు. ఇలాంటి బెదిరింపులకు బిఆర్ఎస్ భయపడదని, ప్రజాక్షేత్రంలో ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. అదే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల చిత్తశుద్ధితో ఉంటే వెంటనే సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి 420 హామీల భయం పట్టిందని అందుకే ఎన్నికల నిర్వహణ నుండి పారిపోయిందని ప్రజాక్షేత్రంలో ప్రభుత్వాన్ని నిలదీయాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి, బిఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్ర కుమార్,ఎంఎల్‌సి మంకెన కోటిరెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్ కుమార్,కంచర్ల భూపాల్ రెడ్డి,చిరుమర్తి లింగయ్య,కుసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు మాజీ ఎంపీ లింగయ్య యాదవ్,మాజీ ఎంఎల్‌సి కర్నే ప్రభాకర్,నాయకులు చెరుకు సుధాకర్,ఒంటెద్దు నరసింహా రెడ్డి,చాడ కిషన్ రెడ్డి, పాల్వాయి స్రవంతి, ముఖ్య నేతలు పాల్గొని పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారు.

## సింగరేణి కాలనీ గుడిసెవాసులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

**సింగరేణి కాలనీ జెఏసి నాయకులు**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఐఎస్ సదన్ డివిజన్ సింగరేణి కాలనీ ప్రభుత్వ స్థలంలో నివాసముంటున్న నిరుపేద గుడిసెవాసులకు ఉన్నచోటనే పట్టాలు మంజూరి చేయాలని సింగరేణి కాలనీ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు జెఏసి నాయకులు కొర్ర మోతిలాల్ నాయక్ , మెగావత్ తుకారాం నాయక్ , విక్రం గౌడ్ మంగళవారం సింగరేణి కాలనీలో ఏ ర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొర్ర మోతిలాల్ నాయక్ మాట్లాడుతూ సింగరేణి కాలనీ గుడిసెవాసులు అన్ని విధాలుగా మౌలిక వసతులు ఉండి, గత 30 సంవత్సరాల నుండి నివాసం ఉంటున్నా వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని వెంటనే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సింగరేణి కాలనీలో నివసించే గుడిసెవాసులు అందరూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల చే మంజూరు చేయబడిన ఓటరు కార్డు, రేషన్ కార్డు, లేబర్ కార్డు తదితర గుర్తిం పు కార్డులు అన్నీ కలిగి ఉన్నారని వివరించారు. సింగరేణి గుడిసెల ప్రాంతంలో ప్రభుత్వం, జిహెచ్ఎంసి మౌలిక వసతులు కూడా కల్పిస్తున్నాయని తెలిపారు.



ప్రతి ఎన్నికల సమయంలో అన్ని పార్టీల నాయకులు గుడిసెవాసులకు ఉన్నచోటనే పట్టాలు ఇప్పిస్తామని హామీలు ఇచ్చారని గుర్తుచేశారు. అయితే కొన్ని రో జులుగా కొంత మంది ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ సభ్యులు గుడిసె వాసులకు ప్ర త్యామ్నాయం కల్పిస్తామని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ప్రత్యామ్నాయం వద్దు ఉన్న చోటనే ఇళ్లపట్టాలు ఇవ్వాలి అని ఆయన అన్నారు. జెఏసి ఆధ్వర్యం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి, ఇది ప్రభుత్వ స్థలం అర్బన్ సీలింగ్ ల్యాండ్‌లో ఉంటున్నామని, పట్టాలు ఇవ్వాలని కలిసి విన్నవించుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో సక్రి బాయి, సద్దాం ఖాన్ , షేక్ మహమూద్, జం గయ్య, విజయ్, గణేష్ నాయక్, నాగు నాయక్, శాంతి బాయ్, సుకుర్ పాషా, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ చట్టాలు దేశానికే ప్రమాదకరం

**సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి. రాఘవులు**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తాజాగా ముగిసిన పార్లమెంట్ సమావేశాల్లో దేశానికే అత్యంత ప్రమాదకరమైన నాలుగు చట్టాలకు కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు ఆమోదం తెలిపిందని సిపిఐ (ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి. రాఘవులు అన్నారు. ఈ చట్టాల వల్ల దేశ ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వాటికి వ్యతిరేకంగా అన్ని కలిసొచ్చే శక్తులు, రాజకీయ పార్టీలను కలుపుకుని దేశవ్యాప్త పోరాటాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. హైదరాబాద్ ఎంబి భవన్‌లో మంగళవారం ప్రారంభమైన సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ సమావేశాల సందర్భంగా సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, జ్యోతిలతో విలేకరుల స మావేశంలో రాఘవులు మాట్లాడారు. కార్పొరేట్లకు అధిక లాభా లు కల్పించేందుకే నాలుగు లేబర్ కోడ్‌లను మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిందని రాఘవులు విమర్శించారు. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' పేరుతో కార్మిక హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థను కార్పొరేట్లకు అప్పగించేందుకే విద్యుత్ సవరణ చట్టాన్ని తెచ్చారన్నారు. ఈ చట్టం అమలుతో క్రా స్ సబ్సిడీ రద్దై రైతులు, పేదలు ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని కోల్పోతారని చెప్పారు. విద్యా సంస్థలు, ఆస్పత్రులకు కూడా సబ్సిడీ వి ద్యుత్ ఉండదన్నారు. అదానీ, అంబానీ, గోద్రెజ్, సుజాన్ వంటి సంస్థల ఒత్తిళ్ల వల్లే ఈ నిర్ణయాలు తీసుకున్నారన్నారని మండిపడ్డారు. తెలంగాణలో మూడో డిస్కమ్ ఏర్పాటుపై కూడా తీవ్ర అ భ్యంతరం వ్యక్తం చేశారు.

### రాష్ట్రాలకు భారంగా 'జీ రాం జీ' చట్టం


'జీ రాం జీ' చట్టం రాష్ట్రాలకు భారంగా మారుతుందని, రాష్ట్రాలు తమ వాటా నిధులు ఖర్చు చేయకపోతే కేంద్రం నిధులు నిలిపివేసే ప్రమాదం ఉందన్నారు. దీనివల్ల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని చెప్పారు. ఈ చట్టం ద్వారా గ్రామీణ భూ స్వాములకు, పట్టణ కార్పొరేట్లకు చౌక కూలీలు దొరికే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. గిరిజనులు, ఆదివాసీలు, దళితులే ఎ క్కువగా నష్టపోతారని అన్నారు. ఇన్సూరెన్స్ చట్టంలో మార్పులతో విదేశీ సంస్థలకు వంద శాతం పెట్టుబడులకు అవకాశం కల్పించారని, 'సబ్‌కా బీమా' పేరుతో కార్పొరేట్లకే రక్ష కల్పిస్తున్నారని విమర్శించారు. శాంతి పేరుతో తీసుకొస్తున్న న్యూక్లియర్ లయబిలిటీ బిల్లు దేశానికి అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు.

### గ్రామ పాలకులకు శుభాకాంక్షలు : జాన్ వెస్లీ

సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు మెంబర్లకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విరివిగా నిధులు కేటాయించాలని కోరారు. యూరియా యాప్‌ను ఎత్తివేసి పాత విధానంలోనే యూరియాను అందించాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలో సిపిఐ(ఎం) నేత హత్య కేసులో జాప్యం తగదన్నారు. గాదె ఇన్నయ్యను వెంటనే విడుదల చేయాలని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి, వెంటనే పనులు పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌ల అంశంపై కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని పార్టీలను కలిసి కేంద్రంతో పోరాటం చేయాలని కోరారు.

### హిల్ట్ పాలసీపై అసెంబ్లీలో చర్చించాలి..

ఓఆర్ఆర్ అవతలకు పరిశ్రమలను తరలించి ఆ భూములను పారిశ్రామికవేత్తలకే అప్పగించాలని చూడటం సరిగాదన్నారు. ఆ పేరుతో రూ.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను రూ.5వేల కోట్లకే పారిశ్రామిక వేత్తలకు కట్టబోతున్నారనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో దానిపై అసెంబ్లీలో చర్చ జరగాలన్నారు. ఆ భూములను ప్రజా ప్రయోజనాల కోసం, పేదలకు ఇండ్లను కట్టించడం కోసం ఉపయోగించాలన్నారు. నగరం నడిబడ్డున ఉన్న కంటోన్మెంట్ బోర్డుకు వేరే ప్రాంతంలో భూములు అప్పగించి, దాన్ని జిహెచ్ఎంసిలో కలపాలని కోరారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## యుద్ధాలకు సిద్ధంగా ఉండాలి : అనిల్ చౌహాన్

**న్యూఢిల్లీ:** ఉగ్రవాదం, సరిహద్దు వివాదాలు సవాళ్లుగా ఉన్నాయని, స్వల్ప కాలిక, సుదీర్ఘ యుద్ధాలకూ భారత్ సిద్ధంగా ఉండాలని సిడిఎస్ జనరల్ అనిల్ చౌహాన్ సూచించారు. ఈ మేరకు ఐఐటి బాంబేలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మన ప్రత్యర్థులు అణుసామర్థ్యం కలిగి ఉన్నారు. వారి నుంచి వచ్చే ఎలాంటి సవాలునైనా ఎదుర్కోవడానికి మనం సిద్ధంగా ఉండాలి. గతంలో నిర్వహించిన ఆపరేషన్ల మాదిరిగానే ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి స్వల్ప, దీర్ఘకాలిక ఘర్షణలకు సిద్ధపడాలి. ఇప్పటికే కొనసాగుతున్న సరిహద్దు వివాదాల కారణంగా భూతల ఘర్షణల్లో పోరాడేందుకు సంసిద్ధమవ్వాలి. అయితే వీటిని నివారించేందుకు అన్ని ప్రయత్నాలు చేయాలి. కృత్రిమ మేధ, క్వాంటమ్ కంప్యూటింగ్, హైపర్ సోనిక్స్, రోబోటిక్స్, ఎడ్జ్ కంప్యూటింగ్ పోరాట తీరును మారుస్తున్నాయి అని అన్నారు.

## ఒడిశాలో నక్సల్స్ లొంగుబాటు

- ఆయుధాలు వీడిన 22 మంది మావోయిస్టులు



**మల్కన్‌గిరి:** దేశ వ్యాప్తంగా మావోయిస్టులు క్రమంగా ఆయుధాలను వీడుతున్నారు. తాజాగా ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లాలో మంగళవారం 22 మంది మావోయిస్టులు పోలీసుల ముందు లొంగిపోయినట్లు ఓ అధికారి తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులు ఒడిశా డిజిపి వై బి ఖురానియా, ఇతర సీనియర్ అధికారుల సమక్షంలో తొమ్మిది తుపాకులు, 150 లైవ్ రౌండ్ల మందుగుండు సామగ్రి, 20 కిలోల పేలుడు పదార్థాలు, 13 ఐఇడిలు, జెలటిన్ స్టిక్స్, ఇతర వస్తువులను అప్పగించారు. లొంగిపోయిన మావోయిస్టులలో ఎక్కువ మంది పొరుగున ఉన్న ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారు. అయితే వారు ఒడిశాలో కార్యకలాపాలు నిర్వహించేవారని అధికారి తెలిపారు. సుక్మా జిల్లాకు చెందిన డివిజనల్ కమిటీ సభ్యుడు (డిసిఎం) లింగే అలియాస్ మైరే మడ్కం (45), ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాకు చెందిన ఎసిఎం (ఏరియా కమిటీ సభ్యుడు), కమాండర్ బామన్ మడ్కం (27) లొంగిపోయిన మావోయిస్టులలో ఉన్నారు. ఒడిశా ప్రభుత్వం నవంబర్ 27న లొంగిపోయిన మావోయిస్టులకు ఇచ్చి రివార్డును సవరించింది. పొరుగున ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో అందించే దానికంటే ఇది 10 శాతం ఎక్కువగా పెంచింది.

## యాపిల్స్ సుంకం రాయితీలు
# తొలి దేశంగా కివిస్ అవతరణ

**న్యూఢిల్లీ:** భారతదేశం న్యూజిలాండ్‌కు యాపిల్, కివీఫ్రూట్, మనుకా తేనె కోసం మంజూరు చేసిన కోటా సుంకం రాయితీలు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కింద ద్వీప దేశం కట్టుబడి ఉన్న వ్యవసాయ ఉత్పాదకత కార్యాచరణ ప్రణాళికలకు పంపిణీకి అనుసంధానించబడి ఉన్నాయి. ఈ ప్రణాళికల అమలును ఉమ్మడి వ్యవసాయ ఉత్పాదకత మండలి (జెఎపిసి) పర్యవేక్షిస్తోంది. ఈ ఒప్పందం ప్రకారం సున్నితమైన దేశీయ వ్యవసాయ రంగాల రక్షణతో మార్కెట్ మార్కెట్ యాక్సెస్‌ను సమతుల్యం చేయడం ఈ చర్య లక్ష్యం. భారతదేశంలో ఉత్పాదకత, నాణ్యత, రంగాల వారీ మూలధనాన్ని మెరుగుపర్చడానికి కివిఫ్రూట్స్, యాపిల్స్, తేనె కోసం కేంద్రీకృత కార్యాచరణ ప్రణాళికలపై న్యూజిలాండ్ అంగీకరించింది. ఈ సహకారంలో అత్యుత్తమ కేంద్రాల స్థాపన, మెరుగైన మెటీరియల్ ప్లాంటింగ్, పండ్లతోటల నిర్వహణకు సాగుదారుల సాంకేతిక మద్దతు కోసం సామర్థ్య నిర్మాణం, పంట కోత తర్వాత పద్ధతులు, సప్లయ్ చైన్స్, ఆహార భద్రత ఉన్నాయి. ప్రీమియం యాపిల్ సాగుదారుల కోసం ప్రాజెక్టులు, స్థిరమైన తేనెటీగల పెంపకం పద్ధతులు భారతదేశంలో ఉత్పత్తి, నాణ్యతా ప్రమాణాలను మెరుగు పరుస్తాయి.




యాపిల్, కివిఫ్రూట్, మనుకా తేనె కోసం అన్ని టారిఫ్ కోటాలు వ్యవసాయ ఉత్పాదకత కార్యాచరణ ప్రణాళికల డెలివరీకి, జెఎపిసి పర్యవేక్షణకు అనుసంధానించబడి ఉన్నాయని వాణిజ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ ఒప్పందం ప్రకారం తన యాపిల్స్‌లకు సుంకం రాయితీలు ఇచ్చిన మొదటి దేశంగా న్యూజిలాండ్ అవతరించింది. ప్రస్తుతం భారతదేశం యాపిల్స్‌పై 50శాతం దిగుమతి సుంకాన్ని కలిగిఉంది. ఈ ఒప్పందం ప్రకారం దేశీయ రైతుల ప్రయోజనాలను కాపాడటానికి భారతదేశం కోటా కనీస దిగుమతి ధర (ఎంఐపి) ఉన్నటువంటి యాపిల్స్‌కు సుంకం రాయితీలను ఇస్తోంది. ప్రస్తుతం భారతదేశం న్యూజిలాండ్ నుండి వార్షిక యాపిల్ దిగుమతులు 32.4మిలియన్ డాలర్ల విలువైన 31.392.6 టన్నులు (మిలియన్ టన్నులు) కాగా, దేశం 519,651.8 మిలియన్ టన్నులు (424. 6 మిలియన్ అమెరికన్ డాలర్లు) యాపిల్ దిగుమతులు చేస్తోంది.ఈ ఒప్పందంలో ఒప్పందం మొదటి సంవత్సరంలో 32,500 మిలియన్ టన్నులపై దిగుమతి సుంకం రాయితీలు న్యూజిలాండ్‌కు ఇవ్వబడతాయి. ఆరవ సంవత్సరంలో కోటా 25 శాతం సుంకం, (1.25/కేజీ అమెరికన్ డాలర్ల ఎంఐపితో 45,000మెట్రిక్ టన్నులకు పెంచబడుతుంది. ఈ కోటా దాటి 50శాతం సుంకం అమలులోకి వస్తుంది. ఒప్పందం ప్రకారం న్యూజిలాండ్ నుంచి ఎంచుకున్న వ్యవసాయ ఉత్పత్తులు (యాపిల్స్, కివిఫ్రూట్, మనుకా తేనె ) అల్బుమిన్‌లకు మార్కెట్ యాక్సెస్ ఎంఐపి, ఇతర రక్షణ చర్యలతో టారిఫ్ రేటా కోటా (టిఆర్‌క్యూ) వ్యవస్థ ద్వారా నిర్వహించబడుతుంది. నాణ్యమైన దిగుమతులు వినియోగదారుల ఎంపికను నిర్ధారిస్తుంది. అదే సమయంలో దేశీయ రైతులను రక్షించడం కూడా చేస్తుంది.

### ‘సర్’ మొదటి దశ విచారణకు
## 32 లక్షల మంది మ్యాపింగ్ చేయని ఓటర్లు



**కోల్‌కతా:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్) కింద మొదటి దశ విచారణలకు సుమారు 32 లక్షల మంది మ్యాపింగ్ చేయని ఓటర్లను పిలవనున్నట్లు అధికారులు తెలిపారు. 2002 ఓటర్ల జాబితాలో తమ పేర్లను కుటుంబ సభ్యుల పేర్లతో అనుసంధానించలేని ఈ వర్గం ఓటర్లకు సంబంధించిన విచారణలు ఈనెల 27 నుండి ప్రారంభమవుతాయని ఆయన చెప్పారు. తాము మంగళవారం నుంచి సుమారు 10 లక్షల మంది ఓటర్లకు నోటీసులు పంపడం ప్రారంభించామని, మంగళవారం నుండి మరో 22 లక్షల మంది ఓటర్లకు కూడా నోటీసులు జారీ చేస్తామని పశ్చిమ బెంగాల్ ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయంలోని ఒక అధికారి పిటిఐకి తెలిపారు. గణన దశలో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 31,68,424 మంది మ్యాపింగ్ చేయని ఓటర్లను గుర్తించినట్లు ఆయన చెప్పారు. ఈ విచారణలు జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయాలు, సబ్‌డివిజనల్ కార్యాలయాలు, వివిధ ప్రభుత్వ విభాగాలు, అలాగే పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించబడతాయన్నారు. తార్కిక వ్యత్యాసాలు ఉన్న ఓటర్ల విషయాన్ని తదుపరి దశలో చేపడతామని, దీని కోసం ఎన్నికల సంఘం నుండి మార్గదర్శకాలు కోరినట్లు మరో అధికారి తెలిపారు. ప్రతి విచారణ ఒక మైక్రోఅబ్జర్వర్ పర్యవేక్షణలో నిర్వహించబడుతుందని ఆయన చెప్పారు. 4,000 మంది మైక్రోఅబ్జర్వర్లకు శిక్షణ 24న కోల్‌కతాలో రెండు దశల్లో జరుగుతుందని, ఈ మైక్రోఅబ్జర్వర్లందరూ రాష్ట్ర ప్రభుత్వ అధికారులు అని ఆయన పేర్కొన్నారు. తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మైక్రోఅబ్జర్వర్లకు స్థానిక బెంగాలీ భాషపై అవగాహన లేదని ఆరోపించారు. ఇదిలా ఉండగా, ఓటర్ల జాబితా ఎస్‌ఐఆర్ పురోగతిని సమీక్షించడానికి ఎన్నికల సంఘం నుండి ఒక ప్రతినిధి బృందం రాష్ట్రానికి వస్తుందని రాష్ట్ర సిఇఒ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఎస్‌ఐఆర్ ప్రక్రియలో విచారణ దశ పురోగతిని అంచనా వేయడానికి కమిషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.బి. జోషి, డిప్యూటీ సెక్రటరీ అభినవ్ అగర్వాల్ రాష్ట్రానికి వస్తారని ఆయన చెప్పారు. ఈ అధికారులు డిసెంబర్ 24న మైక్రోఅబ్జర్వర్ల శిక్షణా కార్యక్రమంలో కూడా పాల్గొంటారని ఆయన తెలిపారు.

### మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికల్లో
# ఎంవిఎకు కఠిన పరీక్ష



**ముంబయి:** మహారాష్ట్రలో ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికల్లో బిజెపి నేతృత్వంలోని మహాయుతి భారీ స్థానాలను గెలుచుకుంది. దీంతో ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ, మినీ అసెంబ్లీ ఎన్నికలుగా భావిస్తున్న ముంబయితో సహా 29 మున్సిపల్ కార్పొరేషన్లకు జరగబోయే ఎన్నికల్లో కఠిన పరీక్షను ఎదుర్కోనుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. గ్రామీణ ఎన్నికలు తరచుగా స్థానిక సమీకరణాల ద్వారా ప్రభావితమైనప్పటికీ, అవి రాజకీయ పార్టీల క్షేత్రస్థాయి బలానికి సూచికగా కూడా పనిచేస్తాయి. ఈ నేపథ్యంలో చిన్న పట్టణాలు, పాక్షిక పట్టణ ప్రాంతాలలో మహాయుతి సంస్థాగత యంత్రాంగాన్ని ఎదుర్కోవడంలో ప్రతిపక్షం ఎదుర్కొంటున్న ఇబ్బందిని ఇటీవలి ఫలితాలు హైలైట్ చేస్తున్నాయని పరిశీలకులు తెలిపారు. ఈ నెల ప్రారంభంలో ఎన్నికలు జరిగిన 288 మున్సిపల్ కౌన్సిళ్లు, నగర పంచాయతీలలో, మహాయుతి 207 మున్సిపల్ అధ్యక్ష పదవులను గెలుచుకుంది.బిజెపి అత్యధిక వాటాను దక్కించుకుని 117 మున్సిపల్ అధ్యక్ష పదవులను గెలుచుకోగా, దాని మిత్రపక్షాలైన ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన 53 పదవులను, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపి 37 పదవులను గెలుచుకున్నాయి.మరోవైపు, ప్రతిపక్ష ఎంవిఎ మొత్తం 44 స్థానాల్లో విజయం సాధించింది. కాంగ్రెస్ 28, ఎన్‌సిపి (శరద్చంద్ర పవార్) 7, ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలోని శివసేన (యుబిటి) వరుసగా 9 పదవులను గెలుచుకున్నాయి. నవంబర్ 2024 అసెంబ్లీ ఎన్నికలలో సాధించిన అద్భుతమైన పనితీరును మహాయుతి స్థానిక సంస్థల ఎన్నికలలో వాస్తవంగా పునరావృతం చేసిందని రాజకీయ విశ్లేషకులు పేర్కొన్నారు. జనవరి 15, 2026న జరగనున్న ముంబయితో సహా 29 మున్సిపల్ కార్పొరేషన్లకు జరగబోయే ఎన్నికలలో ఎంవిఎ ఇప్పుడు కీలకమైన సవాలును ఎదుర్కొంటోంది. సంక్షోభంలో ఉన్న ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలోని సేన (యుబిటి)కి, బిజెపి, షిండే నేతృత్వంలోని శివసేన నుండి బలమైన సవాలు మధ్య ముంబయిలోని తన ‘కోట’ను నిలబెట్టుకోవడం ప్రధాన సవాల్‌గా మారింది. ముంబయి కోసం సేన (యుబిటి), మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్‌ఎస్) మధ్య పొత్తుపై చాలా కాలంగా ఎదురుచూస్తున్న ప్రకటన డిసెంబర్ 24న వెలువడే అవకాశం ఉందని సేన నాయకుడు సంజయ్ రౌత్ సూచించారు. ఉద్ధవ్, రాజ్ థాక్రేల మధ్య సాధ్యమయ్యే పొత్తు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపదని బిజెపి నాయకుడు అమీత్ సతమ్ కొట్టిపారేశారు. ముంబయిలో ఎంవిఎ గందరగోళంలో ఉంది. నగరంలో ఒంటరిగా పోటీ చేస్తామని కాంగ్రెస్ ఇప్పటికే ప్రకటించింది. మరో పార్టీ అయిన ఎన్‌సిపి(ఎస్‌పి) ముంబయి రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తోంది. స్థానిక సంస్థల్లో మహాయుతి తన ఆధిపత్యాన్ని విస్తరించడంతో, ప్రతిపక్ష పార్టీలు తమ వ్యూహాన్ని, కూటమిలో నాయకత్వ పాత్రలను తిరిగి అంచనా వేయాలని ఒత్తిడి పెరుగుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలలో విదర్భలోని కొన్ని ప్రాంతాలలో, ముఖ్యంగా చంద్రపూర్, మరాఠ్వాడా ప్రాంతాలలో సాధించిన పరిమిత విజయాల కీర్తిలో కాంగ్రెస్ కష్టాల్లో పడినట్లు కనిపిస్తోంది. కాంగ్రెస్ చిహ్నంపై 41 మునిసిపల్ కౌన్సిల్ అధ్యక్ష పదవులు, 1,000కి పైగా కౌన్సిలర్ స్థానాలను గెలుచుకున్నట్లు పార్టీ పేర్కొంది. ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ పార్టీ స్థితిస్థాపకత తను ప్రదర్శించిందని, కాంగ్రెస్ ఇప్పుడు అట్టడుగు స్థాయిలో కీలక ప్రతిపక్ష శక్తిగా ఎదుగుతోందని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు హర్షవర్ధన్ సప్కల్ అన్నారు. కాంగ్రెస్ తన ప్రాంతీయ భాగస్వాముల కంటే మెరుగ్గా తన స్థానాన్ని నిలుపుకుందని ఫలితాలు చూపిస్తున్నాయని, తాము ఇప్పుడు బిజెపికి ప్రధాన సవాలుదారులం అని పేరు చెప్పకూడదని అభ్యర్థిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ అధికారి ఒకరు అన్నారు.అయితే, విశ్లేషకులు కాంగ్రెస్ మూడు నిర్మాణాత్మక సవాళ్లను ఎదుర్కొంటున్నారని ఎత్తి చూపారు: అనేక ప్రాంతాలలో బలమైన స్థానిక నాయకత్వ పైప్‌లైన్ లేకపోవడం, క్షేత్రస్థాయిలో కూటమి భాగస్వాములతో బలహీనమైన సమన్వయం, ప్రత్యేకమైన రాజకీయ కథనాన్ని వ్యక్తపరచడంలో ఇబ్బంది. స్థానిక ఎన్నికల విశ్లేషణ ప్రకారం సాంప్రదాయకంగా శివసేనకు కంచుకోట అయిన రత్నగిరిలో బిజెపి ఆశ్చర్యకరమైన విజయాలు సాధించిందని తెలుస్తుంది. ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన సింధుదుర్గ్‌ను పట్టుకుంది, సేన (యుబిటి) ప్రభావాన్ని దాని స్వంత వెనుక ప్రాంగణంలో పరిమితం చేసింది.

## ప్రియాంకకు రాజకీయాల్లో ఉజ్వల భవిష్యత్తు

- ప్రజలు ఆమెను అగ్రస్థానంలో చూడాలనుకుంటున్నారు : రాబర్ట్ వాద్రా




**న్యూఢిల్లీ:** తన భార్య ప్రియాంక గాంధీ వాద్రాకు రాజకీయాల్లో ఉజ్వల భవిష్యత్తు ఉందని, భవిష్యత్తులో ప్రజలు ఆమెను అగ్రస్థానంలో చూడాలనుకునే సమయం వస్తుందని వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రా మంగళవారం అన్నారు. బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలు హింసను ఎదుర్కొంటున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యల గురించి కాంగ్రెస్ ఎంపి ఇమ్రాన్ మసూద్ మాట్లాడుతూ ప్రియాంక గాంధీ ఇందిరా గాంధీలాగే బలమైన ప్రధానిగా నిరూపించుకుంటారని చెప్పిన వార్తలపై ఆయన స్పందించారు. మసూద్ మాట్లాడుతూ ప్రియాంక గాంధీ మంచి ప్రధాని అవుతారని, గతంలో ఇందిరా గాంధీ వ్యవహరించిన విధంగానే ఆమె కూడా వ్యవహరిస్తారని అన్నారు. మసూద్ సూచనపై వ్యాఖ్యానించమని కోరగా, రాబర్ట్ వాద్రా పిటిఐతో మాట్లాడుతూ, ‘ప్రియాంక (గాంధీ) కూడా తన అమ్మమ్మ (ఇందిరా గాంధీ), తన తండ్రి (రాజీవ్ గాంధీ), సోనియా జీ, తన సోదరుడు (రాహుల్ గాంధీ) నుండి చాలా నేర్చుకున్నారని నేను భావిస్తున్నాను. ప్రజలు ఆమెను ఆరాధిస్తారు. ఆమెలో ఆ లక్షణాలు ఉన్నాయని ప్రజలు చూస్తున్నారు... ఆమె మాట్లాడినప్పుడు, హృదయపూర్వకంగా మాట్లాడుతుంది. నిజంగా వినాల్సిన విషయాలపై ఆమె మాట్లాడుతుంది, వాటిపై చర్చిస్తుంది’ అని అన్నారు. ‘రాజకీయాల్లో ఆమెకు ఉజ్వల భవిష్యత్తు ఉందని, ఈ దేశంలో క్షేత్రస్థాయిలో అవసరమైన మార్పులు తీసుకురావడంలో కూడా ఆమెకు ఉజ్వల భవిష్యత్తు ఉందని నేను భావిస్తున్నాను. అది కేవలం ఆమె ఆలోచనలతో మాత్రమే కాదు, అందరి సమ్మతిని దృష్టిలో ఉంచుకుని అలా మాట్లాడుతున్నాను. ప్రజలకు అవసరమైన మార్పులు తీసుకురావడానికి వారి ఆలోచనలు కూడా ఉన్నాయి. ఇది కాలక్రమేణా జరుగుతుందని నేను భావిస్తున్నాను, ఇది అనివార్యం’ అని ఆయన అన్నారు. కాంగ్రెస్ వరుస ఎన్నికల ఓటముల తర్వాత, ప్రియాంక గాంధీకి పెద్ద పాత్ర ఇవ్వాలని పార్టీలోని ఒక వర్గం నుండి తరచుగా డిమాండ్లు వస్తున్నాయి.

## మూకదాడి కేసులో ఇద్దరు అరెస్టు



**పాలక్కాడ:** కేరళలో మూకదాడి ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. పాలక్కాడ వలయార్ సమీపంలోని కిళక్కే టప్పల్లం వద్ద ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వ్యక్తిని కొట్టి చంపినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మూక దాడి కేసులో మరో ఇద్దరిని అరెస్టు చేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. అరెస్టు చేసిన వారిని అట్టప్పల్లంకు చెందిన వినోద్, జగదీష్‌గా గుర్తించారు. ఈ నెల 17న రామనారాయణ్ (31)ను దొంగగా అనుమానించి దాడి చేసిన గుంపులో వీరు కూడా ఉన్నారని పోలీసులు తెలిపారు. ఇంతకుముందు, ఈ కేసులో పోలీసులు ఐదుగురిని అరెస్టు చేశారు. పోలీసుల ప్రకారం... ఈ కేసును దర్యాప్తు చేయడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఈ ఘటనలో పాల్గొన్న మరో ఎనిమిది మందిని గుర్తించింది. వారు ప్రస్తుతం పరారీలో ఉన్నారు. వారిని గుర్తించి అరెస్టు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 103(1) (హత్య) కింద నమోదు చేయబడిన ఈ కేసులో అదనపు సెక్షన్లు కూడా నమోదు చేస్తామని పోలీసు అధికారులు తెలిపారు. మృతుడి సామాజిక హోదాకు సంబంధించి బాధితుడి కుటుంబం నుండి మరిన్ని వివరాలు అందిన తర్వాత ఎస్‌సి/ఎస్‌టి (అత్యాచారాల నివారణ) చట్టంలోని నిబంధనలను కూడా జతపరుస్తామని వారు చెప్పారు. ఇదిలా ఉండగా, మంగళవారం రామనారాయణ్ మృతదేహాన్ని కొచ్చి నుండి రాయపూర్‌కు విమానంలో తరలించారని, విమానాశ్రయం నుండి అతని స్వగ్రామానికి తరలించడానికి ఏర్పాట్లు చేసినట్లు పోలీసులు తెలిపారు. బాధితుడి కుటుంబానికి త్వరలో పరిహారం ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని అధికారులు తెలిపారు. కూలీ అయిన రామనారాయణ్ ఇటీవల వలయార్ ప్రాంతానికి వచ్చాడు. దొంగతనం చేశాడనే అనుమానంతో ఒక గుంపు అతన్ని పట్టుకుని దారుణంగా కొట్టింది. అతన్ని పాలక్కాడ జిల్లా ఆసుపత్రికి తరలించగా, అక్కడ అతను చికిత్స పొందుతూ మరణించాడు. గతంలో వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించిన ఒక వీడియోలో, ఓ వ్యక్తి రామనారాయణ్‌ను బంగ్లాదేశ్‌కు చెందినవాడివా అని అడగడం వినిపించింది. దేశవ్యాప్తంగా సంఘ్ పరివార్ వ్యాపింపజేస్తున్న మత విద్వేషానికి రామనారాయణ్ బాధితుడయ్యాడని విద్యాశాఖ మంత్రి వి శివన్‌కుట్టి మంగళవారం అన్నారు. రామనారాయణ్‌ను కొట్టిన వ్యక్తులు ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలని సిపిఐ( ఎం) ఆరోపించింది. రాష్ట్ర ప్రభుత్వం బాధితురాలి కుటుంబానికి అండగా నిలుస్తుందని, నిందితులను ఇప్పటికే అరెస్టు చేశామని శివన్‌కుట్టి అన్నారు. బాధ్యులైన వారు ఏ రాజకీయ అనుబంధాలు కలిగి ఉన్నప్పటికీ, చట్ట ప్రకారం వారికి గరిష్ఠ శిక్ష పడేలా చూడటానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు.

## కర్బీ ఆంగ్లాంగ్‌లో హింస

- రెండు వర్గాల మధ్య ఘర్షణలు
- పోలీసులు లాఠీచార్జి, బాష్పవాయు గోళాల ప్రయోగం



**డిప్పు/గువాహటి:** అసోంలో ఇప్పటికే అల్లర్లతో అట్టుడుకుతున్న కర్బీ ఆంగ్లాంగ్ జిల్లాలో మంగళవారం తాజా హింస చెలరేగింది. నిరసనకారుల రెండు వర్గాల మధ్య ఘర్షణలు జరగడంతో ఎనిమిది మంది గాయపడ్డారు. వారిని చెదరగొట్టడానికి పోలీసులు లాఠీచార్జ్ చేసి, బాష్పవాయు గోళాలను ప్రయోగించారని అధికారులు తెలిపారు. నిషేధాజ్ఞలు అమలులో ఉన్నప్పటికీ, సోమవారం ఒక గుంపు దుకాణాలను తగలబెట్టిన మహిళలు, పిల్లలతో సహా పెద్ద సంఖ్యలో ప్రజలు హింసకు వ్యతిరేకంగా నిరసన తెలియజేయడానికి బయటకు వచ్చారు. అదే సమయంలో, గిరిజన ప్రాంతం నుండి ఆక్రమణదారులను తొలగించాలని డిమాండ్ చేస్తున్న ఆందోళనకారులు కూడా ఖెరోని మార్కెట్ ప్రాంతంలో గుమిగూడారు. రెండు వర్గాలు కూడా ఆగ్రహంతో ఉన్నాయని, ఆ ప్రాంతంలో మోహరించిన భద్రతా బలగాలు వారిని శాంతింపజేయడానికి ప్రయత్నించాయని, అయితే అకస్మాత్తుగా ఇరువైపుల నుండి రాళ్ల దాడి ప్రారంభమైందని, ఈ ఘటనలో పలువురు నిరసనకారులు, పోలీసు సిబ్బంది, సంఘటనను కవర్ చేస్తున్న మీడియా ప్రతినిధులు గాయపడ్డారని ఒక సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. పరిస్థితి అదుపు తప్పడంతో, పోలీసులు లాఠీచార్జ్ చేసి, ఆ తర్వాత నిరసనకారుల రెండు వర్గాలను చెదరగొట్టడానికి బాష్పవాయు గోళాలను ప్రయోగించారని ఆయన చెప్పారు. ఆ ప్రాంతంలో పరిస్థితి ‘ఉద్రిక్తంగా’ ఉందని, అదనపు బలగాలను ఘటనా స్థలానికి పంపినట్లు తెలిపారు. నిరసనకారులు అంతకుముందు ఖెరోని ప్రాంతంలో రెండు మోటార్ సైకిళ్లను తగలబెట్టారు. ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ మాట్లాడుతూ కర్బీ ఆంగ్లాంగ్‌లో పరిస్థితి చాలా సమస్యాత్మకంగా ఉంది అని అన్నారు. ‘సీనియర్ మంత్రి రనోజ్ పెగు జిల్లాలో ఉన్నారు. ఈ సమస్య త్వరలోనే పరిష్కారమవుతుందని నమ్ముతున్నాను’ అని శర్మ ఒక కార్యక్రమం సందర్భంగా అన్నారు. అంతకుముందు, పెగుతో చర్చల అనంతరం గిరిజన ప్రాంతాల నుండి ఆక్రమణదారులను తొలగించాలని డిమాండ్ చేస్తూ నిరసనకారులు చేపట్టిన నిరాహార దీక్షను విరమించుకున్నారు. వివిధ రాజకీయ, సామాజిక సంస్థలకు చెందిన ఆందోళనకారులు అక్రమ నివాసితులను తొలగించాలని డిమాండ్ చేస్తూ గత 12 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నారు. పెగు నిరసనకారులతో చర్చలు జరిపారు. ఈ సమస్యపై త్వరలో త్రైపాక్షిక చర్చలు జరుగుతాయని ప్రభుత్వం నుండి హామీ లభించడంతో వారు తమ నిరాహార దీక్షను విరమించుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి హాజరవుతారని పెగు చెప్పారు. సోమవారం, కర్బీ ఆంగ్లాంగ్ అటానమస్ కౌన్సిల్ (కెఎఎసి) చీఫ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ తులిరామ్ రోంగ్‌హాంగ్ నివాసానికి, ఖెరోని బజార్‌లోని సుమారు 15 దుకాణాలకు నిప్పుపెట్టి విధ్వంసం సృష్టించిన నిరసనకారులపై పోలీసులు జరిపిన కాల్పుల్లో నలుగురు గాయపడ్డారు. సోమవారం నాడు నిరసనకారులు ఖెరోనిలోని పోలీస్ స్టేషన్‌పై దాడి చేయడానికి కూడా ప్రయత్నించారు, కానీ భద్రతా బలగాలు దానిని అడ్డుకున్నాయి. కర్బీ ఆంగ్లాంగ్, పొరుగున ఉన్న పశ్చిమ కర్బీ ఆంగ్లాంగ్ జిల్లాల్లో నిషేధాజ్ఞలు విధించారు.

## బిఎంసి ఎన్నికల్లో పొత్తులకు పార్టీల కసరత్తు


- శివసేన (యుబిటి), ఎంఎన్‌ఎస్‌తో ఎన్‌సిపి (ఎస్‌పి) చర్చలు

**ముంబయి:** బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బిఎంసి)కి జనవరి 15న ఎన్నికలు జరగనున్నాయి. పొత్తులపై పలు పార్టీలు కసరత్తు ప్రారంభించాయి. ఈ నేపథ్యంలో శివసేన (యుబిటి), రాజ్ థాక్రే నేతృత్వంలోని ఎంఎన్‌ఎస్‌తో తమ పార్టీ పొత్తు కోసం చర్చలు జరుపుతోందని మహారాష్ట్ర నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్‌పి) అధ్యక్షుడు శశికాంత్ షిండే తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికార మహాకూటమిలో ప్రధాన భాగస్వామి అయిన బిజెపికి వ్యతిరేకంగా ఐక్య పోరాటం చేయడానికి, ఆ పార్టీని వ్యతిరేకించే అన్ని పార్టీలను ఏకతాటిపైకి తీసుకురావడానికి చర్చలు జరుగుతున్నాయని షిండే అన్నారు. ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ నేతృత్వంలోని అధికార ఎన్‌సిపి పుణె పురపాలక సంఘం ఎన్నికల కోసం తమ పార్టీతో పొత్తు పెట్టుకుంటుందా అని అడిగిన ప్రశ్నకు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఈ విషయంపై నిర్ణయం తీసుకునే అధికారాన్ని ఎన్‌సిపి (ఎస్‌పి) తన స్థానిక యూనిట్లకు ఇచ్చిందని మాజీ రాష్ట్ర మంత్రి బదులిచ్చారు. పుణె మున్సిపల్ కార్పొరేషన్ (పిఎంసి) ఎన్నికల కోసం ఎన్‌సిపి (ఎస్‌పి) ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్న కూటమిలో కాంగ్రెస్ భాగమవుతుందా అనే ప్రశ్నకు, ఆ పార్టీ ఇప్పటికే ప్రతిపక్ష మహా వికాస్ అఘాడి (ఎంవిఎ)లో భాగమని షిండే గుర్తు చేశారు. ఎంవిఎలో కాంగ్రెస్, శివసేన (యుబిటి), ఎన్‌సిపి (ఎస్‌పి) ఉన్నాయి. రాజ్ థాక్రే నేతృత్వంలోని మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్‌ఎస్) ఎంవిఎలో భాగం కాదు, కానీ రానున్న పౌర ఎన్నికల కోసం పొత్తు పెట్టుకోవడానికి శివసేన (యుబిటి), ఎన్‌సిపి (ఎస్‌పి) దానిని తమ వైపుకు ఆకర్షించడానికి ప్రయత్నిసున్నాయి. ముంబయి, పుణె, థానే, నాగ్‌పూర్, నాసిక్‌తో సహా మొత్తం 29 మున్సిపల్ కార్పొరేషన్లకు 15న ఎన్నికలు జరగనున్నాయి.

### ప్రజల కేంద్రీకృత భద్రతకు...
# ‘జన్ భాగీదారి’ ఒక మూలస్తంభం

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉద్ఘాటన

**న్యూఢిల్లీ :** సమాజ భాగస్వామ్యం జాతీయ భద్రతను బలోపేతం చేస్తుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నొక్కిచెప్పారు. ప్రజలు తమ చుట్టూ జరిగే వాటిని నిష్క్రియాత్మకంగా గమనించాల్సిన అవసరం లేదని, ప్రజా కేంద్రీకృత భద్రతకు మూల స్తంభంగా ‘జన్ భాగీదారి’ని అభివర్ణించారు. మంగళవారం ఇక్కడ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబి) నిర్వహించిన ఒక కార్యక్రమంలో ద్రౌపది ముర్ము ప్రసంగిస్తూ సోషల్ మీడియా సమాచారం కమ్యునికేషన్ ప్రపంచాన్ని మార్చివేసిందన్నారు. ఇది సృష్టి విధ్వంసం రెండింటి సామర్థ్యాన్ని కలిగి ఉందని ముర్ము అన్నారు.తప్పుడు సమాచారంతో ప్రజలను రక్షించడం చాలా సవాల్‌తో కూడుకున్న పని అని ఆమె చెప్పారు. ఈ పనిని నిరంతరం చాలా ప్రభావవంతంగా నిర్వహించాలన్నారు. జాతీయ ప్రయోజనాల కోసం వాస్తవ ఆధారిత కథనాలను స్థిరంగా ప్రదర్శించే చురుకైన సోషల్ మీడియా వినియోగదారుల సమాజాన్ని సృష్టించడం అవసరమని ముర్ము సూచించారు. భద్రతా సమాజాలను సృష్టించడంలో తమ ఇన్‌పుట్‌లతో ప్రొఫెషనల్ దళాలకు సహాయం చేసే అప్రమత్తమైన పౌరులకు అనేక ఉదాహరణలు ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వ కాలం నుండి మారుతున్న వారసత్వ భారం కారణంగా కొంత మంది సహాయం కోసం నమ్మదగిన స్నేహపూర్వక వ్యక్తులుగా పనిచేస్తున్నారని రాష్ట్రపతి ముర్ము వివరించారు. సివిల్ పోలీసులు, అంతర్గత భద్రతా సంస్థలు ప్రజలకు సేవచేసే స్ఫూర్తితో పనిచేయాలని ఆమె చెప్పారు. ‘ప్రజలు కేంద్రీకృత జాతీయ భద్రత’‘వీక్షిత్ భారత్ నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం’ అనే అంశంపై ఇంటెలిజెన్స్ బ్యూరో శతాబ్ది ఎండోమెంట్ ఉపన్యాసంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించారు. ప్రజల భాగస్వామ్యం ద్వారా మాదకద్రవ్యాల ముప్పుకు వ్యతిరేకంగా దేశం సమర్థవంతమైన శిబిరాన్ని ప్రారంభించిందని, తీవ్రవాదాన్ని నిర్మూలించే ప్రయత్నాలు జరగాలని సూచించారు. జాతీయ వినియోగదారులకు అత్యంత క్లిష్టమైన సవాళ్లు సంప్రదాయేతర, డిజిటల్ స్వభావం అని ముర్ము చెప్పారు. పెరుగుతున్న డిజిటల్ మోసం సమస్యకు గృహ, సంస్థాగత, సమాజ స్థాయిలలో అప్రమత్తత అవసరం అని ద్రౌపది ముర్ము తెలియజేశారు. సరిహద్దు ప్రాంతాలలో ఉద్రిక్తతలు, ఉగ్రవాదం, తిరుగుబాటు, మతపరమైన తీవ్రవాదం భద్రతాపరమైన ఆందోళనలకు దారితీస్తున్నాయని రాష్ట్రపతి వివరించారు. అంతర్జాతీయ పరిణామాల వల్ల దేశ అంతర్గత భద్రత పరిస్థితి కూడా ప్రభావితం అవుతుందని తెలిపారు. ప్రపంచం భౌగోళికరాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక స్థితిగతులు, వాణిజ్య అంతరాయాలని చూస్తోందని, ఈదృగ్విషయాలకు అంతర్లీనంగా లేదా అంతర్గతంగా కూడా సంబంధం ఉందని రాష్ట్రపతి వివరించారు. 2026 మార్చి 31నాటికి వామపక్ష ఉగ్రవాదాన్ని నిర్మూలించాలనే దృఢ సంకల్పానికి భద్రతా సంస్థలను ముర్ము అభినందించారు. గతంలో వామపక్ష తీవ్రవాదాన్ని అంతర్గత భద్రతా సవాల్‌గా అంగీకరించారు. వామపక్ష తీవ్రవాదం ఇప్పుడు పూర్తిగా నిర్మూలనకు దగ్గరగా ఉందన్నారు. 2014లో 126 జిల్లాలు మావోయిస్టు ప్రభావితమైన జిల్లాలుగా వివరించారు. కాగా ఇప్పుడు 11జిల్లాలు మాత్రమే మావోయిస్టు ప్రభావిత జిల్లాలు అని పేర్కొన్నారు. నేటికి కేవలం మూడు జిల్లాలు మాత్రమే అత్యంత ప్రభావితమైన జిల్లాలుగా కొనసాగుతున్నాయని రాష్ట్రపతి వివరించారు. ప్రజల భాగస్వామ్యం ద్వారా మనందరం అప్రమత్తమైన, శాంతియుతమైన, సురక్షితమైన, సంపన్నమైన భారత దేశాన్ని నిర్మించేదిశగా వేగంగా ముందుకు సాగుతామని తాను విశ్వసిస్తున్నానని రాష్ట్రపతి ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్, కేంద్ర హోం సెక్రటరీ గోవింద్ మోహన్, ఐబి చీఫ్ తపన్ కుమార్ డేకా తదితరులు పాల్గొన్నారు.





**బహిరంగ ప్రకటన**

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా! నా క్లయింటు అయిన **కొర్ర వి వి ఎస్ సి హెచ్ కుమార్ నాయక్, తండ్రి: కొర్ర శివ,** నివాసం: ఇంటి నెం.13-6-150, రైల్వే కాలని, కైకొండాయి గూడెం, ఖమ్మం జిల్లా. ఖమ్మం జిల్లా, ఖానాపురం హవేలి, ప్రశాంతి నగర్ నివాసి అయిన గుడవర్తి రాణి W/O గుడవర్తి నాగేశ్వరావు, సదరు రాణి భర్త గారి అయిన గుడవర్తి నాగేశ్వరావు గారు గతించి యున్నారు. నా క్లయింట్ అయిన కొర్ర వి వి ఎస్ సి హెచ్ కుమార్ నాయక్, గుడవర్తి నాగేశ్వరరావు గారి వారసులు అయిన భార్య రాణి, కూతురు వల్లభనేని లావణ్య W/O ప్రసాద్ రావు, కుమారుడు గుడవర్తి మన్మోహన్‌తో **యకరం// 1.28 కుంటలు** 17-10-2025 ఎగ్రిమెంట్ ద్వారా క్రయం పొంది యున్నారు. నా క్లయింట్ అయిన కొర్ర వి వి ఎస్ సి హెచ్ కుమార్ నాయక్ అట్టి వ్యవసాయ భూమిని రిజిస్ట్రేషన్ చేయించు కొనుటకు సిద్ధంగా ఉన్నారు. కావున ఎవరికైన ఏవిధమైన అభ్యంతరంలు, ఆక్షేపణలు ఉన్నచో ఈ రోజు నుండి 7 రోజులలో సంబంధిత డాక్యుమెంట్లతో రాత పూర్వకముగా గాని, న్యాయవాది ద్వారా గాని తెలియజేయగలరని మనవి. లేనిచో ఎవరికీ ఏ విధమైన అభ్యంతరంలు లేవని తలచి క్రింది తెలిపిన షెడ్యూల్ ఆస్తిని సంబంధిత రిజిస్ట్రేషన్ వారి కార్యలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకోబడును. తదుపరి వచ్చిన అభ్యంతరంలు పరిగణించబడవు.

**షెడ్యూల్ ఆస్తి :** ఖమ్మం జిల్లా, కామేపల్లి మండలం, కొండాయి గూడేం గ్రామ రెవిన్యూలో గల సర్వే నెంబర్ 41/1 (ఓల్ సర్వే నెం.41)లో గల వ్యవసాయ భూమి **యకరం //1.28 కుంటలు** మెట్ట భూమికి

**సరి హద్దులు:**

**తూర్పు** : ఖమ్మం To ఇల్లందు R&B రోడ్డు
**పడమర** : గుడవర్తి సీతయ్య గారి భూమి
**ఉత్తరం** : గుడవర్తి వెంకటేశ్వర్లు గారి భూమి
**దక్షిణం** : గుడవర్తి సీతారామయ్య గారి భూమి

సం/-
షేక్. లతీఫ్,
న్యాయవాది, ఖమ్మం.
సెల్: 9848334165

ప్రజాపక్షం
బుధవారం, 24 డిసెంబరు

# మహారాష్ట్రలో స్థానిక సమరం

''కలసి ఉంటే కలదు సుఖం – విడిపోతే కలదు దుఃఖం'' అనే నానుడి మహారాష్ట్రలో ఇండి కూటమి రూపమైన 'మహా వికాస్ అఘాది(ఎంవిఎ)కి అక్షరాలా వర్తిస్తుంది. 2024 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి, శివసేన(షిండె), ఎన్‌సిపి(అజిత్‌పవార్)లతో కూడిన 'మహాయుతి' కూటమి అధికారంలోకి వచ్చిన నాటినుంచీ ప్రతిపక్ష ఎంవిఎ భాగస్వాముల్లో (కాంగ్రెస్, శివసేన–యుబిటి, ఎన్‌సిపి(శరద్‌పవార్) ఆత్మవిశ్వాసం సన్నగిల్లింది. అది తాజాగా జరిగిన స్థానిక సంస్థల (మున్సిపాలిటీలు, పంచాయతీరాజ్) ఎన్నికల్లో స్పష్టమైంది. ఎంవిఎ పట్టుదలతో, ఐక్యంగా రాజకీయ పోరాటం చేసి ఉంటే ఫలితాలు ప్రస్తుత దారుణ స్థితికన్నా మెరుగ్గా ఉండేవి. మహారాష్ట్ర నగర పంచాయత్, నగర పరిషద్‌లలోని మొత్తం 286 సీట్లకు జరిగిన ఎన్నికల్లో ఎంవిఎకి దక్కినవి 44 మాత్రమే. వాటిలో కాంగ్రెస్ 28, ఎన్‌సిపి(ఎస్‌పి)7, శివసేన(యుబిటి)9. ఇంతపెద్ద పరాజయానికి ఆత్మావలోకనం సరైన ఔషధం – పాలకపక్షంపై, ఎన్నికల కమిషన్‌పై ఆరోపణలు నిష్ఫలం. పాలక మహాయుతి 207 సీట్లు గెలుపొందింది – బిజెపి 117, శివసేన(షిండె)53, ఎన్‌సిపి (అజిత్)37. బిజెపి అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించినప్పటికీ దాని మిత్రపక్షాలు కూడా చెప్పుకోదగ్గ ఫలితాలు సాధించాయి. భాగస్వామ్యపక్షాలు బాహాట కొట్లాటలు లేకుండా కలిసికట్టుగా పనిచేయటంవల్లనే ఇది సాధ్యమైంది. అయితే పాలక కూటమి ఫలితాలు తన వల్లనే సాధ్యమైనట్లుగా ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నావీస్ ప్రకటనలో అహంభావం వ్యక్తమైంది. అసెంబ్లీ ఎన్నికల్లోగాని, ఈ ఎన్నికల్లోగాని షిండె, అజిత్ పవార్ పార్టీలు దృఢంగా అండగా నిలబడటంవల్లనే బిజెపి మెరుగైన ఫలితాలు సాధించగలిగింది. అది మరిచిపోయి ఒంటెత్తుపోకడపోతే ఎదురుదెబ్బలు తప్పవు. అదే సమయంలో, ప్రతిపక్ష ఎంవిఎ తమ దిశను సక్రమంగా, కచ్చితంగా నిర్ణయించుకోకపోతే బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ యంత్రాంగాన్ని తట్టుకోవటం కష్టం. ఓటింగ్ యంత్రాల తారుమారు, విచ్చలవిడిగా ధనం వెచ్చించటం వల్ల మహాయుతికి ఈ ఫలితాలు దక్కాయని శివసేన(యుబిటి) నాయకుడు సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. స్థానిక ఎన్నికల్లో పాలకపార్టీకి ఎప్పుడూ అడ్వాంటేజ్ ఉంటుంది. అధికార దుర్వినియోగం, ధనం వెచ్చించటం షరామామూలే. వాటన్నిటినీ తట్టుకుని గౌరవప్రదమైన ఫలితాలు సాధించగలిగితేనే ప్రతిపక్షం పరువు నిలుపుకోగలుగుతుంది.

రెండోదశగా బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. దీనితోపాటు 39 మున్సిపల్ కార్పొరేషన్‌లకు, 32 జడ్‌పిలకు, 336 పంచాయతీలకు జనవరి15న పోలింగ్ జరుగుతుంది. ప్రతిష్టాత్మక బిఎంసి కార్పొరేషన్‌పై ఏ జండా ఎగురుతుందో? బిజెపికి మిత్రపక్షాలనుంచి సీట్ల ఒత్తిడి తప్పదు. కాగా శివసేన సహోదరులు ఉద్ధవ్ థాక్రే, రాజ్‌థాక్రే కలసి పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. సోదరులు చీలిపోయాక నగరం లో, మరికొన్ని నగరాల్లో బలహీనపడిన శివసేనకు ఈ ఐక్యత (ఎస్‌ఎస్–యుబిటి + ఎంఎన్‌ఎస్) తిరిగి జీవం పోస్తుందని వారు భావిస్తున్నారు. ఎంఎన్‌ఎస్ అరాచక చరిత్ర దృష్ట్యా ఈ పొత్తు మైనస్ కానూవచ్చు. బిఎంసిలో ఒంటరిగా పోటీ చేయాలని కాంగ్రెస్ నిర్ణయించింది. మిగతా చోట్ల స్థానిక నాయకులు నిర్ణయాలు తీసుకుంటారని కాంగ్రెస్ నాయకుడు విజయ్ వడెట్టీవార్ చెప్పారు. కాగా ముంబయి, థానె, మీరా–భయందర్, కల్యాణ్–దొంబివ్‌లి, పూనె, నాసిక్ కార్పొరేషన్స్‌లో ఉద్ధావ్–రాజ్ థాక్రే పార్టీలు కలిసి పోటీ చేస్తాయని, మిగతా చోట్ల స్థానిక నాయకులు నిర్ణయాలు తీసుకుంటారని సంజయ్ రౌత్ చెప్పారు. ఇదిలావుండగా, పూనె, పింప్రి – చించివాడ్ కార్పొరేషన్స్‌లో పవార్ సోదరులు (ఎన్‌సిపి, ఎన్‌సిపి(శరద్ పవార్) కలిసి పోటీ చేస్తున్నారు. ఆ రెండు చోట్ల మహాయుతి భాగస్వాముల మధ్య స్నేహపూర్వక పోటీ ఉంటుందని ముఖ్యమంత్రి ఫడ్నావీస్ ధృవీకరించారు. అంటే ప్రభుత్వ, ప్రతిపక్ష కూటముల్లో అనైక్యత స్పష్టంగా కనిపిస్తున్నది. ఏమైనా, ప్రతిపక్ష కూటమి ఊగిసలాటలు విడనాడి స్పష్టమైన రాజకీయ వైఖరితో ఐక్యంగా పోరాటం చేయగలిగితేనే భవిష్యత్ ఆశాజనకంగా ఉంటుంది.

# ప్రపంచంలోనే అతి పెద్ద వ్యవస్థను నిర్మించుకున్న ఆర్‌ఎస్‌ఎస్

**సి.ఆదికేశవన్**


* రిజిస్టర్ లేనప్పటికీ 2,500లకు పైగా అనుబంధ సంస్థలు
* వాటి ద్వారానే నిధుల సమీకరణ, కార్యక్రమాల విస్తరణ
* బైటపెట్టిన 'ది కారావాన్' మ్యాగజైన్
* 'సీయింగ్ ది సంఘ్' పేరుతో పరిశోధనాత్మక కథనం

'ది కారవాన్' మ్యాగజైన్ భారత జర్నలిజం చరిత్రలో తీవ్ర పరిణామాలు చూపించే పరిశోధన ప్రాజెక్టులలో ఒకదాన్ని డిసెంబర్ మాస పత్రికలో విడుదల చేసింది. 'సీయింగ్ ది సంఘ్' శీర్షికతో ప్రచురితమైన కథనంలో ఆరు సంవత్సరాలు పరిశోధన పటాలతో తొలిసారిగా, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) పూర్తి సంస్థాగత నిర్మాణాన్ని వివరించింది. పరిశోధకులు ఫెలిక్స్ పాల్, క్రిస్టోఫ్ జాఫ్రెలాట్ నేతృత్వంలో, సైన్సెస్ పోస్ సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ స్టడీస్‌లో అందుబాటులో ఉన్న డేటాతో, ఈ ప్రాజెక్ట్ ఆర్‌ఎస్‌ఎస్‌తో బలమైన, సంబంధాలను కలిగి ఉన్న 2,500 కంటే ఎక్కువ సంస్థలను గుర్తించింది. ఇవి ఆర్‌ఎస్‌ఎస్ సంస్థ అధికారికంగా అంగీకరించిన మూడు డజన్ల అనుబంధ సంస్థల కంటే చాలా ఎక్కువ. ఈ పరిశోధన ఫలితాలు స్వయంప్రతిపత్తి సంస్థలకు మాత్రమే ఆర్‌ఎస్‌ఎస్ 'స్ఫూర్తినిస్తుందనే' దీర్ఘకాలిక వాదనను నిర్ణయాత్మకంగా సవాలు చేస్తాయి. తద్భిన్నంగా, ఈ అతిపెద్ద పచ్చి మితవాద సంస్థ నిర్మాణ వ్యవస్థ పరిధిని అది డాక్యుమెంట్ చేసింది. కేంద్రం నుంచి సమన్వయంతో, బ్యూరోక్రటిక్ నెట్‌వర్క్ కలిగి ఉన్నట్లు వెల్లడించింది.

సంఘ్ అనుబంధ సంస్థలు 'స్వతంత్ర, స్వయంప్రతిపత్తి, స్వీయఆధారితమైనవి' అని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ పదేపదే నొక్కి చెబుతుంటారు. జనబాహుళ్యంలోని ఆర్‌ఎస్‌ఎస్ సాహిత్యం ఈ ప్రతిష్టను జాగ్రత్తగా పెంపొందిస్తుంది. ఒకవైపు దాని అనుబంధ సంస్థల ఉమ్మడి శక్తి నుండి ప్రయోజనం పొందుతూనే, మరోవైపు వాటిని తిరస్కరిస్తున్నట్లుగా ఆ సంస్థ వ్యవహరిస్తుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆర్‌ఎస్‌ఎస్ ను 'ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్‌జిఒ'గా అభివర్ణించడం ఈ సందిగ్ధతను పెంచుతోంది. ఒకవైపు దాని విస్తృతిపై ఉత్సవాలు జరుపుకుంటూనే, మరోవైపు దాని నిర్మాణాన్ని కనపడకుండా ఉంచుతుంది. సంఘ్ స్వంత అంతర్గత ప్రచురణల నుంచి విస్తృత వివరాలు ద్వారా 'సీయింగ్ ది సంఘ్' కథనం ఈ పొగమంచును తుత్తునీయలు చేసింది. ఆ ప్రచురణలలో ఆర్‌ఎస్‌ఎస్ తరచుగా అనుబంధ సంస్థలను 'ఆర్గాన్స్', 'ప్రొజెనీ', లేదా 'ఫ్రంట్స్'గా వర్ణిస్తుంది. అధికారం బలవంత పెట్టడం ద్వారా కాకుండా సంస్థాగత మార్గాల ద్వారా ప్రవహిస్తుంది. ఉమ్మడి సిబ్బంది, ఉమ్మడి చిరునామాలు, సమన్వయ కార్యక్రమాలు, ఆర్థిక పైపులైన్‌లు(ప్రవాహ మార్గాలు), ప్రచారకులు అని పిలువబడే పూర్తికాల క్రమశిక్షణయుతమైన కార్యకర్తల ద్వారా ఇదీ సాగుతుంటుంది.

పరిశోధన ద్వారా రూపొందించిన సమాచారంలో(డాటాసెట్) ఉన్న సైద్ధాంతిక సారూప్య సంస్థలు ఏమాత్రం బలహీనంగా ఉన్నవి కాదు. ఇది నాయకత్వం, మౌలిక సదుపాయాలు, వనరులలో సంస్థలు ఎలా పరస్పరం పెనవేసుకుంటాయో గుర్తించే భౌతిక పటం. పరిశోధకులు కఠినమైన, బరువైన పద్ధతిని అభివృద్ధి చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ వివిధ స్థాయిలో పట్టును గుర్తించడానికి సంఘ్ మూలాల్లోకి వెళ్ళి ఉమ్మడి ఆఫీస్ బేరర్లు, ఉమ్మడి ప్రాంగణాలు, ఆర్థిక ప్రవాహాలు, సంస్థాగత పేర్లు, బహిరంగ గుర్తింపును పరిశోధించడం జరిగింది. ఫలితంగా ఆర్‌ఎస్‌ఎస్ ఒక విస్తృత సైద్ధాంతిక ఉద్యమంగా కాకుండా విస్తృత కేంద్రంగా, విస్తారమైన హద్దులతో కూడిన ఒకే రాజకీయ జీవిగా కనిపిస్తుంది. దాని కేంద్రంలో బిజెపి, విహెచ్‌పి, ఎబివిపి, విద్యాభారతి, సేవాభారతి, వనవాసి కళ్యాణ్ ఆశ్రమం వంటి ఉన్నత స్థాయి సంస్థలు ఉన్నాయి. వీటి చుట్టూ వందలాది సమన్వయ ట్రస్టులు, సేవా సంస్థలు, శిక్షణా సంస్థలు, థింక్ ట్యాంకులు, ప్రచార బృందాలు, విదేశీ నిధుల సేకరణ సంస్థలు ఉన్నాయి.

వాటిలో ఒకటి జమ్మూలో బయటపడిన వేదమందిర్ కాంప్లెక్స్ అత్యంత అద్భుతమైన ఉదాహరణ. ఇది నాలుగు హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న ఒకే ఆస్తి. ఇరవైకి పైగా సంఘ్ సంబంధిత సంస్థలకు నిలయంగా ఉంది. ఇది జమ్మూ కశ్మీర్‌లోని ఆర్‌ఎస్‌ఎస్ ఉనికిలో దాదాపు సగం. పాఠశాలలు, అనాథాశ్రమాలు, హాస్టళ్లు, వైద్య మిషన్లు, సంక్షేమ



ట్రస్టులు, విద్యా సంస్థలు అన్నీ ఒకే చిరునామా నుండి పనిచేస్తాయి. దీనిని పరస్పరం ముడిపడి ఉన్న పాత్రలలో ఉన్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలతో కూడిన చిన్న సముదాయం నిర్వహిస్తుంది. స్వతంత్ర ఎన్‌జిఒలు కాకుండా, ఈ సంస్థలు ప్రాంతీయ కేంద్రంగా పెనవేసుకొని పనిచేసే క్లస్టర్‌లు నిర్వహిస్తాయి. దీనిని సంఘ్ ప్రచురణలలో కేశవ్ భవన్ అని వర్ణించారు. ఈ పేరు సాధారణంగా ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యాలయానికి ప్రత్యేకించబడింది. భగవత్‌తో సహా సీనియర్ ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు అనుబంధ అధిపతులతో రహస్య సమావేశాల కోసం ఇక్కడకు క్రమం తప్పకుండా వస్తుంటారు.

పరిశోధన ఒక విలక్షణమైన విస్తరణ వ్యూహాన్ని గుర్తించింది. దీనిని పరిశోధకులు సంస్థాగత వ్యాప్తిగా అభివర్ణిస్తారు. ఇప్పటికే ఉన్న పౌర సమాజ సమూహాలతో కూటములను నిర్మించడానికి బదులుగా, ఆర్‌ఎస్‌ఎస్ క్రమపద్ధతిలో కొత్త సంస్థలను సృష్టిస్తుంది. అనుబంధ సంస్థలను సృష్టించడానికి వాటిని ప్రోత్సహిస్తుంది. వాటిని క్రమానుగత నెట్‌వర్క్‌లో భాగం చేసి, వాటిపై ప్రచారక్‌ల పర్యవేక్షణ సాగుతుంది. ఈ ప్రక్రియ కేంద్ర నియంత్రణను కాపాడుతూనే దాదాపు అపరిమిత విస్తరణను అనుమతిస్తుంది. ఉదాహరణకు, విద్యాభారతి దేశవ్యాప్తంగా వేలాది పాఠశాలలను నిర్వహిస్తోంది. కానీ వివిధ పేర్లతో పనిచేస్తున్న రాష్ట్ర స్థాయి ట్రస్టుల ద్వారా అవి నడుస్తుంటాయి. సేవాభారతి ఇదే విధానాన్ని అనుసరిస్తుంది. రాష్ట్రాలలో డజన్ల కొద్దీ విభిన్న స్వచ్ఛంద సంస్థలుగా కనిపిస్తుంది. అయినప్పటికీ అంతర్గత ప్రచురణలు ఈ వ్యత్యాసాలను అసంబద్ధంగా భావిస్తాయి.

సంఘ్ పరిధి భారతదేశానికే పరిమితం కాలేదు. ఈ పరిశోధన సమాచారం(డేటాసెట్)లో విదేశాలలో 300కి పైగా సంస్థలను మ్యాప్ చేసింది. వీటిలో ప్రధాన కేంద్రీకరణ యునైటెడ్ స్టేట్స్, యునైటెడ్ కింగ్‌డమ్, ఆస్ట్రేలియా, కెనడాలపై ఉంది. హిందూ స్వయంసేవక్ సంఘ్, అమెరికా విహెచ్‌పి, సేవా ఇంటర్నేషనల్ వంటి విదేశీ సంస్థలు నిధుల సేకరణ, లాబీయింగ్, సైద్ధాంతిక ప్రసార కేంద్రాలుగా పనిచేస్తాయి. ముఖ్యంగా యునైటెడ్ స్టేట్స్‌లోని దయాస్పోరా(ప్రవాసుల) కుటుంబాలు..ఆర్‌ఎస్‌ఎస్ నాయకత్వంతో లోతైన సంస్థాగత సంబంధాలను కొనసాగిస్తూ భారతదేశంలోని పాఠశాలలు, హాస్టళ్లు, సైద్ధాంతిక సంస్థలకు నిధులు సమకూర్చే కీలకమైన ఆర్థిక కేంద్రాలుగా ఉద్భవించాయి. విదేశీ రాజకీయ సంస్థలను కఠినంగా నియంత్రించే చైనా, రష్యా వంటి దేశాలలో సంఘ్ ఉనికి కనిపించదు.

ఈ వ్యవస్థ హృదయం వద్ద ఉద్దేశపూర్వక అస్పష్టత ఉంది. ఆడిట్ చేయబడిన ఖాతాలు లేదా బహిరంగ సభ్యత్వ జాబితాలు లేకుండా ఆర్‌ఎస్‌ఎస్ రిజిస్టర్ కాని సంస్థగా కొనసాగుతోంది. అధికారిక జవాబుదారీతనం లేకుండా అపారమైన ప్రభావాన్ని చూపడానికి వీలు కల్పిస్తుంది. ఈ నిర్మాణం ఆమోదయోగ్యమైన తిరస్కరణను అనుమతిస్తుంది. హింస లేదా చట్టవిరుద్ధ చర్యల్లో చిక్కుకున్న అనుబంధ సంస్థలను తిరస్కరించడానికి సంస్థ వారి చర్యల నుండి ప్రయోజనం పొందుతూనే అనుమతిస్తుంది. కులతత్వం లేదా మతతత్వ ఆరోపణలను పైకి కనిపించే సంస్థలు ఎదుర్కొంటాయి. రహస్య సంస్థలు మిలిటెన్సీ ఖర్చులను గ్రహిస్తాయి, సేవా సంస్థలు క్షేత్రస్థాయి చట్టబద్ధతను నిర్మిస్తాయి. థింక్ ట్యాంకులు ఉన్నత వర్గాల చర్చను రూపొందిస్తాయి. హిందుత్వ భావజాలం కథనానికి జిగురును అందిస్తుండగా, భావజాలం మాత్రమే ఉద్యమం పొందికను వివరించలేదని 'సీయింగ్ ది సంఘ్' కథనం నిరూపిస్తుంది. సంఘ్‌ను బంధించేది ఆకస్మిక విశ్వాసం కంటే అధికారిక క్రమశిక్షణ. ఆర్‌ఎస్‌ఎస్ స్వంత రచనలు సమాజానికి సంబంధించి దాని దృష్టిని వ్యక్తపరుస్తాయి. అందులో సంఘ్ సమాజంలో ఉనికిలో ఉండేందుకు కాకుండా సంఘే సమాజంగా మారడానికి ప్రయత్నిస్తుంది. హెడ్గేవార్ నుండి గోల్వాల్కర్ వరకు సమకాలీన నాయకుల వరకు, సందేశం స్థిరంగా ఉంటుంది. సంఘ్ సంస్థలు హిందూ రాజ్యలక్ష్యం దిశగా పనిచేసే ఒకే సంస్థకు చెందిన క్రియాత్మక భాగాలు.

ఆర్‌ఎస్‌ఎస్‌ను నెట్‌వర్క్‌లాగా మొత్తంగా అనుభవపూర్వకంగా కనుగొనడం ద్వారా 'సీయింగ్ ది సంఘ్' కథనం సమకాలీన భారతదేశంలో అధికారాన్ని ఎలా అర్థం చేసుకోవాలనే ఆలోచనను ప్రాథమికంగా మారుస్తుంది. ఇది సహజ హిందూ పునరుజ్జీవనం కథనాన్ని కూల్చివేసి, దానిని ఉద్దేశపూర్వక, దీర్ఘకాలిక అధికారిక నిర్మాణం అందించే ఆధారాలతో భర్తీ చేస్తుంది. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలను జరుపుకుంటున్న తరుణంలో ఈ పరిశోధన పారదర్శకత, జవాబుదారీతనం, బహుళత్వం గురించి అత్యవసర ప్రజాస్వామ్య ప్రశ్నలను లేవనెత్తుతుంది. ఒక రిజిస్టర్ కాని సంస్థ రాజకీయాలు, విద్య, సంక్షేమం, దయాస్పోరా(ప్రవాసుల) సమీకరణపై ఇంత విస్తృత ప్రభావాన్ని ఎలా చూపగలదు? వేలాది మంది ప్రతినిధుల ద్వారా అధికారం విస్తరించబడినప్పుడు జవాబుదారీతనం ఎక్కడా లేనప్పుడు ఏ రక్షణలు ఉంటాయి? ప్రజాస్వామ్యం కంటికి కానిరాని దానితో సహజీవనం చేయలేదని, ప్రపంచంలోనే అతిపెద్ద పచ్చి మితవాద వ్యవస్థను, చివరకు అది దేనికోసం పనిచేస్తున్నదో చూడాలని ఈ ప్రాజెక్ట్ నొక్కి చెబుతుంది.

# 'జాగో గ్రహాక్ జాగో'

## వినియోగదారుల చట్టం అమలుకు పాలక ప్రభుత్వాలు పటిష్టమైన చర్యలు చేపట్టాలి

భారతదేశంలో వినియోగదారుల హక్కులను, బాధ్యతల విషయాన్ని అవగాహన కల్పించడం కోసం 1991లో అప్పటి ప్రభుత్వం 'జాగో గ్రహాక్ జాగో' అనే నినాదం ముందుకు తీసుకురావడం జరిగినది. ఆ నినాదం వలన వినియోగదారులను చైతన్యం చేయడంతో పాటు నేటి ఆధునిక సమాజంలో ప్రశ్నించే తత్వం పెరగాలని వారి యొక్క హక్కులను, బాధ్యతలను తెలుసుకోవాలని ఈ కార్యక్రమం ద్వారా అవగాహన కార్యక్రమాలు మొదలుపెట్టారు.

నేడు మార్కెట్ చాలా త్వరగా మారుతున్నది. షాపింగ్ వ్యవస్థలో అనేక మార్పులు వచ్చాయి. ప్రధానంగా ఆన్లైన్ ద్వారా కొనుగోలులు పెరిగినాయి. ఒకరోజు వినియోగదారుడు నేరుగా విక్రయదారుని వద్దకు వెళ్లి వస్తువులను కొనుగోలు చేసేవాడు కానీ నేడు విక్రయదారుడుని చూడకుండానే వినియోగదారుడు కొనుగోలులు చేస్తున్నాడు. మార్కెట్‌లో అనేక సంస్థలు తప్పుడు ప్రకటనల ద్వారా కొనుగోలుదారులను ఆకర్షిస్తున్నారు తద్వారా వినియోగదారుడు అత్యంత సులభంగా మోసాలకు గురవుతున్నాడు.

ఒకనాడు రాజుల కాలంలో కూడా మార్కెట్ మీద ఆ రాజు నియంతృత్వం ఉండేది. ఆ రోజుల్లో వినియోగదారుల హక్కుల విషయంలో ఎలాంటి చట్టాలు లేకపోయినా వారి నియంత్రణ ఉండేది. వినియోగదారుల రక్షణ చట్టం 1986 అమలులోకి రాకముందు మనదేశంలో వినియోగదారుని రక్షణ విషయంలో పెద్దగా ఎవరికీ అవగాహన లేకపోయినా 1960 తరువాత నుండి క్రమ క్రమేణా వినియోగదారుల హక్కుల విషయంలో కొంత చైతన్యం మొదలయ్యింది. అప్పటి ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ గారి ప్రభుత్వం వినియోగదారుల చట్టం 1986 డిసెంబర్ 24వ తేదీన అమలులోకి తీసుకురావడం జరిగింది. ఆరోజును ప్రతి సంవత్సరం జాతీయ వినియోగదారుల దినోత్సవంగా జరుపుకుంటున్నాము.

ఈ చట్టం యొక్క ప్రధాన ఉద్దేశం దేశంలో మార్కెట్ వ్యవస్థ అత్యంత వేగం గా అభివృద్ధి చెందుతున్న సమయంలో వ్యాపారుల యొక్క మోసాలను నియంత్రించాలని, వినియోగదారులకు త్వరితగతిన సులువైన న్యాయం అందించడమే కాకుండా వారి హక్కులను కాపాడటం, జాతీయ స్థాయిలో వినియోగదారుల కమిషన్ ఏర్పాటు చేయడం. ఈ చట్టం వచ్చిన తర్వాత మూడు దశాబ్దాలుగా అనేక కేసులు పరిష్కరించబడ్డాయి. అయితే నేడు వ్యాపార విధానాలయందు అనేక మార్పులు రావడం, విచ్చలవిడిగా ఆన్లైన్ షాపింగ్ లు చేయడం, డిజిటల్ చెల్లింపులు ఈ కామర్స్ వంటి వాటి విషయంలో 1986 చట్టం యందు కొన్ని మార్పులు తీసుకురావాలని వినియోగదారుల చట్టం 2019ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం ఆమోదించి అమల్లోకి తీసుకురావడం జరిగింది. కొత్త వినియోగదారుల చట్టం ద్వారా వినియోగదారుడు ఇంటర్నెట్ ద్వారా కూడా వారి ఫిర్యాదును చేయవచ్చు.

వినియోగదారులను ఆకర్షించడం కోసం తప్పుడు ప్రకటనలను 1986 చట్టం పరిమితమైన నియంత్రణ ఉన్నప్పటికీ 2019 చట్టం ద్వారా మాత్రం ఖచ్చితమైన నియంత్రణ విషయమై స్పష్టత ఉన్నది. అంతేకాకుండా మధ్యవర్తిత్వం ద్వారా సమస్య పరిష్కరించుకునే అవకా శం కొత్త చట్టంలో పొందుపరిచి వేగవంతంగా పరిష్కరించడానికి అవకాశం కల్పించారు. అలాగే వస్తువుకు గాని సేవలకు గాని చెల్లించిన మొత్తం వినియోగదారుడు తిరిగి పొందే హక్కు 2019 చట్టం కల్పించడమే కాకుండా కొన్ని సందర్భాల యందు వస్తువులను ప్రత్యామ్నాయంగా పొందే హక్కు కూడా కల్పించడం జరిగింది. చట్టం ఎంత మంచిదైనప్పటికీ అమలు చేసే విధానం ద్వారా పాలకవర్గాలు,వ్యాపార వర్గాలు చట్టంలోని వెసులుబాటును ఆసరా చేసుకొని దుర్వినియోగపరచడము జరుగుతున్నది. అందుకని చట్టంలో పొందుపరిచిన హక్కులను తెలియపరచడము, లోపాలను ఎత్తి చూపినప్పుడు ఉన్నత న్యాయ వ్యవస్థ అవసరమని గుర్తించాలి. వినియోగదారుల వినియోగము రోజురోజుకు విస్తృతమగుచున్నది. వినియోగదారులను చైతన్య పరచడంకోసం విద్యార్థులకు హైస్కూల్ నుండే పాఠ్యాంశముగా పెట్టి భావితరాలకు వినియోగదారుల చట్టంపై అవగాహన కల్పించవలసిన అవసరం ఉన్నది. బుద్ధి జీవులు, స్వచ్ఛంద సంస్థల చొరవతో పాటు ప్రభుత్వ యంత్రాంగము కూడా విధిగా బాధ్యతగా ప్రజలలో అవగాహన కలిగించడం ద్వారా 'జాగో గ్రహాక్ జాగో' అనే నినాదానికి బలం చేకూర్చాలి.

**చాడ వెంకటరెడ్డి**
మాజీ ఎమ్మెల్యే
సిపిఐ సీనియర్ నాయకులు

# క్రిస్మస్ ఈవ్ – జీసస్ జన్మించిన పవిత్ర రాత్రి !

క్రిస్మస్ పర్వదినం 25 డిసెంబర్ ముందు రోజు శుభ సాయంకాల గడియల్లో నిర్వహించుకునే ఆనందాల వెలుగుల పండుగను క్రిస్మస్ ఈవ్‌గా పెద్ద ఎత్తున జరుపుకుంటారు. 24 డిసెంబర్ రాత్రి జీసస్ క్రీస్తు పుట్టిన సందర్భంగా పశ్చిమ దేశాలు క్రిస్మస్ ఈవ్ వేడుకల్లో కుటుంబాలు, మిత్రులు సంతోష హరివిల్లుల మధ్య జరుపుకోవడం ఆనవాయితీగా మారింది. క్రిస్మస్ ఈవ్ మధ్య రాత్రి జీసస్ జన్మించడంతో పవిత్ర రాత్రి (హోలీ నైట్), శుభ రాత్రి (గుడ్ నైట్) లేదా నిశ్శబ్ద రాత్రి (సైలెంట్ నైట్), పవిత్ర రాత్రి (హోలీ నైట్)గా ప్రార్థనలు, గీతాలాపనలు, శుభాకాంక్షలు తెలుపుకోవడం లాంటి ఉత్సవాలను నిర్వహిస్తారు.




**జీసస్ జనన శుభ గడియలు:**

శీతాకాల గాలుల నడుమ భక్తి ప్రపత్తులతో క్రిస్టియన్లు క్రిస్మస్ ఈవ్ వేడుకలను హృదయపూర్వకంగా జరుపుకోవడం, వీధులను విద్యుత్తు కాంతులతో అమర్చడం, సాంప్రదాయబద్ధంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేయడం ఆనవాయితీగా వస్తున్నది. మేరీ కన్యకు బెత్లహేమ్‌లో క్రిస్మస్ ఈవ్ ఘడియల్లో జీసస్ జన్మించడం, సాంప్రదాయ కార్యక్రమాన నిర్వహణ, 25 డిసెంబర్ రోజున పెద్ద ఎత్తున జరుపుకునే క్రిస్టమస్ వేడుకలకు భారీ ఏర్పాట్లు చేసుకోవడం జరుగుతుంది. ఆధునిక యుగంలో క్రిస్మస్ ఈవ్ వేడుకలను 24 డిసెంబర్ రాత్రి పలు రుచులతో భోజనాలు, గృహ అలంకరణ లు, కానుకలను సిద్ధం చేసుకోవడం, క్రిస్మస్ ఆధారిత సినిమాలు చూడడం లాంటివి భక్తితోనిర్వహించుకోవడం కనిపిస్తుంది.

తమ ఆరాధ్య దైవమైన జీసస్ పుట్టిన రాత్రి వేళ, అనగా క్రిస్మస్ ఈవ్ దేశంలో క్రిస్టియన్లు భక్తి ప్రపత్తులతో క్రిస్మస్ ఈవ్ వేడుకలను మధ్య రాత్రి వరకు ఘనంగా నిర్వహించడం, కాలానుగుణంగా పర్వదిన వేడుకల సంప్రదాయాలు మారుతూ ఉండడం గమనిస్తున్నాం. క్రిస్మస్ ఈవ్ శుభ ఘడియల్లో క్రిస్టియన్ సోదరసోదరీమణులకు పర్వదిన శుభాకాంక్షలు తెలియజేద్దాం, సర్వమత సారం ఒక్కటే అని రుజువు చేద్దాం.

(24 డిసెంబర్ క్రిస్మస్ ఈవ్ శుభ సందర్భంగా)

**ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

# ఎం.జి.నరేగా నుంచి మహాత్ముని పేరు తొలగించడం క్రూరమైన నేరం

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (MG NREGA) నుండి మహాత్మా గాంధీ పేరు తొలగించాలనే ప్రయత్నం, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి ఉన్న ప్రజావిరోధి, క్రూరమైన ఉద్దేశాల ను స్పష్టంగా బయటపెడుతోంది.

ఎం.జి. నరేగా ద్వారా ఇప్పటివరకు 15.5 కోట్ల మంది క్రియాశీల గ్రామీణ కార్మికులకు ఉపాధి లభించింది. వీరి లో దాదాపు 50 శాతం మహిళలు. లబ్ధిదారుల్లో అధిక శాతం షెడ్యూల్డ్ కులా లు, షెడ్యూల్డ్ తెగలు, పీడిత వర్గాలకు చెందినవారే. గ్రామ స్వరాజ్యం – ప్రతి గ్రామం స్వయం సమృద్ధిగా ఉండాలన్నది గాంధీజీ కల. ఆ కలను వాస్తవ రూపంలోకి తీసుకువచ్చిన చట్టమే ఎం.జి.నరేగా. కానీ 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం, ఈ చట్టాన్ని బలహీనపరచడం, క్రమంగా నిర్వీర్యం చేయడం అనే దిశలోనే పని చేస్తోంది. పేదలకోసం అన్నట్లు మాట్లాడే మోదీ ప్రభుత్వం వాస్తవంగా వందమంది కార్పొరేట్ కుటుంబాల అభివృద్ధికే కట్టుబడి ఉంది. నరేగాపై కొనసాగుతున్న దుష్ప్రచారం మొత్తం గోబెల్స్ తరహా అసత్య ప్రచారమే. మహాత్మాగాంధీ పేరు తొలగించడం యాదృచ్ఛిక చర్య కాదు. ఇది గాంధీ హంతకుడు గాడ్సేను ఆరాధించే కాషాయ శక్తులను సంతృప్తి పరచడానికే తీసుకున్న రాజకీయ నిర్ణయం. నరేగా స్థానం లో మరో కొత్త చట్టం తీసుకురావటం కూడా ఇదే ఎజెండాలో భా గం.

కొత్త చట్టంలో: సంవత్సరానికి 100 రోజులు–125 రోజులు ఉపాధి కల్పిస్తామని చెప్పారు – ఇది కేవలం మోసం. ఖర్చులో 60 శాతం రాష్ట్ర ప్రభుత్వాలే భరించాలి అని చేర్చారు. దీనివల్ల: ఆర్థికంగా బలహీనమైన రాష్ట్రాలు ఈ భారాన్ని మోయలేవు, చివరకు ఉపాధి హామీ పథకం ప్రయోజన రహితంగా కూలిపోతుంది. ఇంకా, గ్రామపంచాయతీలకు పనుల ఎంపికలో అధికారం లేదు, కేంద్ర ప్రభుత్వమే ఏ పనిచేయాలో ఆదేశిస్తుంది, పెరుగుతున్న ధరల మధ్య వేతన పెంపుపై ఒక్క మాట లేదు



ఇది 15.5 కోట్ల గ్రామీణ పేదల పట్ల ఎన్డీఏ ప్రభుత్వానికి ఉన్న అమానుష వైఖరిని స్పష్టంగా చూపిస్తుంది. కార్పొరేట్లకు లక్షల కోట్లు – పేదలకు మాత్రం విమర్శలు. ఇప్పటివరకు నరేగా పథకానికి ప్రభుత్వం ఖర్చు చేసిన మొత్తం సుమారు ₹10 లక్షల కోట్లు. దీని ఫలితంగా: గ్రామీణ ప్రాంతాల్లో ఆకలి మరణాలు, ఉపాధి లేని వారి ఆత్మహత్యలు గణనీయంగా తగ్గాయి. కానీ అదే సమయంలో: 2021–22 వరకు కార్పొరేట్లకు ₹8 లక్షల కోట్లు పన్ను రాయితీలు, 2022– 2024 మధ్య మరో ₹3 లక్షల కోట్లు, మొత్తం పన్ను రాయితీలు: ₹11 లక్షల కోట్లు, కార్పొరేట్ రుణ మాఫీలు: ₹16.5 లక్షల కోట్లు

అంటే మొత్తం మీద:

* 100 మంది కార్పొరేట్ మిత్రులకు ₹28 లక్షల కోట్లు
* 15.5 కోట్ల పేదలకు కేవలం ₹10 లక్షల కోట్లు

ఇదే బిజెపి ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల – పేదల వ్యతిరేక విధానం.

**వ్యవసాయ సంక్షోభం – గ్రామీణ విపత్తు**

స్వాతంత్ర్యం వచ్చి 8 దశాబ్దాలు గడిచినా, పేదరికం, ఆకలి, నిరుద్యోగం ఇవన్నీ దేశాన్ని వెంటాడుతూనే ఉన్నాయి.

మోదీ ప్రభుత్వం ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ అంటూ గొప్పలు చెప్పుకుంటోంది. కానీ వాస్తవం ఏమిటంటే: గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు పెరుగుతున్నాయి, వ్యవసాయం నష్టాల వృత్తిగా మారింది, కనీస మద్దతు ధర లేదు, రైతులు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

ఉదాహరణలు: కర్నూలు జిల్లాలో టమాటా రైతులు రోడ్లపై పంట పారేస్తున్నారు, వరంగల్ జిల్లాలో పత్తి రైతులు నష్టాల్లో ఉన్నారు, తెలంగాణ, రాయలసీమ, ఉత్తరాంధ్రలో కరువు ఛాయలు, తీరాంధ్రలో వరదలు, భారీ వర్షాలతో నానిపోయిన ధాన్యం.

**నరేగా – చారిత్రక నేపథ్యం**

యుపిఎ–1 ప్రభుత్వ కాలంలో, వామపక్ష పార్టీలే గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రతిపాదించాయి. గ్రామీణ నిరుద్యోగుల ఆత్మహత్యలకు చెక్ పెట్టే విప్లవాత్మక ఆలోచన ఇది. అప్పటి ఆర్థిక మంత్రి పి. చిదంబరం తీవ్రంగా వ్యతిరేకించినా, వామపక్షాల ఒత్తిడితో 2006లో చట్టంగా మారింది.

గాంధీజీ కలకు ప్రతీకగా దీనికి మహాత్మా గాంధీ పేరు జమచేశారు. నరేగా డబ్బు వృథా అన్న ప్రచారం పూర్తిగా అసత్యం. ఇది పని చేయడానికి హక్కు కల్పించిన చట్టం. సోవియట్ యూనియన్‌లో లెనిన్ ప్రవేశపెట్టిన సబోత్నిక్స్ ద్వారా ప్రతి పౌరుడిలో శ్రమ విలువను పెంచారు. ఆ స్ఫూర్తితోనే నేను కూడా నా స్వగ్రామం ఐనంబాకంలో నరేగా పనుల్లో 8 గంటలు పని చేశాను, కార్మికులతో కలిసి అక్కడే భోజనం చేశాను.

**లోపాలు ఉన్నా – చట్టాన్ని రక్షించాలి**

అవును, అమలులో లోపాలు ఉన్నాయి: కొంతమంది భూస్వాములు, రాజకీయ నాయకులు అవినీతికి పాల్పడుతున్నారు. అలాంటి వారిని అరెస్ట్ చేసి, ఆస్తులు స్వాధీనం చేసుకోవాలి. కానీ అవినీతి పేరుతో చట్టాన్ని చంపడం నేరం. నరేగా: 15 రోజుల్లో వేతనం, సమాన పనికి సమాన వేతనం, వలసలు, ఆత్మహత్యలకు అడ్డుకట్ట

**ముగింపు:** కార్పొరేట్లకు ₹28 లక్షల కోట్లు ఇచ్చిన ప్రభుత్వం 15.5కోట్ల పేదల జీవనాధారమైన నరేగాను ఎందుకు రక్షించలేకపోయింది?

మహాత్మా గాంధీ పేరు తొలగించడం పరిపాలనా సంస్కరణ కాదు – అది భావజాల విధ్వంసం.

**డా. కె. నారాయణ,** చైర్మన్,
సెంట్రల్ కంట్రోల్ కమిషన్, సిపిఐ,
అజయ్ భవన్, న్యూఢిల్లీ, 9490952222



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఆరుగురు ఐపిఎస్‌లకు డిఐజిగా పదోన్నతి

**ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో పాలన పరమైన వ్యవహారాలకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మొత్తం ఆరుగురు ఐపిఎస్‌లను డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ స్థాయికి ఎంపానెల్ చేస్తూ ప్రమోట్ చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతులు పొందిన వారిలో 2012 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన ఎన్.శ్వేత, ఆర్.భాస్కరన్, జి.చందన దీప్తి, కల్మేశ్వర్ శింగెనవర్, ఎస్.ఎం. విజయ్ కుమార్, రోహిణి ప్రియదర్శిని ఉన్నారు. ఎన్.శ్వేత ప్రస్తుతం సిటీలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్, ఆర్. భాస్కరన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్(సివిల్ ఇంటెలిజెన్స్)గా కొనసాగుతున్నారు. ఇక జి.చందన దీప్తి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్(రైల్వేస్, సికింద్రాబాద్), విజయ్ కుమార్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సిద్దిపేట జిల్లాలో విధులు నిర్వహిస్తున్నారు. అయితే, పదోన్నతులు పొందిన వారంతా సివిల్ ఆదేశాల మేరకు 2026 జనవరి 1 నుంచి ఛార్జ్ చేపట్టనున్నారు.

# నాణ్యమైన విద్య, వైద్యం అందించేలా కృషి

తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ



**ప్రజాపక్షం/వనపర్తి :** పేదవాళ్లందరికి నాణ్యమైన విద్య, వైద్యం అందించాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. మంగళవారం నాడు వనపర్తి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా అధికారులు, వివిధ రంగాల ప్రముఖులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కలెక్టరేట్ ఆవరణలో పోలీసు గౌరవ వందనం స్వీకరించిన గవర్నర్, ఆ వెంటనే వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో అక్కడే ఏర్పాటు చేసిన స్టాల్స్, విద్యార్థుల యొక్క సాంస్కృతిక నృత్య ప్రదర్శనలను తిలకించారు. నాగర్‌కర్నూల్ పార్లమెంటు సభ్యులు మల్లురవి, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, గవర్నర్ స్పెషల్ సెక్రెటరీ భవానీ శంకర్, పిడి సునీతలు కార్యక్రమంలో పాల్గొన్నారు. సమావేశంలో గవర్నర్ మాట్లాడుతూ సమాజంలో అట్టడుగు వర్గాల వారికి నాణ్యమైన విద్య, వైద్యం అందేలా కృషి చేయాలని సూచించారు. బలమైన సమాజాన్ని నిర్మించినప్పుడే బలమైన దేశం తయారవుతుందని పేర్కొన్నారు. సమాజ అభివృద్ధిలో కవులు, కళాకారులు, రచయితలు, వివిధ రంగాల ప్రముఖుల ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అప్పుడే సమాజం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. క్షయరహిత సమాజాన్ని నిర్మించాలన్నా, బాల్య వివాహాలను నిర్మూలించాలన్నా కవులు, కళాకారులు, రచయితలు గళం ఎంతో కీలకమన్నారు. వీరంతా సమాజంలో భాగస్వాములై తమ గళాన్ని వినిపించాలని ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ జిల్లా ప్రొఫైల్‌తో పాటు , జిల్లాలో అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గవర్నర్ కు వివరించారు. జిల్లాలో విద్య, వైద్యం, మహిళా సంక్షేమం కోసం అమలు చేస్తున్న అనేక కార్యక్రమాల గురించి గవర్నర్‌కు వివరించారు. క్షయ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధ్వర్యంలో చేపట్టిన చర్యలను వివరించారు. అదే విధంగా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన మిషన్ మధుమేహ, దృష్టి కార్యక్రమాలను వాటి లక్ష్యాలను వివరించారు. వనపర్తి జిల్లాకు విచ్చేసిన సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు జిల్లా కలెక్టర్ శ్రీరంగాపూర్ చిత్రపటం, మెమెంటో సత్కరించారు. జిల్లాకు చెందిన విద్య, వైద్యం, క్రీడలు, రచనలు, సామాజిక సేవ వివిధ రంగాలలో 12 మంది ప్రముఖులు తమ తమ రంగాల్లో నిర్వహించిన సేవలను సమావేశంలో వివరించారు. జిల్లా చెందిన వివిధ రంగాల ప్రముఖులు ఏ.దినకర్ బాబు విశ్రాంత ఐఎఎస్, పద్య కవి సందాపురం బిచ్చయ్య, కూచిపూడి నృత్యకారిణి వంగిపురం నీరజ దేవి, విశ్వ మానవతా సంస్థ శ్రీనివాస్ అల్లూరి, ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులు పెరుమల్ల గాయత్రి, శిల్పి బైరోజు చంద్రశేఖర్, సెపక్‌తక్రా అంతర్జాతీయ క్రీడాకారిణి రాఖీ నవత, బాక్సింగ్ క్రీడాకారుడు సున్నపటి వెంకటేష్, పోచ రవీందర్ రెడ్డి, చిత్రకారుడు, గడ్డం శివకుమార్, జానపద కళాకారుడు, రాజారాం, ప్రకాష్, తమ పరిచయాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీచైతన్య కాలేజీలో ఘనంగా డా.బిఎస్.రావు స్మారక జోనల్ క్రీడా పోటీలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** డా.బి.ఎస్.రావు స్మారక జో నల్ క్రీడా పోటీలు 2025 కూకట్‌పల్లి జోన్ హైదర్‌నగర్‌లోని శ్రీచైతన్య జూనియర్ కాలేజీలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన క్యారమ్ క్రీడాకారిణి డా.షేక్ హుస్నా సమీరా ఈ పోటీలను ప్రారంభించగా, 14 బ్రాంచీల నుండి విద్యార్థిని, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రారంభమైన ఈ వే డుకలో జాతీయ జెండా, క్రీడా జెండాల ఆవిష్కరణ, క్రీడా జ్యోతి ప్రదర్శన, క్రీడా ప్రమాణ స్వీకారంతో పాటు మార్చ్ పాస్ట్ నిర్వహించారు. అనంతరం పరుగు పందాలు, ఖోఖో, వాలీబాల్, త్రో బాల్, షాట్ ఫుట్ వంటి వివిధ క్రీడా పోటీలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణతో పాటు సర్వతోముఖాభివృద్ధిని ప్రోత్సహిస్తూ విజయవంతంగా ముగిసిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎజి ఎం శివరామకృష్ణ, రీజనల్ ఇచ్‌చార్జ్‌లు, జోనల్ ఇచ్‌చార్జ్, ఆల్ ఇండియా స్పోర్ట్స్ రిసోర్స్ పర్సన్, ప్రిన్సిపాల్ తదితరులు హాజరయ్యారు.

# హద్దు మీరితే ‘హ్యాపీ’ న్యూ ఇయర్ ఉండదు

- వేడుకల పేరిట నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- నేటి నుంచే ప్రారంభం కానున్న డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు
- పట్టుబడితే రూ. 10 వేల జరిమానా.. డ్రైవింగ్ లైసెన్స్ రద్దు
- నగర వాసులకు హైదరాబాద్ సిపి సజ్జనార్ హెచ్చరిక



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నూతన సంవత్సర వేడుకల పేరుతో రోడ్లపై హంగామా సృష్టిస్తూ, హద్దు మీరితే కఠిన చర్యలు తప్పవని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్ హెచ్చరించారు. తాగి వాహనాలు నడిపే వారిపై బుధవారం నుంచి న్యూ ఇయర్ రోజు వరకు నగరవ్యాప్తంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్స్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(టిజిఐసిసి)లో మంగళవారం క్రిస్మస్, న్యూ ఇయర్ వేడుకల బందోబస్తుపై నగర సిపి విసి. సజ్జనార్ క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, భద్రతా ఏర్పాట్లపై కీలక సూచనలు చేశారు. క్రిస్మస్, వైకుంఠ ఏకాదశి, నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో నగరంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. హాట్ స్పాట్లు, గతంలో నేరాలు జరిగిన ప్రాంతాల్లో సిబ్బందిని మోహరించాలని, పాత నేరస్తుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని సూచించారు. డిసెంబరు 31 రాత్రి నగరవ్యాప్తంగా 100 ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడతామని సిపి తెలిపారు. ఇందుకోసం 7 ప్లాటూన్ల అదనపు బలగాలను రంగంలోకి దించుతున్నామన్నారు. కొత్త సంవత్సరం జోష్‌లో మోతాదు మించి తాగి వాహనాలు నడిపితే ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడితే వాహన సీజ్‌తో పాటు రూ.10 వేల జరిమానా, ఆరు నెలల జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. డ్రైవింగ్ లైసెన్స్‌ను శాశ్వతంగా రద్దు చేసే అవకాశం కూడా ఉందన్నారు. పార్టీలకు వెళ్లేవారు ముందుగానే ‘డెసిగ్నేటెడ్ డ్రైవర్’ను ఏర్పాటు చేసుకోవాలని, క్యాబ్‌లను ఆశ్రయించాలని సూచించారు. యువత రోడ్లపై రేసింగ్‌లు, వీలింగ్‌లు, ర్యాష్ డ్రైవింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. 2026 స్వాగత వేడుకలు ప్రజల జీవితాల్లో తీపి జ్ఞాపకాలుగా మిగలాలే తప్ప, చేదు అనుభవాలుగా మారకూడదని సిపి హితవు పలికారు. డిసెంబరు 31 రాత్రి పబ్‌లు, త్రీస్టార్, ఆపై స్థాయి హోటళ్లలో జరిగే వేడుకలకు అర్ధరాత్రి 1 గంట వరకే అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. శబ్ద కాలుష్య నిబంధనలు కచ్చితంగా పాటించాలని, డెసిబెల్స్ పరిమితి దాటితే సౌండ్ సిస్టమ్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈవెంట్లలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం జరిగినా, అశ్లీల నృత్యాలకు తావిచ్చినా యాజమాన్యాలదే పూర్తి బాధ్యత అని, అలాంటి వారి లైసెన్సులు రద్దు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. వేడుకల్లో మహిళల భద్రత కోసం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు సిపి వివరించారు. రద్దీగా ఉండే ప్రాంతాలు, పార్టీ వెన్యూలు, జంక్షన్లలో మఫ్టీలో 15 షీ టీమ్స్ నిఘా ఉంచుతామని, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే తక్షణమే అరెస్టు చేస్తామని వెల్లడించారు. ప్రజలు చట్టాన్ని గౌరవిస్తూ, సురక్షితంగా 2026కు స్వాగతం పలకాలని కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు సిపి ఎం. శ్రీనివాసులు, వివిధ విభాగాల డిసిపిలు ఎన్.శ్వేత, రక్షితాకృష్ణ మూర్తి, శ్రీ రూపేష్, ఆర్. వెంకటేశ్వర్లు, వి.అరవింద్ బాబు, లావణ్య నాయక్ జాదవ్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ శాఖలో డిపిసి ద్వారా 53 మందికి పదోన్నతులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిపిసి ద్వారా 53 మంది అధికారులకు పదోన్నతులు వచ్చాయని అధికారులు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. సోమవారం జరిగిన డిపిసి (డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ) నిర్వహించిన సమావేశంలో ఛైర్మన్ వికాష్‌రాజ్, జెడి కన్వీనర్ సెక్రటరీ బెనహార్ మహేష్ దత్ ఎక్క ,మెంబర్లు ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావు, ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్, ఇండస్ట్రీయల్ సెక్రటరీ సంజయ్ కుమార్ చర్చించి 53 మంది ఎక్సైజ్ అధికారుల పదోన్నతులకు సిపారసు చేయగా, అడిషనల్ కమిషనర్లుగా ఇద్దరికి, జాయింట్ కమిషనర్లుగా ఇద్దరికి, డిప్యూటి కమిషనర్లుగా 12 మందికి, అసిస్టెంట్ కమిషనర్లుగా 14 మందికి, ఎక్సైజ్ సూపరింటెండ్లుగా 23 మందికి డిపిసి ద్వారా పదోన్నతులు వచ్చాయని తెలిపారు. ఈ పదోన్నతులపై ప్రభుత్వం ఒకటి రెండు రోజుల్లో జీవో జారీ చేయనుందని తెలియవచ్చింది. పదోన్నతులు వచ్చిన అధికారులందరు మంగళవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి డిపిసిని పూర్తి చేయించి, పదోన్నతులు కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కమిషనర్‌ను కలిసిన వారిలో అడిషనర్ కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషి, జాయింట్ కమిషనర్ సురేష్ రాథోడ్, డిప్యూటి కమిషనర్లు పి.దశరథ్, అనిల్ కుమార్ రెడ్డి, ఎసిలు చంద్రయ్య, శ్రీధర్, ముగ్గురు శ్రీనివాసులు, ఇసిలు ప్రదీప్‌రావు, కృష్ణ ప్రియ, ఉజ్వలరెడ్డి, జీవన్ కిరణ్‌లు ఉన్నారు.

## నెక్ట్స్ బిగ్‌బాస్ షోకు వెళ్లనున్న కెటిఆర్, హరీష్‌రావు

రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రతి విషయంలో తలదూర్చే వారికి బిగ్‌బాస్ షో లో ప్రాధాన్యత ఉంటుందని, నెక్ట్స్ బిగ్‌బాస్ షోకు కెటిఆర్, హరీష్‌రావు వెళ్తున్నారని రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఎద్దేవా చేశారు. గాంధీభవన్‌లో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ‘హరీష్ రావు ప్రస్తుతం మీ పార్టీ నేతలే నీకు కూర్చోడానికి సీటు ఇస్తలేరు. బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే అన్న పోస్ట్ తప్ప ప్రస్తుతం నీకు మరే పదవి లేదు’ అని విమర్శించారు. రేవంత్ రెడ్డి మిమ్మల్ని ఫుట్‌బాల్ ఆడుకొని గ్రౌండ్ అవతల పడేసాడని, ఆయన గురించి మాట్లాడే స్థాయి హరీష్‌రావుకు లేదని దుయ్యబట్టారు. కాళేశ్వరం పాపంలో కెసిఆర్‌తో పాటు హరీష్ రావుది కూడా పాత్ర ఉందని ఆరోపించారు. గ్లోబల్ సమ్మిట్ సక్సెస్‌తో బిఆర్‌ఎస్ నేతల మైండ్ బ్లాంక్ అయిందని, సర్పంచ్ ఎన్నికలతో బిఆర్‌ఎస్ పని ఖతం అయిందని పేర్కొన్నారు. బిజెపి, బిఆర్‌ఎస్ కలిస్తే సర్పంచ్ ఎన్నికల్లో అంతంత మాత్రం సీట్లు వచ్చాయి, దీంతో బిఆర్‌ఎస్ కన్ఫ్యూజన్‌లో ఉందన్నారు. సిఎం పేరు తీయనిదే కెటిఆర్, హరీష్‌రావుకు నిద్ర పట్టడం లేదని, బిఆర్‌ఎస్ నేతలకు ఇక 14 సంవత్సరాలు వనవసామేనని చమత్కరించారు.

## న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా.. రాత్రి 12 గంటల వరకు మద్యం అమ్మకాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా మద్యం అమ్మకాలపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్ మంగళవారం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. డిసెంబరు 31న బార్లు, క్లబ్‌లు, ఈవెంట్ పర్మిషన్ తీసుకున్న వారికి, టూరిజం ప్రాంతాల్లో రాత్రి 1 గంటల వరకు మద్యం సేవించడానికి అనుమతి ఇచ్చారు. అలాగే ఏ4 షాపులు (మద్యం షాపులకు) రాత్రి 12 గంటల వరకు మద్యం అమ్మకాలు జరుపు కోవచ్చునని కమిషనర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## గుంతకల్లు- మార్కాపూర్ నూతన ప్యాసింజర్ రైలుకు ఆమోదం

**ప్రజాపక్షం/ హైదరాబాద్:** గుంతకల్లు మార్కాపూర్ రోడ్ మధ్య (నంద్యాల మీదుగా) నూతన డైలీ ప్యాసింజర్ రైలు సేవలను ప్రవేశపెట్టేందుకు రైల్వే మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. దక్షిణ మధ్య రైల్వే ప్రతిపాదన మేరకు ఈ నిర్ణయం తీసుకోగా, రైలు సేవలు త్వరలో ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. రైలు నంబర్లు 57407/57408గా నిర్ణయించిన ఈ ప్యాసింజర్ రైలు గుంతకల్లు మార్కాపూర్ రోడ్, గుంతకల్లు మార్గంలో రోజువారీగా నడవనుంది. రైలు నం.57407 గుంతకల్లు నుంచి సాయంత్రం 5.30 గంటలకు బయలుదేరి నంద్యాల వద్ద రాత్రి 8.30కి చేరుకుని, 8.35కి బయలుదేరి మార్కాపూర్ రోడ్డుకు రాత్రి 11.30 గంటలకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో రైలు నం.57408 మార్కాపూర్ రోడ్ నుంచి ఉదయం 4.30 గంటలకు బయలుదేరి నంద్యాల వద్ద ఉదయం 7.20కి చేరుకుని 7.25కి బయలుదేరి గుంతకల్లుకు ఉదయం 10.30 గంటలకు చేరుకుంటుంది. ఈ రైళ్లు మద్దికెర, పెండేకల్లు, ధోన్, రంగాపురం, బేతంచెర్ల, పాణ్యం, నంద్యాల, గాజులపల్లి, దిగువమెట్ట, గిద్దలూరు, సోమిదేవిపల్లె, జగ్గంభొట్ల కృష్ణాపురం, కంబం, తర్లుపాడు తదితర స్టేషన్లలో ఇరు దిశల్లో ఆగుతాయి. నూతన ప్యాసింజర్ రైలు సేవ ప్రారంభంతో గుంతకల్లు మార్కాపూర్ రోడ్ మధ్య ప్రయాణించే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యం లభించనుంది. అలాగే మార్గ మధ్యంలోని నంద్యాల, గిద్దలూరు, కంబం తదితర ప్రాంతాల ప్రజలకు ఈ రైలు ఎంతో ప్రయోజనకరంగా ఉండనుంది. తక్కువ ఛార్జీలతో విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యోగులు సహా సాధారణ ప్రయాణికులకు ఈ సేవ ఉపయోగకరంగా మారనుందని రైల్వే అధికారులు తెలిపారు.

# ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలి

బిసి జెఎసి చైర్మన్, బిసి సంక్షేమ సంఘం జాతీ య అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆర్‌టిసిని తక్షణమే ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు ఉద్యోగులకు ఇచ్చిన హామీని ప్రభుత్వం నెరవేర్చాలని బిసి జెఎసి చైర్మన్, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాదులో ఆర్‌టిసి బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర సర్వసభ్య సమావేశం జరిగింది. ఆర్‌టిసి బిసి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఈ నిరంజన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జాజుల శ్రీనివాస్ గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు పవన్ కుమార్ గౌడ్‌లు హాజరయ్యారు ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఆర్‌టిసి పనిచేస్తున్న బిసి ఉద్యోగ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, అవుట్ సోర్సింగ్ విధానం రద్దుచేసి ఖాళీగా ఉన్న డ్రైవర్, కండక్టర్ పోస్టులను శాశ్వత ప్రతిపదికగా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఆర్‌టిసి కార్మికుల శ్రమ ఫలితంగానే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం విజయవంతంగా నిర్వహించడంలో ఉద్యోగులు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ఆర్‌టిసి సంస్థను లాభాల్లోకి తీసుకు వస్తున్న కార్మికులకు సింగరేణి కార్మికుల తరహాలో సంస్థ లాభాల్లో 30 శాతం వాటా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. పవన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఆర్‌టిసి బిసి ఉద్యోగులు ఐక్యంగా ఉండాలని, హక్కుల కోసం సంఘటితంగా పోరాడాలని ఆయనే పిలుపునిచ్చారు. ఈ.నిరంజన్ మాట్లాడుతూ ఆర్‌టిసి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి మూడు నెలల గడువు ఇస్తున్నామని,ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నంప్రభాకర్‌తో పాటు , ఎండి జోక్యం చేసుకొని మానవతా దృక్పథంతోకార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని కోరాఉ. లేకపోతే మార్చి 10వ తేదీన బస్సు భవనం వేలాదిమంది కార్మికులతో ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి బిసి ఉద్యోగుల సంఘం సికింద్రాబాద్ జోన్ అధ్యక్షుడు బాలరాజు యాదవ్, రాష్ట్ర అధ్యక్షులు తిరుపతయ్య, రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షులు వెంకటేష్ గౌడ్, కార్యదర్శి బండి స్వామి, రేణుక, మంగమ్మ, రమేష్, దుర్గయ్య, పవన్ కుమార్ యాదవ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 10న ‘చలో బస్ భవన్’ ప్రభుత్వంలో విలీనం చేయాల్సిందే

జోనల్ గౌరవ అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్ ఆర్‌టిసి ) ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలనే డిమాండ్‌తో మార్చి 10వ తేదీన ‘ఛలో బస్ భవన్’ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆర్‌టిసి బిసి ఉద్యోగుల సంఘం హైదరాబాద్ జోనల్ గౌరవ అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్ ప్రకటించారు. సికింద్రాబాద్‌లో మంగళవారం నిర్వహించిన ఆర్‌టిసి బిసి ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం కీలక పాత్ర పోషించిన ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని హామీ ఇచ్చి సంవత్సరాలు గడుస్తున్నా, ప్రభుత్వం ఆ హామీని నెరవేర్చడంలో విఫలమైందని ఆయన విమర్శించారు. ఈ నిర్లక్ష్యానికి నిరసనగా మార్చి 10న బస్ భవన్ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిస్తున్నట్లు ఉద్యోగుల నినాదాల మధ్య ప్రకటించారు. ఆర్‌టిసి ఉద్యోగులు అనేక సమస్యల తో ఇబ్బందులు పడుతున్నారని, ప్రధాన డిమాండ్ ప్రభుత్వంలో విలీనమేనని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి నిరంజన్, కార్యవర్గ అధ్యక్షులు రేణుక, రమేష్, కోశాధికారి మంగమ్మ, సికింద్రాబాద్ రీజినల్ అధ్యక్షుడు బాలరాజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అటల్ జీ స్మృతి సమ్మేళనం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారత సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సహకారంతో త్రినేత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా హైదరాబాద్ నారాయణగూడలో ‘అటల్ జీ స్మృతి సమ్మేళనం’ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాజ్యసభ సభ్యుడు, ఓబిసి మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మ ణ్, ఎమ్మెల్సీలు తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రగడ్డ ఆయుర్వేద ఆసుపత్రిలో నిధుల గోల్‌మాల్‌పై

నిగ్గు తేల్చిన విజిలెన్స్ – త్వరలో ఉన్నతాధికారులకు నివేదిక

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎర్రగడ్డలోని ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో నిధుల గోల్‌మాల్ వ్యవహారంలోవిజిలెన్స్ అధికారులు విచారణను పూర్తి చేశారు. ఆసుపత్రిలో రోగుల ఆహార ఖర్చుల పేరుతో కొంతమంది అక్రమార్కులు అందినకాడికి దోచుకున్నట్లు విచారణలో గుర్తించారు. దీంతో ఇందుకు సంబంధించిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సిఫారసు చేస్తూ నివేదికను సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు త్వరలో అందజేయనున్నట్లు సమాచారం. ఆసుపత్రిలో నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు అందడంతో ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుని విజిలెన్స్ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఆసుపత్రి తాత్కాలిక సూపరింటెండెంట్ నిర్వహించిన ఆడిట్‌లో ఆహార ఖర్చుల బిల్లుల్లో భారీ అక్రమాలు చోటు చేసుకున్నట్లు బట్టబయలైంది. ఆసుపత్రిలో మొత్తం 204 పడకలు ఉన్నప్పటికీ, రోజుకు సగటున 40 నుంచి 50 మంది మాత్రమే అంతర్గత రోగులుగా ఉంటున్నట్లు విచారణలో తేలింది. అయితే లెక్కల్లో మాత్రం రోజుకు 150 నుంచి 200 మందికి ఆహారం అందించినట్లు బిల్లులు సమర్పించినట్లు అధికారులు గుర్తించారు. ప్రతి నెలా గరిష్టంగా రూ.4.50లక్షల వరకు ఆహార బిల్లులు వచ్చినప్పటికీ, అందులో సగానికి పైగా నిధులు పక్కదారి పట్టినట్లు ఆరోపణలు వచ్చాయి. విజిలెన్స్ అధికారులు నిర్వహించిన దర్యాప్తులో ఈ ఆరోపణలు చాల మేరకు నిజమేనని తేలినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో పాత్ర ఉన్న పలువురు అధికారులకు ఇప్పటికే నోటీసులు జారీ చేసి పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు. విచారణలో సేకరించిన ఆధారాలతో నివేదికలు సి ద్ధం చేసిన విజిలెన్స్ అధికారులు, బాధ్యులైన వారిపై శాఖాపరమైన చ ర్య లు తీసుకోవాలని సిఫారసు చేయనున్నట్లు సమాచారం. విచారణ కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు తమ అక్రమ కార్యకలాపాల ను యథాతథంగా కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అం తేకాకుండా, అక్రమంగా సంపాదించిన సొమ్ముతో తమపై ఉన్న ఆరోపణల నుంచి బయటపడేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు కూడా ప్రచారం జరుగుతోంది.


దక్షిణ మధ్య రైల్వే
Follow us on X @SCRailwayindia
దక్షిణమధ్య రైల్వే టెండరు నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడగలరు.

నెం: C/E-Auction Catalogue/SC/2025-26. తేదీ: 22.12.2025

PUB/1649/25

భారత రాష్ట్రపతి తరపున, దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ వాణిజ్య ఆదాయం మరియు ఎన్ఎఫ్ఆర్ కాంట్రాక్టుల కోసం ఇ-వేలాన్ని ఆహ్వానిస్తున్నారు. తదనుగుణంగా, సికింద్రాబాద్ డివిజన్ ఈ క్రింది కేటగిరీల కోసం ఇ-వేలం ప్రక్రియ చేపట్టింది. వీటి వివరాలు https://www.ireps.gov.in/ వెబ్‌సైట్‌లో తెలియజేయబడ్డాయి.

క్ర.సం. 1, వర్గం: ప్రకటనలు, కేటలాగ్ నెం.: Advt-CH Z-Static, వేలం ప్రారంభ తేదీ & సమయం: 23- డిసెంబర్-25 మధ్యాహ్నం 2.00 గంటలకు. సంబంధిత స్టేషన్(లు) / రైలు(లు): CHZ, వేలం వివరాలు: చర్లపల్లి స్టేషన్ లోపల స్థిరమైన బోర్డుల ద్వారా వాణిజ్య ప్రకటనలను ప్రదర్శించడానికి కాంట్రాక్ట్.

క్ర.సం. 2, వర్గం: ఇతరత్రా-స్థిరమైనవి, కేటలాగ్ నెం.: హెల్త్ కియోస్క్-1-3, వేలం ప్రారంభ తేదీ & సమయం: 24 -డిసెంబర్-25 మధ్యాహ్నం 2.00 గంటలకు సంబంధిత స్టేషన్(లు)/రైలు(లు): CHZ,LPI, BMT, వేలం వివరాలు: చర్లపల్లి, లింగంపల్లి మరియు బేగంపేట స్టేషన్లలో హెల్త్ కియోస్క్‌ల స్థాపన, నిర్వహణ మరియు ఆపరేషన్ కోసం వ్యక్తిగత కాంట్రాక్టులు.

క్ర.సం. 3, వర్గం: పార్కింగ్, కేటలాగ్ నెం.: SC-PARKING-0125, వేలం ప్రారంభ తేదీ & సమయం: 25- డిసెంబర్-25 మధ్యాహ్నం 2.00 గంటలకు సంబంధిత స్టేషన్(లు)/రైలు(లు): HTCY, BHLK, KQD, వేలం వివరాలు: హైటెక్ సిటీ, భాల్కి & ఖైరతాబాద్ స్టేషన్లలో వ్యక్తిగత పార్కింగ్ కాంట్రాక్టులు.

క్ర.సం. 4, వర్గం: ఎంపిఎస్, కేటలాగ్ నెం.: SC-MPS-MUL-1201, వేలం ప్రారంభ తేదీ & సమయం: 25 -డిసెంబర్-25 మధ్యాహ్నం 2.00 గంటలకు, సంబంధిత స్టేషన్(లు)/రైలు(లు): BIDR,SKZR, వేలం వివరాలు: బీదర్ మరియు సిర్పూర్ కాగజ్‌నగర్ స్టేషన్లలో వ్యక్తిగత బహుళ ప్రయోజన స్టాళ్లు.

క్ర.సం. 5, వర్గం: ప్రకటనలు, కేటలాగ్ నెం.: SC-ADVT-MIXE-5, వేలం ప్రారంభ తేదీ & సమయం: 26 -డిసెంబర్-25 మధ్యాహ్నం ఒంటిగంటకు, సంబంధిత స్టేషన్(లు) / రైలు(లు): 12759/60, 17319/20, 12728/28, KZJ, RDM, BPZ, SKZR, YADD, SC, WL, వేలం వివరాలు: 1. రైలు నెం. 12759/60 &17319/17320 (రేక్ లింక్) & 12727/28 గోదావరి ఎక్స్‌ప్రెస్ రైళ్ల వెలుపలి భాగంలో వినైల్ ర్యాపింగ్ కోసం కాంట్రాక్ట్. 2. కాజీపేట రైల్వే స్టేషన్ మరియు రామగుండం, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్ మరియు జమ్మికుంట రైల్వే స్టేషన్ల సర్క్యులేటింగ్ ఏరియాలో డిజిటల్ బోర్డుల ద్వారా వాణిజ్య ప్రకటనల కోసం కాంట్రాక్ట్. 3. యాదాద్రి రైల్వే స్టేషన్ సమీపంలో యూనిపోల్ ఏర్పాటు కోసం కాంట్రాక్ట్. 4. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోని గేట్-2 బుకింగ్ కార్యాలయం సమీపంలో ప్రకటనల ప్రదర్శనతో కూడిన సెల్ఫ్ టికెటింగ్ జోన్‌ను ఏర్పాటు చేయడానికి కాంట్రాక్ట్. 5. వరంగల్ రైల్వే స్టేషన్ లోపల స్థిరమైన బోర్డుల ద్వారా వాణిజ్య ప్రకటనల ప్రదర్శన కోసం కాంట్రాక్ట్.

క్ర.సం. 6, వర్గం: ఇతరత్రా-స్థిరమైనవి, కేటలాగ్ నెం.: SC-MISC-CR-1, వేలం ప్రారంభ తేదీ & సమయం: 26- డిసెంబర్-25 మధ్యాహ్నం ఒంటిగంటకు, సంబంధిత స్టేషన్(లు) / రైలు(లు): 1HFZ, BMT, BPA, JET, వేలం వివరాలు: 1. హఫీజ్‌పేట రైల్వే స్టేషన్‌లో ఎలక్ట్రికల్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్ కోసం కాంట్రాక్ట్. 2. బేగంపేటలో రోబోటిక్ రిలాక్సేషన్ కుర్చీలు మరియు డిజిటల్ క్లోక్ రూమ్ యొక్క సంస్థాపన, నిర్వహణ మరియు పర్యవేక్షణ. 3. బెల్లంపల్లి స్టేషన్‌లో వ్యాగన్ శుభ్రపరిచే కాంట్రాక్ట్. 4. జేమ్స్ స్ట్రీట్ రైల్వే స్టేషన్‌లో ఫుడ్ ట్రక్కులు/చాట్ స్టాల్‌తో కూడిన జ్యూస్ బార్ ఏర్పాటు మరియు నిర్వహణ కోసం కాంట్రాక్ట్.

క్ర.సం. 7, వర్గం: పార్సెల్, కేటలాగ్ నెం.: SC PARCEL 2125, వేలం ప్రారంభ తేదీ & సమయం: 26 -డిసెంబర్-25 మధ్యాహ్నం ఒంటిగంటకు, సంబంధిత స్టేషన్(లు) / రైలు(లు): 17320, 17030, 20915, 12764, 12732, 12710, 22718/17, 22850/49, 12774/73, 17007/08, వేలం వివరాలు: 17320, 17030, 20915, 12764, 12732, 12710 రైళ్లలోని SLR కోచ్ (సింగిల్ కంపార్ట్‌మెంట్)లో పార్సెల్ స్థలం, 22718/17, 22850/49, 12774/73, 17007/08 రైళ్లలోని పార్సెల్ వ్యాన్‌లో పార్సెల్ స్థలం,

క్ర.సం. 8, వర్గం: పార్కింగ్, కేటలాగ్ నెం.: SC-PARKING-1225, వేలం ప్రారంభ తేదీ & సమయం: 03-జనవరి-26 ఉదయం 10:00 గంటలకు, సంబంధిత స్టేషన్(లు) / రైలు(లు): BG, PRLI, వేలం వివరాలు: భోంగిర్ మరియు పర్లి రైల్వే స్టేషన్లలో వ్యక్తిగత పార్కింగ్ కాంట్రాక్టులు.,

క్ర.సం. 9, వర్గం: ఇతరత్రా-స్థిరమైనవి, కేటలాగ్ నెం.: MISC-FUN-FT, వేలం ప్రారంభ తేదీ & సమయం: 03-జనవరి-26 మధ్యాహ్నం ఒంటిగంటకు, సంబంధిత స్టేషన్(లు) / రైలు(లు): JET, BMT, BDNH, SACH, NDMH, FZGH, KZJ, వేలం వివరాలు: 1. జేమ్స్ స్ట్రీట్, బేగంపేట్, భూదేవినగర్ హాల్ట్, నేరేడ్‌మెట్, సుచిత్ర సెంటర్, ఫిరోజ్‌గూడ హాల్ట్ స్టేషన్లలో బ్యాటరీ స్వాపింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయడానికి మరియు నిర్వహించడానికి వ్యక్తిగత కాంట్రాక్టులు. 2. కాజీపేట రైల్వే స్టేషన్‌లోని పాత రైల్వే క్వార్టర్ల వద్ద అందుబాటులో ఉన్న ప్రదేశంలో ఫన్ జోన్‌ను ఏర్పాటు చేయడానికి ఈ కాంట్రాక్ట్ ఉద్దేశించబడింది. 3. బేగంపేట రైల్వే స్టేషన్‌లో ఫుడ్ ట్రక్కులు/జ్యూస్ బార్ మరియు చాట్ స్టాల్ ఏర్పాటు మరియు నిర్వహణ కోసం కాంట్రాక్ట్.,

క్ర.సం. 10, వర్గం: MPS, కేటలాగ్ నెం.: SC-MPS-MUL-1225, వేలం ప్రారంభ తేదీ & సమయం: 03-జనవరి-26 మధ్యాహ్నం 2.00 గంటలకు, సంబంధిత స్టేషన్(లు) / రైలు(లు): KZJ, BPA, MDR, వేలం వివరాలు: కాజీపేట, బెల్లంపల్లి మరియు మధిర స్టేషన్లలో వ్యక్తిగత బహుళ ప్రయోజన స్టాళ్ళ కాంట్రాక్టులు.,

క్ర.సం. 11, వర్గం: పే అండ్ యూజ్, కేటలాగ్ నెం.: SC-RDM-ACWH-1, వేలం ప్రారంభ తేదీ & సమయం: 03-జనవరి-26 మధ్యాహ్నం 2.30 గంటలకు, సంబంధిత స్టేషన్(లు) / రైలు(లు): RDM, వేలం వివరాలు: రామగుండం స్టేషన్‌లో ప్రీ-పెయిడ్ ఏసీ వెయిటింగ్ హాల్ నిర్వహణ మరియు పర్యవేక్షణ కోసం కాంట్రాక్ట్.,

క్ర.సం. 12, వర్గం: పార్సెల్స్, కేటలాగ్ నెం.: SC PARCEL 2225, వేలం ప్రారంభ తేదీ & సమయం: 05-జనవరి-26 11:00 గంటలకు, సంబంధిత స్టేషన్(లు) / రైలు(లు): 12704, 12734, 12776, 17256, 22737, వేలం వివరాలు: 12704, 12734, 12776, 17256, 22737 రైళ్లలోని SLR కోచ్‌లో (ఒకే కంపార్ట్‌మెంట్) పార్సెల్ స్థలం

ఆసక్తిగల పక్షాలు మరియు కాంట్రాక్టర్లు ఈ విషయాన్ని గమనించి, ఇ-వేలం నోటీసు గురించిన వివరణాత్మక సమాచారం కోసం పైన పేర్కొన్న వెబ్‌సైట్‌ను సందర్శించగలరు. విచారణలు/ వివరణల కోసం, దయచేసి దిగువ సంతకం చేసిన వారి కార్యాలయాన్ని సంప్రదించండి.

A2097 సం/- సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్/సికింద్రాబాద్.

## బ్రిడ్జి నిర్మాణం కోసం మంత్రికి ఎమ్మెల్యే వినతి



**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** హైదరాబాదులోని సెక్రటేరియట్ యందు తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ మరియు ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి నాగారం మండలం వర్ధమానుకోట గ్రామం బిక్కెరు వాగుపై అడ్డగూడూరు మండలం ధర్మారం గ్రామం వరకు బ్రిడ్జిని నిర్మించాలని, ఇది సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రిభువనగిరి జిల్లాల, ప్రజలకు, సౌకర్యంగా ప్రయాణించడానికి ఉంటుందని బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మంత్రికి వినతి పత్రాన్ని ఎమ్మెల్యే మందుల సామేలు అందజేశారు.

## యాచకులకు, అనాధలకు అల్పాహారం



**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** క్రిస్మస్ వేడుకల్లో భాగంగా మిర్యాలగూడ డివిజన్ తెలంగాణ పాస్టర్స్ మెన్ అండ్ ఉమెన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం యాచకలకు, అనాధలకు తెలంగాణ పాస్టర్స్ మెన్ అండ్ ఉమెన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ధీరావత్ హన్యానాయక్, అశోక్నాయక్‌లు అల్పాహారం, అన్నదానం, పండ్లు, స్వీట్లు, దుప్పట్లు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దిక్కులేని వారికి దేవుడే దికుక ప్రార్థించే పెదవులకన్నా సహాయం చేసే చేతులే మిన్న అన్న మదర్ థెరిస్సా సూక్తిని అనుసరిస్తూ పేదలకు సేవ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మోతిలాల్, జోషప్, జనార్ధన్, దేవాదానం, దాసు, దేవయ్య, రమాబాయి, లక్ష్మమ్మ తదితరులు ఉన్నారు.

## ఇండ్లు త్వరగా పూర్తి చేసుకోవాలి



### జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**ప్రజాపక్షం/యాదాద్రి :** ఇందిరమ్మ ఇండ్ల పనులు త్వరగా పూర్తిచేసుకుని గృహప్రవేశాలు చేపట్టాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం యాదగిరిగుట్ట మండలంలోని దాతార్‌పల్లి, రాళ్ల జనగాం గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి నిర్మాణ పనులు మొదలుపెట్టి ఎన్ని రోజులు అవుతుందని అడిగి తెలుసుకున్నారు. మేస్త్రిని ఎంత రేటుకు మాట్లాడుకున్నారని, ఇటుక, సిమెంటు తదితర అవసరమైన మెటీరియల్‌ను షాపులో ఎంత రేటుకి కొనుగోలు చేశారని, నిర్మాణ పనులకు అవసరమైన మెటీరియల్‌ను షాపుల యాజమాన్యులు తక్కువ ధరకు ఇచ్చేందుకు ఒక ధర నిశ్చయించినందున నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసుకోమన్నారు. ఇప్పటి వరకు పూర్తి అయినా వరకు బిల్లులు వచ్చాయా అని అడిగి తెలుసుకున్నారు. మిగిలిన పనులు కూడా త్వరగా పూర్తి చేస్తే బిల్లు పడుతుందని, తదుపరి గృహప్రవేశం కూడా త్వరగా చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్‌ను ఢీకొన్న బైక్.. ఒకరి మృతి మరొకరి పరిస్థితి విషమం



**ప్రజాపక్షం/చందంపేట:** నల్గొండ జిల్లా చందంపేట మండలం గాగిలాపురం గ్రామ శివారులో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బుడ్డోని తండా గ్రామానికి చెందిన లింగాల వెంకటయ్య(45) భార్య, కూతురితో కలిసి ద్విచక్ర వాహనంపై దేవర కొండకు వస్తున్న తరుణంలో గాగిలాపురం గ్రామ శివారులోకి రాగానే పొలం నుండి ఒక్కసారిగా ట్రాక్టర్ వచ్చి వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న లింగాల వెంకటయ్య అక్కడికక్కడే మృతి చెందగా, కూతురు సంధ్య పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. భార్య శోభకు చిన్నచిన్న గాయాలు అయ్యాయి. మృతుని భార్య శోభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చందంపేట ఎస్ఐ లోకేష్ తెలిపారు.

## రైస్‌మిల్లులో ప్రమాదం : వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ పట్టణంలోని ఒక రైస్ మిల్లు వద్ద జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకున్న సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బిహార్ రాష్ట్రానికి చెందిన రాజకుమార్ రవిదాస్ (26) అనే వ్యక్తి గత మూడు నెలల నుండి లారీ క్లీనర్‌గా పని చేస్తున్నాడు. తన విధులలో భాగంగా సోమవారం రాత్రి సమయంలో హుజూర్‌నగర్ పట్టణంలోని సాయి రమణ పార్ బాయిల్డ్ రైస్ మిల్లులో లారీకి పొట్టు ఎత్తి దానికి పట్టకట్టడం కోసమని రాజకుమార్ లారీ పైకి ఎక్కి తాడు కట్టే సమయంలో ప్రమాదవశాత్తు పడి తలకు బలమైన గాయం తగలడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## బాల్య వివాహాల చట్టాలపై సదస్సు



**ప్రజాపక్షం/రామన్నపేట:** స్థానిక సీనియర్ సివిల్ కోర్టు ఆవరణలో బాల్య వివాహాలపై మంగళవారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. రామన్నపేట సీనియర్ సివిల్ కోర్టు జడ్జి జి.సబిత అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శిరీష, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ జడ్జి డి.సత్తయ్య, జిల్లా న్యాయ సహాయ న్యాయవాది ఎస్.సాయి శ్రీనివాస్‌లు హాజరయ్యారు. ఈ సదస్సులో వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు సర్వేలో తేలిందన్నారు. బాల్య వివాహాలు జరగకుండా ఉండాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన బాల్ వివాహ్ ముక్తి భారత్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బాల్య వివాహాలు జరగడం వల్ల చిన్న వయస్సు వారికి వచ్చే అనారోగ్య సమస్యలు, కుటుంబ సమస్యలు ఎన్నో ఎదుర్కొవాల్సి ఉంటుందని, బాల్య వివాహాలు చేసిన వారికి చేసుకున్న వారికి, సహకరించిన వారికి ఎలాంటి శిక్షలు పడ్తాయో వివరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేసి సిగ్నేచర్ కాంపెయిన్‌లో పోస్ట్‌పై సంతకాల సేకరణ చేయించారు. కార్యక్రంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంఏ.మస్జీద్, సీనియర్ న్యాయవాదులు, సర్వీసెస్ టీం సిబ్బంది, సభ్యులు, అంగన్‌వాడి కేంద్రాల సూపర్‌వైజర్లు, టీచర్లు, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది, లీగల్ సెల్ సభ్యులు బత్తుల గణేష్, కోక సబిత, కానుగంటి శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/డిండి :** డిండి పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. సోమవారం రాత్రి సింగరాజుపల్లి గ్రామానికి చెందిన మన్నెమోని విజయ్(25)తన బంధువైన చింతకుంట్ల కృష్ణయ్య (55)తో కలిసి ఎర్రగుంటపల్లి గ్రామంలో బంధువుల ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం టిఎస్31ఈ3035 వావిల్‌లోక్ గ్రామ శివారులోకి రాగానే రోడ్డు పైకి అడవిపంది ఆకస్మికంగా రావడంతో వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడడంతో మన్నెమోని విజయ్ తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందగా, కృష్ణయ్యకు వెన్నెముకకు తీవ్ర గాయం కావడంతో హైదరాబాద్‌కు తరలించారు. ఈసంఘటనపై ఫిర్యాదు స్వీకరించిన డిండి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ బాలకృష్ణ మంగళవారం తెలిపారు.

## ఆధునిక వ్యవసాయ పద్ధతులతో సాగు.. రైతులకు లాభాలు

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** సాంకేతిక యుగంలో ఆధునిక వ్యవసాయ పద్ధతుల ద్వారా సాగు చేయడంలో రైతులకు లాభాలు చేకూర్చేందుకు కెవికె గడ్డిపల్లి నిరంతరం కృషి చేస్తుందని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ అన్నారు. జాతీయ రైతుల దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలో గడ్డిపల్లిలోని కెవికె అరబిందో గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కిసాన్‌మేళా, వ్యవసాయ ప్రదర్శనకు ఆటారి డైరెక్టర్ షేక్ మీరాతో కలిసి జిల్లా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎన్ఎస్‌పి, ఎస్ఆర్ఎస్‌పి, మూసి, పాలేరు ప్రాజెక్టుల ద్వారా సూర్యాపేట జిల్లాలో సాగునీరు పుష్కలంగా అందటంతో నాణ్యమైన సన్న బియ్యం పండించటం ద్వారా తెలంగాణ రాష్ట్రంలో మంచి డిమాండ్ ఉందని తెలిపారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటికే మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి రైతులు పండించిన సన్న ధాన్యంకు క్వింటాకు బోనస్ 500 రూపాయలు జమ చేయడం జరిగిందన్నారు. జిల్లాలో 80వేల ఎకరాలలో పత్తి పంట పండిస్తున్నారని, పత్తి పంటలో అధిక సాంద్రత విత్తన పద్ధతి ద్వారా అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. సంప్రదాయ పంటల నుండి అధిక లాభాలు వచ్చే ప్రత్యామ్నాయ పంటలు పామ్ ఆయిల్ సాగు, కూరగాయలు, పండ్ల తోటలు, మల్టి క్రాపింగ్ వైపు మారితే తక్కువ సమయంలోనే లాభాలు పొందవచ్చని సూచించారు. అనంతరం అటారి డైరెక్టర్ మీరా మాట్లాడుతూ వరి పంటను తక్కువ ఖర్చుతో అధిక లాభదాయకంగా వచ్చేలా కెవికె శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించాలని, బయో ఫోర్టిఫైడ్ రైస్ పండిస్తే ఆహార భద్రతతో పాటు, పోషణ భద్రత లభిస్తుందని, నేరుగా విత్తడం ద్వారా రైతులకు ఖర్చులు తగ్గుతాయని, నేలసారాన్ని కాపాడేందుకు సేంద్రియ ఎరువులను ఉపయోగించాలని కోరారు. తమిళనాడు అగ్రికల్చర్ యూనివర్శిటి డైరెక్టర్ మురగన్ మాట్లాడుతూ తమిళనాడు అగ్రికల్చర్ యూనివర్శిటి ద్వారా నూతన ఆధునిక పద్ధతులు, నూతన వంగడాలను కెవికె గడ్డిపల్లి అందించడానికి మా వంతు సహాయం చేస్తామని వరి ప్రధాన పంట కాకుండా అధిక లాభాలు వచ్చే ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గుచూపాలని మహిళ రైతులు ఎస్‌హెచ్‌జి, ఎఫ్‌పివోల ద్వారా బృందంగా ఏర్పడి నూతన ఆలోచనలతో సాగు చేస్తే అధిక లాభాలు వస్తాయన్నారు. సేంద్రియ వ్యవసాయం చేసే గోపాలపురం గ్రామానికి చెందిన వినోద్‌కు డ్రమ్ము, బెల్లం, మేడారం గ్రామానికి చెందిన ముక్కంటికి డ్రమ్ సీడ్ యంత్రం, మంగళితండా గ్రామానికి చెందిన బాలునాయక్ బ్యాటరీ ఆపరేటర్ స్ప్రై, గుగులోతు శ్రీరాములుకు టమాట, వంగనారు అందజేశారు. నూతన పద్ధతులతో వ్యవసాయం చేస్తున్న అనంతారం గ్రామానికి చెందిన బైరెడ్డి రామిరెడ్డి, నర్సింహులగూడెం గ్రామానికి చెందిన నాగరాజును, సంగెమ్‌కు చెందిన షరీఫ్‌ను, నారాయణగూడెంకు చెందిన వెంకటరెడ్డిని, మాధవరం గ్రామానికి చెందిన రజని, టెర్రస్ గార్డెన్ ఫార్మర్ మమతాను కలెక్టర్, అటారీ డైరెక్టర్ ఘనంగా సన్మానించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఏవో శ్రీధర్‌రెడ్డి, హార్టికల్చర్ అధికారి నాగయ్య, అటారి ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త ఎఆర్ రెడ్డి, కెవికె గడ్డిపల్లి సీనియర్ శాస్త్రవేత్త నరేష్, అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ పాదయాత్ర కరపత్రాల ఆవిష్కరణ



**ప్రజాపక్షం/యాదాద్రి :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో ఈనెల 26, 27, 28, 29న చేపట్టే ఇంటింటికి పాదయాత్ర కరపత్రాలు యాదగిరిగుట్ట సిపిఐ కార్యాలయం వద్ద విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పేరబోయిన మహేందర్, సిపిఐ మున్సిపల్ కార్యదర్శి బబ్బులు శ్రీధర్ మాట్లాడుతూ యాదగిరిగుట్ట పట్టణ ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించి సాధించిన చరిత్ర సిపిఐ పార్టీకి ఉన్నదని స్థానికంగా ఉన్నటువంటి ఎమ్మార్వో, ఎంపీడీవో, ప్రభుత్వ హైస్కూల్, ఇంటర్మీడియట్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు కృషి చేసిందన్నారు. ప్రస్తుత పట్టణంలో ఉన్న బస్టాండ్, మున్సిపల్ కార్యాలయం ఏర్పాటులో ప్రధాన పాత్ర పోషించిందని ముఖ్యంగా చాలా మంది ఇల్లు లేని నిరుపేదల కోసం ఇళ్ల స్థలాలు ఇవ్వాలని పోరాటాలు నిర్వహించి బీసీ కాలనీలో అమరజీవి గోదా యాదగిరి నాయకత్వంలో 220 గజాల చొప్పున 350 ప్లాట్లను నిరుపేదలకు పంపిణీ చేయించిన చరిత్ర సిపిఐది అన్నారు. ఇతర సమస్యలను తెలుసుకోవడం కోసం సిపిఐ బృందం ఈనెల 26వ తేదీ నుండి 29వ తేదీ వరకు 12 వార్డులలో పాదయాత్ర ద్వారా తిరుగుతూ ప్రతి ఇంటికి వెళ్తూ ప్రజలను నేరుగా కలుస్తూ సమస్యలు తెలుసుకుని 29వ తేదీ సోమవారం గుర్తించిన సమస్యలన్నిటిని పరిష్కరించాలని యాదగిరిగుట్ట మున్సిపల్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కోఆప్షన్ మెంబర్ పేరబోయిన పెంటయ్య, పట్టణ సహాయ కార్యదర్శి పేరబోయిన బంగారు, పట్టణ కార్యవర్గ సభ్యులు గోరేటి రాములు, కోకల రవీందర్, మాటూరు మల్లయ్య, రాయగిరి బాలకృష్ణ, గుండు వెంకటేష్, మూనుకుంట్ల నరసమ్మ, చందు నాయక్, తుమ్మల ఇస్తారీ, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## కుల, ఆదాయ ధ్రువపత్రాల జారీలో జాప్యం తగదు



### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/నల్లగొండ (కనగల్) :** విద్యార్థులు ఉపకార వేతనాలు పొందేందుకు తహసిల్దార్లు జాప్యం లేకుండా కుల, ఆదాయ ధ్రువపత్రాలను జారీ చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. ఇందుకుగాను అవసరమైతే ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటిని త్వరితగతిన పూర్తిచేయాలని ఆమె ఆర్‌డిఓ, డిఈఓలను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కనగల్ మండల కేంద్రంలో పలు ప్రభుత్వ సంస్థలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఎంపీడీవో కార్యాలయంలో ప్రిమెట్రిక్ ఉపకార వేతనాల పంపిణీపై వచ్చిన దరఖాస్తులు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, దరఖాస్తుల శాతాన్ని ఎంపీడీఓ, తహసీల్దార్‌ల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ధ్రువపత్రాల కారణంగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలుసుకొని కుల, ఆదాయ ధ్రువ పత్రాలను జారీ చేసేందుకు ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి తక్షణ చర్యలు చేపట్టాలని ఆర్‌డిఓ అశోక్ రెడ్డి, డిఈఓ బిక్షపతిలను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ ఇందిరమ్మ ఇండ్లపై సమీక్ష నిర్వహిస్తూ పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను త్వరతగా పూర్తి చేసుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల బిల్లులను సైతం వెంటనే చెల్లించాల్సిందిగా గృహ నిర్మాణ శాఖ పీడి రాజ్ కుమార్‌ను ఆదేశించారు. గృహ నిర్మాణ శాఖ పీడి రాజకుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, జిల్లా టిబి అధికారి డాక్టర్ కల్యాణ చక్రవర్తి, డిఈఓ బిక్షపతి, తహసిల్దార్ పద్మ, ఎంపీడీఓ వేదం రక్షిత, కనగల్ సర్పంచ్ మురళి గౌడ్, తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

## శిథిలావస్థలో రహదారి.. పొంచి ఉన్న ప్రమాదం



**ప్రజాపక్షం/మోతె :** మండలంలోని సిరికొండ నుంచి రావిపహాడ్‌కు వెళ్ళే రహదారితో నిత్యం మండల కేంద్రానికి వచ్చిపోయే ప్రయాణికులకు అతి చేరువలో ఉన్న ప్రయాణం సిరికొండ రావిపహాడ్ మధ్యలో ఏర్పాటు చేసిన బ్రిడ్జి నిర్మాణం గడిచిన రెండు, మూడు సంవత్సరాలు విపరీతంగా కురుస్తున్న అతి భారీ వర్షాలతో రహదారి వరద తాకిడికి కొట్టుకొనిపోయి తీవ్రంగా దెబ్బతినడంతో కాంక్రీట్ పూర్తిగా వరదలో కొట్టుకపోయింది. రోడ్డుపైన వేసిన గూనలు పూర్తిగా పగిలిపోయి రోడ్డుపైన గోతులు ఏర్పడ్డాయని పగటిపూట కూడా దగ్గరికి వచ్చే వరకు రోడ్డుపైన ఉన్న గుంటలు కన్పించడం లేదని పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు రెండు వైపుల పగులుడు వచ్చి రోడ్డు మొత్తం ధ్వంసం అయిందని అటుగా నిత్యం వెళ్ళే వాహనదారులు చెపుతున్నారు. ఏ సమయంలో ఏ ప్రమాదం సంభవిస్తుందో అర్థం కావడం లేదని పలువురు చర్చించుకుంటున్నారు. రోడ్డును పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేయకపోవడంతో రావిపహాడ్, సర్వారం కూడలి నుంచి వచ్చిపోయే ప్రయాణికుల నలబై కిలోమీటర్ల దూరం నుంచి చివ్వెంల మీదుగా ప్రయాణించవల్సి వస్తుందని లేదంటే ఉర్లుగొండ నుంచి నాయకన్‌గూడెం మీదుగా ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొని ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికి అధికారులు స్పందించి సిరికొండ, రావిపహాడ్ మధ్య ఉన్న రహదారి మరమ్మత్తులు చెపడుతారో వేచి చూడాలి మరి.

## రోగుల ప్రాణాలతో సర్కార్ చెలగాటం!



### 40 ఏళ్ల నాటి డిమాండ్‌ను పట్టించుకోరా?: కల్వకుంట్ల కవిత ధ్వజం

**ప్రజాపక్షం/భువనగిరి :** ఆలేరు నియోజకవర్గ కేంద్రంలో వంద పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. 'జనం బాట' పర్యటనలో భాగంగా ఆలేరులోని స్థానిక ఆస్పత్రిని సందర్శించిన ఆమె, అక్కడి అరకొర వసతులు, రోగులు పడుతున్న ఇబ్బందులను చూసి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ 'ఆలేరు ప్రాంతం గుండా జాతీయ రహదారులు ఉన్నందున నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. అత్యవసర వైద్యం కోసం ఇక్కడి ప్రజలు 40 ఏళ్లుగా 100 పడకల ఆస్పత్రి కావాలని కోరుతున్నారు. గతంలో ఉన్న 15 పడకలను ఇప్పుడు 30కి పెంచినప్పటికీ, భవనం శిథిలావస్థకు చేరింది. రిపేర్లకు నిధులు మంజూరయ్యాయని చెబుతున్నా, పనులు ఎందుకు ప్రారంభించలేదు?' అని ప్రశ్నించారు. జనంబాట కార్యక్రమంలో తెలంగాణ జాగృతి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సుజిత్ రావు, నాయకులు అశోక్ యాదవ్, శ్రీకాంత్, మండవ నవీన్, భాను, దాసరి సన్ని, భానుప్రసాద్ గౌడ్, ఎత్తరి గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

## లాకప్ డెత్‌పై నిర్లక్ష్యం వహిస్తున్న ఎస్‌పి బదిలీ

### ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ డిమాండ్



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** కర్ల రాజేష్ లాకప్ డెత్ ఘటనపై నిర్లక్ష్యం వహిస్తున్న సూర్యాపేట జిల్లా ఎస్‌పిని బదిలీ చేయాలని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఎంఆర్‌పిఎస్, దళిత సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో గత నెల రోజులుగా రాజేష్ లాకప్ డెత్‌పై జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని అనేక మార్లు కలిసి విన్నవించుకున్నా మా దళిత మాదిగ యువకుడి మరణగోస వాళ్ళ చెవులకు వినిపించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఎస్‌పి స్థానిక ఎమ్మెల్యే మాట విని చిలుకూరు ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డిని కేసు నుంచి తప్పిస్తున్నారని ఆరోపించారు. ఎక్కడలేని విధంగా సూర్యాపేట జిల్లా పోలీసులు రెండు ఎఫ్ఐఆర్‌లు తప్పుడు రికార్డులను నమోదు చేశారని అన్నారు. రాజేష్ గాంధీ హాస్పటల్‌లో చనిపోతే అక్కడికి ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి ఎలా వెళ్తాడని అదే క్రమంలో కోదాడ ఫోటోగ్రాఫర్ రెడ్డిని తీసుకెళ్లారని తప్పుడు రికార్డులతో కేసులు తారుమారు చేసి మరణానికి కారణమైన వారిపై చర్య తీసుకోకుండా కంటితుడుపుగా కోదాడ సిఐ ప్రతాప్‌లింగంను సస్పెండ్ చేసి చిలుకూరు ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. ఈనెల 30న కోదాడ పట్టణ కేంద్రంలో లక్షలాది మందితో బహిరంగ సభ ఉంటుందని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు యాతాకుల రాజన్న మాదిగ, నాయకులు బచ్చలకూరి వెంకటేశ్వర్లు మాదిగ, చింతలపాటి చిన్నశ్రీరాములు మాదిగ, తల్లమల్ల హుసేన్, చింత వినయ్‌మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## శాంతియుతంగా క్రిస్మస్ వేడుకలు



### సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్


**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** క్రిస్మస్ వేడుకలను నియోజకవర్గ ప్రజలు శాంతియుతంగా నిర్వహించుకోవాలని సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ అన్నారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో డీఎస్పీ రాజశేఖర్ రాజుతో కలిసి నియోజకవర్గంలోని చర్చి ఫాదర్లు, పాస్టర్లు, చర్చి కమిటీ సభ్యులతో క్రిస్మస్ విందు, క్రిస్మస్ వేడుకల నిర్వహణపై నియోజకవర్గస్థాయి సమన్వయ సమావేశాన్ని నిర్వహించి ఆయన మాట్లాడారు. క్రిస్మస వేడుకలు, ప్రార్థనలు, విందులు, ఊరేగింపులు సాధారణ ప్రజలకు అసౌకర్యం కలుగకుండా శాంతియుతంగా నిర్వహించుకోవాలని, కార్యక్రమాలు నిర్వహించే స్థలంలో జన సమూహ నియంత్రణ, పార్కింగ్, పారిశుద్ధ్యం, అగ్నిమాపక భద్రతకు తగిన ఏర్పాట్లు చేయాలని, వేడుకల సందర్భంగా ఏమైనా సమస్యలు లేదా అవసరాలు వచ్చినట్లయితే వెంటనే స్థానిక అధికారులకు, పోలీసుల దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. నేడు పట్టణంలోని ఏఆర్‌సీ ఫంక్షన్ హాల్‌లో క్రిస్మస్ విందు, వేడుకలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ర్యాలీలో పత్తి దగ్ధంపై కేసు నమోదు



**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** కోటమర్తి గ్రామంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ ర్యాలీలో క్రాకర్స్ పేలుస్తూ గ్రామస్తుని ఇంట్లో పత్తి కాలిపోవుటకు కారణమైన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట్ రెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం సాయంత్రం 07.00 గంటల సమయంలో కోటమర్తి గ్రామంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ పాశం విష్ణువర్ధన్ ర్యాలీకి ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహించారు. ఆ ర్యాలీలో పాల్గొన్న మనిపెద్ది సురేందర్, మనిపెద్ది మచ్చగిరిలు క్రాకర్స్ పేల్చడంతో అవి గూడ సోమయ్య ఒక ఇంట్లోని పత్తిలో పడి సుమారుగా నాలుగు క్వింటాల పత్తి కాలిపోయింది. ఇట్టి విషయంపై గూడ సోమయ్య యొక్క ఫిర్యాదు మేరకు వారిపై అడ్డగూడూరు పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించి దర్యాప్తు చేయడం జరుగుతుందని పోలీసులు తెలిపారు.

## నూతన పాలకవర్గానికి మంత్రి, ఎంపి, ప్రభుత్వ విప్‌ల సన్మానం



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి మండలంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన చిన్న లక్ష్మాపూర్ సర్పంచ్ కోమటిరెడ్డి సంతోష భాస్కర్ రెడ్డి, ఉప సర్పంచ్ పార్వతీ చిన్న నాయక్, వార్డు మెంబర్ల పాలకవర్గానికి యాదగిరిగుట్టలోని ఎస్ఎల్ఎన్ఎస్ ఫంక్షన్ హాల్‌లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మహిళా అభివృద్ధి సంస్థ చైర్మన్ బండ్రు శోభారాణిలు వారికి అభినందనలు తెలియచేస్తూ శాలువాలు మేమేంటోలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు రమావత్ నరేష్ నాయక్, దూబల సునీత నవీన్ రెడ్డి, ఓర్సు రాములు, ధీరవత్ సరిత రమేష్, కాంగ్రెస్ నాయకులు కొత్త రాజశేఖర్ రెడ్డి, ఓర్సు సురేష్, బోళ్ల సురేష్, మూడావత్ నర్సింహ, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## కంచర్లని పరామర్శించిన హరీష్, పైళ్ల



**ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి :** అనారోగ్యంతో చికిత్స పొందుతున్న యాదాద్రి భువనగిరి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కంచర్ల రామకృష్ణ రెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు, భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్ రెడ్డిలు పరామర్శించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రామకృష్ణ రెడ్డిని కలిసిన వారు ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రామకృష్ణ రెడ్డి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. భువనగిరి మాజీ శాసనసభ్యులు, బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ పైళ్ల శేఖర్ రెడ్డి మాట్లాడుతూ రామకృష్ణ రెడ్డి ఆరోగ్యం నిలకడగా ఉందని, త్వరలోనే ఆయన పూర్తి ఆరోగ్యంతో తిరిగి వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# క్రీడ

## స్టార్ ఆటగాళ్ల సందడి..

### 'విజయ్ హజారే' ట్రోఫీకి కొత్త కళ





ఇంతకుముందు విజయ్ హజారే ట్రోఫీ అంటే అభిమానుల్లో పెద్దగా ఆసక్తి ఉండేది కాదు. టోర్నీ ఎప్పుడు మొదలైంది, ఎప్పుడు ముగిసిందో కూడా చాలా మందికి తెలిసేది కాదు. కానీ, ప్రస్తుతం భారత జట్టులో ఉన్న క్రికెటర్లం దరూ కనీసం రెండు మ్యాచ్‌లు ఆడాలని బీసీసీఐ షరతు విధించడంతో ఈ దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నీకి కొత్త కళ వచ్చింది. స్టార్ ఆటగాళ్లు తమ తమ రాష్ట్రాల జట్ల తరఫున బరిలోకి దిగుతున్నారు. నేటి నుంచి మొదలుకానున్న ఈ టోర్నమెంట్‌లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రిషభ్ పంత్, శుభ్‌మన్ గిల్, సూర్యకుమార్ యాదవ్, అభిషేక్ శర్మతోపాటు మరి కొంత మంది స్టార్ ప్లేయర్లు సందడి చేయనున్నారు. కోహ్లీ 15 ఏళ్ల తర్వాత విజయ్ హజారే ట్రోఫీలో ఆడుతుండటం విశేషం.

**మళ్లీ రో-కో ఫైర్ చూస్తామా?**

ముంబయికి ప్రాతినిధ్యం వహిస్తున్న రోహిత్ శర్మ.. డిసెంబర్ 24, 26న సిక్కిం, ఉత్తరాఖండ్‌తో మ్యాచ్‌ల కోసం జైపూర్ చేరుకున్నాడు. రోహిత్ ఇప్పటివరకు ఈ టోర్నీలో 18 మ్యాచ్‌లు ఆడి 600 రన్స్ చేశాడు. 2005-06 సీజన్‌లో వెస్ట్ జోన్‌కు ఆడిన హిట్‌మ్యాన్.. నార్త్ జోన్‌పై 142 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఈ ఇన్నింగ్స్‌తోనే దేశవాళీ క్రికెట్‌లో రోహిత్ వెలుగులోకి వచ్చాడు. ఇక, కొన్ని రోజుల కిందట లండన్ నుంచి భారత్‌కు చేరుకున్న కోహ్లీ ముంబయిలో ముమ్మరంగా ప్రాక్టీస్ చేశాడు. ఢిల్లీకి ఆడనున్న కోహ్లీ.. ఆంధ్రతో మ్యాచ్ కోసం బెంగళూరు వెళ్లాడు. విజయ్ హజారేలో 'కింగ్'కు మంచి రికార్డు ఉంది. 2008-9 సీజన్‌లో ఏడు మ్యాచ్‌లు ఆడి నాలుగు శతకాలు బాది 534 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. తర్వాతి సీజన్‌లో ఐదు మ్యాచ్‌లు ఆడి 229 రన్స్ చేశాడు. ఇటీవల సఫారీలతో వన్డే సిరీస్‌లో రాణించిన రో..కో విజయ్ హజారే ట్రోఫీలోనూ అలరించాలని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.

## రోల్‌బాల్‌లో రాణిస్తోన్న ఇషికా శర్మ



ఉత్తర్‌ప్రదేశ్ మేరఠ్‌కు చెందిన ఇషికా శర్మ రోల్‌బాల్‌లో సత్తా చాటుతున్నారు. ఇటీవల జరిగిన అంతర్జాతీయ పోటీల్లో గోల్ మెడల్ సాధించిన భారత్‌ను గర్వపడేలా చేశారు. మేరఠ్‌లోని సంజయ్ శర్మ, ఆకాంక్ష దంపతుల కుమార్తె ఇషికా. వీరిది సాధారణ కుటుంబం. 2011 నుంచి ఇషికా స్కేటింగ్ నేర్చుకున్నారు. ఈ క్రమంలో ఆమె కోచ్ అంకుర్.. రోల్‌బాల్ క్రీడను పరిచయం చేశారు. ఓ ఏడాది పాటు సాధన చేసిన ఆమె అందులో పట్టు సాధించారు. 2012లో జాతీయ క్రీడల్లో పాల్గొనే అవకాశం రావడం, అందులో అద్భుతంగా ఆడి తన సత్తా చాటుకున్నారు. 2019లో అంతర్జాతీయ జట్టులో స్థానం సంపాదించుకున్న ఇషికా.. మూడుసార్లు వరల్ కప్‌లో పాల్గొన్నారు. 2022లో ఓ సారి ప్రమాదానికి గురైన ఆమె.. కొంతకాలం ఆటకు దూరమయ్యే పరిస్థితి వచ్చింది. అయినప్పటికీ, వెనక్కితగ్గకుండా కృషి చేసి మరుసటి ఏడాది తిరిగి జట్టులోకి వచ్చారు. ఇటీవల దుబాయ్‌లో జరిగిన మహిళల రోల్‌బాల్ వరల్ కప్ పోటీల్లో ఇషికా సారథ్యంలోని భారత బృందం అద్భుత ప్రతిభ కనబరిచింది. రెండుసార్లు డిఫెండింగ్ ఛాంపియన్స్ కెన్యాను ఓడించి బంగారు పతకం సాధించింది. 50దేశాల్లో ఈ క్రీడ ఆడుతున్నప్పటికీ మన దేశంలో కొంత మంది మాత్రమే మంచి క్రీడాకారులున్నారని, మరింత మందిని ప్రోత్సాహించేందుకు ప్రయత్నిస్తున్నారు.




## షెఫాలీ సునామీ..

### శ్రీలంకను చిత్తుగా ఓడించిన భారత్

శ్రీలంకతో అయిదు టీ20ల సిరీస్‌లో భాగంగా రెండో మ్యాచ్‌లో భారత్ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. షెఫాలీ వర్మ (69*: 34 బంతుల్లో 11 ఫోర్లు, ఒక సిక్స్) చెలరేగడంతో 129 పరుగుల లక్ష్యాన్ని భారత్ 11.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జెమీమా రోడ్రిగ్స్ (26), స్మృతి మంధాన (14), హర్మన్ ప్రీత్ కౌర్ (10) పరుగులు చేశారు. ఈ గెలుపుతో భారత్ 20 తేడాతో ఆధిక్యంలో నిలిచింది. అంతకుముందు బ్యాటింగ్ చేసిన శ్రీలంక.. భారత బౌలర్లు విజృంభించడంతో 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 128 పరుగులు చేసింది. ఆ జట్టులో హర్షిత (33) టాప్ స్కోరర్. చమరి ఆటపట్టు (31), హాసిని పెరీరా (22) పరుగులు చేశారు. భారత బౌలర్లలో శ్రీచరణి 2, వైష్ణవి శర్మ 2, క్రాంతి గౌడ్, స్నేహ్ రాణా ఒక్కో వికెట్ తీశారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంకకు తొలి ఓవర్లోనే షాక్ తగిలింది. క్రాంతి గౌడ్ బౌలింగ్‌లో తొలి ఓవర్ చివరి బంతికి విష్మి గుణరత్నే బౌలర్‌కే క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. మరోవైపు క్రీజులో ఉన్న కెప్టెన్ చమరి ఆటపట్టు (31: 3 ఫోర్లు, 2 సిక్సలు).. క్రాంతి గౌడ్ వేసిన మూడో ఓవర్లో ఒక ఫోర్, సిక్స్, అరుంధతీ రెడ్డి బౌలింగ్‌లో ఒక ఫోర్, సిక్స్ కొట్టి దూకుడు ప్రదర్శించింది. అయితే స్నేహ్ రాణా వేసిన ఆరో ఓవర్ మూడో బంతికి ఆటపట్టు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరింది. వైష్ణవి వేసిన ఎనిమిదో ఓవర్లో హర్షిత హ్యాట్రిక్ ఫోర్లతో విరుచుకుపడింది. 10 ఓవర్లు ముగిసే సరికి శ్రీలంక రెండు వికెట్ల నష్టానికి 66 పరుగులతో నిలిచింది. బౌలర్లు పొదుపుగా బౌలింగ్ చేయడంతో ఆ జట్టు పరుగులు తీయడానికి కష్టపడింది. ఈ క్రమంలో శ్రీ చరణి బౌలింగ్‌లో హాసిని పెరీరా క్యాచ్ ఇచ్చి ఔటైంది. శ్రీ చరణి బౌలింగ్‌లోనే హర్షిత (33: 32 బంతుల్లో 4 ఫోర్లు) రనౌట్ అయింది. 18వ ఓవర్ తొలి బంతికి నీలాక్షి డిసిల్వా (2) ఔట్ కాగా, ఆతర్వాతి ఓవర్‌లో శ్రీచరణి బౌలింగ్‌లో కవిశా పెవిలియన్ చేరింది. ఇక చివరి ఓవర్‌లో శ్రీలంక మూడు వికెట్లు కోల్పోయింది. ఇందులో రెండు రనౌట్లు ఉన్నాయి.

# మహిళ ఫోకస్

నిరుద్యోగులు.. చివరుద్యోగులు స్వయం ఉపాధి కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఉన్న కేంద్ర పథకాల్లో 'ప్రధాన మంత్రి ఉద్యోగ గ్యారంటీ ప్రోగ్రామ్' (పిఎంఇజిపి) మెరుగైనదని చెప్పుకోవచ్చు. ఇది గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వ్యవసాయేతర రంగాల్లో కొత్త సూక్ష్మ పరిశ్రమలను స్థాపించడానికి కేంద్ర ప్రభుత్వం అందించే రుణ-సబ్సిడీ పథకం.



యూత్ లేదా మహిళలు

PMEGP

ఈ పథకం కింద ప్రాజెక్టు వ్యయం తయారీ రంగానికి గరిష్ఠంగా రూ. 50 లక్షలు, సేవా రంగానికి రూ. 20 లక్షలు వరకు మంజూరు చేస్తారు. ఈ పథకం ద్వారా రుణం బ్యాంకుల ద్వారా అందిస్తారు. అలాగే మార్జిన్ మనీని సబ్సిడీ రూపంలో ప్రభుత్వం చెల్లిస్తుంది. ఈ పథకంలో వ్యాపారానికి సంబంధించిన మూలధన ఖర్చుల కోసం టర్మ్ లోన్‌ను మంజూరు చేస్తారు. అదే విధంగా రోజువారీ వ్యాపార నిర్వహణ కోసం వర్కింగ్

## చిన్న పరిశ్రమలకు 'పిఎంఇజిపి' ఊతం

క్యాపిటల్ రుణం ఇస్తారు. మొత్తం ప్రాజెక్టు వ్యయంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం 15 శాతం నుండి 35 శాతం వరకు సబ్సిడీని అందిస్తుంది. ఇది లబ్ధిదారుడిపై ఉన్న రుణ భారాన్ని తగ్గిస్తుంది. సాధారణ లబ్ధిదారులకు పట్టణ ప్రాంతాల్లో 15 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 25 శాతం వరకూ సబ్సిడీ అందే అవకాశాలు ఉన్నాయి. ఎస్‌సి, ఎస్‌టి, మహిళలు, ఈశాన్య రాష్ట్రాల వారు, హస్తకళల కార్మికులు, మాజీ సైనికులు వంటి వర్గాలకు 25 నుంచి 35 శాతం వరకూ సబ్సిడీ ఉంటుంది.

**కీలక అంశాలు..**

- రుణమొత్తం రూ. 10 లక్షల లోపు ఉంటే, ఏవిధమైన భద్రతా హామీ (కొల్లేటర్ సెక్యూరిటీ) అవసరం లేదు.
- ఈ పథకాన్ని అమలు చేసే ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (కెవిఐసి) సంస్థ లబ్ధిదారులకు మార్కెటింగ్ సాయం అందిస్తుంది. వారి ఉత్పత్తులను ప్రదర్శించడానికి ఎగ్జిబిషన్లు, కొనుగోలు-అమ్మకందారుల సమావేశాలు వంటి కార్యక్రమాలను నిర్వహిస్తుంది.
- దరఖాస్తు దారుల కనీస వయసు 18 సంవత్సరాలు. గరిష్ట వయసును పేర్కొలేదు.
- ఆదాయ పరిమితి లేదు. ఎవరికైనా ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు.
- విద్యార్హత విషయానికి వస్తే, రూ.10 లక్షలు లేదా అంతకు మించిన ప్రాజెక్టు విలువగల తయారీ రంగ ప్రాజెక్టులు , రూ.5 లక్షలు అంతకు మించిన ప్రాజెక్టు విలువగల సేవా రంగ ప్రాజెక్టులకు కనీస విద్యార్హత 8వ తరగతి ఉత్తీర్ణత. మిగతా ప్రాజెక్టులకు కనీస విద్యార్హత అంటూ ఏదీ లేదు.
- పాత వ్యాపారాలకు లేదా రీన్యువల్ ప్రాజెక్టులకు ఈ పథకం వర్తించదు. కేవలం కొత్త ప్రాజెక్టులకు మాత్రమే ఈ పథకం కింద ఆర్థిక సహాయం లభిస్తుంది.
- ఆన్‌లైన్ దరఖాస్తులో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.
- ఆసక్తిగల వారు అన్ని వివరాలతో దరఖాస్తు ఫారాలను పిఎంఇజిపి ఇ-పోర్టల్ https://kviconline.gov.in/pmegpeportal/jsp/pmegponline.jsp ద్వారా ఆన్‌లైన్‌లో అప్‌లోడి చేయాల్సి ఉంటుంది.
- దరఖాస్తుదారులకు పారిశ్రామికాభివృద్ధి ప్రోగ్రామ్ కింద తప్పనిసరిగా ఆన్‌లైన్ కోర్సును పూర్తి చేయాలి. ఇది వ్యాపార నిర్వహణ, మార్కెటింగ్, అకౌంటింగ్ వంటి ప్రాథమిక అంశాలపై అవగాహన కల్పిస్తుంది.
- ఆన్‌లైన్ దరఖాస్తు బ్యాంకుకు ఫార్వార్డ్ చేయబడుతుంది. బ్యాంకు పరిశీలన తర్వాత రుణం మంజూరు చేస్తుంది.
- బ్యాంకు రుణం మంజూరు చేసిన తర్వాత, మార్జిన్ మనీ సబ్సిడీ ప్రభుత్వం నుండి బ్యాంకుకు జమ చేస్తారు. ఆ మొత్తాన్ని బ్యాంకు ప్రాజెక్టు ఖాతాలో నిలిపి ఉంచుతుంది.
- పిఎంఇజిపి పథకాన్ని మూడు ప్రధాన సంస్థల ద్వారా అమలు చేస్తారు. జాతీయ స్థాయిలో ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (కెవిఐసి) పర్యవేక్షణ బాధ్యత చేపడుతుంది. ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు (కెవిఐబి) సంస్థ రాష్ట్రస్థాయిలో ఈ పథకాన్ని పర్యవేక్షిస్తుంది. జిల్లా స్థాయిలో డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీస్ సెంటర్ (డిఐసి) దీనిని అమలు చేస్తుంది.
- గ్రామీణ, పట్టణ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం, గ్రామీణ పారిశ్రామికవేత్తల సంఖ్యను పెంచడం, సూక్ష్మ , చిన్న స్థాయి పరిశ్రమల (ఎంఎస్ఎంఇ) అభివృద్ధికి సహకరించడం, గ్రామీణ ప్రజలను వ్యవసాయం కాకుండా ఇతర రంగాల్లోకి ఆకర్షించడం వంటివి ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యాలు.
- ఉదాహరణకు గ్రామీణ ప్రాంతంలో ఉన్న యువకుడు ఒక ఫర్నిచర్ తయారీ యూనిట్ ప్రారంభించాలని అనుకుంటే, రూ.25 లక్షల ప్రాజెక్టు ఖర్చుతో పిఎంఇజిపి ద్వారా రుణం పొందవచ్చు. సబ్సిడీగా సుమారు రూ.6.25 లక్షలు (25 శాతం) లభిస్తాయి.
- ఒక మహిళా వ్యాపారవేత్త బ్యూటీ పార్లర్ లేదా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభించాలని అనుకుంటే, రూ.10 లక్షల ప్రాజెక్టు మీద 30-35 శాతం సబ్సిడీ పొందవచ్చు.
- లబ్ధిదారులు తమ ప్రాజెక్టుల వివరాలను కెవిఐసి మొబైల్ యాప్ (KVIC Mobile App) ద్వారా కూడా ట్రాక్ చేసుకోవచ్చు.
- పథకం కింద సబ్సిడీని మూడు సంవత్సరాల తర్వాత మాత్రమే పూర్తిగా క్లెయిమ్ చేయవచ్చు.
- పిపిఎంఇజిపి ప్రాజెక్టులలో సుమారు 80 శాతం వరకు గ్రామీణ ప్రాంతాల నుంచే వస్తున్నాయి.
- పిపిఎంఇజిపి పథకం అనేది నిరుద్యోగ యువత, మహిళలు, వెనుకబడిన వర్గాలకు స్వయం ఉపాధి దిశగా కీలకమైన ప్రోత్సాహం. బ్యాంకుల ద్వారా రుణం, ప్రభుత్వ సబ్సిడీ, శిక్షణ, మార్కెటింగ్ సహాయం వంటి సమగ్ర మద్దతు ఈ పథకం ప్రత్యేకత. సరైన వ్యాపార ఆలోచన, సరైన ప్రణాళిక, మరియు శిక్షణతో పిపిఎంఇజిపి పథకం ద్వారా వ్యక్తిగత స్థాయిలో ఆర్థిక స్వావలంబన సాధించడం పూర్తిగా సాధ్యమే.

### దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన

## ఏకైక విద్యార్థి సంఘం ఎఐఎస్‌ఎఫ్

రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి

ఘనంగా ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా 4వ మహాసభలు




ప్రజాపక్షం/పెద్దపల్లి : భారతదేశానికి స్వాతంత్ర్యం కావాలని ఏర్పడి విద్యార్థులను చైతన్యం చేసి పోరాడిన ఏకైకవిద్యార్థి సంఘం ఎఐఎస్‌ఎఫ్ అని దేశంలో 90 సంవత్సరాలుగా విద్యార్థుల సమస్యల కోసం పోరాటాలు నిర్వహిస్తున్న చరిత్ర ఎఐఎస్‌ఎఫ్‌కు ఉందని. మోడీ ప్రభుత్వం మతంపేరుతో రాజకీయం చేస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని, రేవంత్ రెడ్డి రెండేళ్ల పాలనలో విద్యార్థులకు ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయలేదని, అందాల పోటీలకు ఉన్న నిధులు, మెస్సీతో ఫుట్‌బాల్ ఆటపై ఉన్న శ్రద్ధ, వాటికి ఉన్న నిధులు విద్యార్థులకు ఎందుకు లేవని, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా 4వ మహాసభ సందర్భంగా పట్టణంలో జూనియర్ కళాశాల గ్రౌండ్ నుండి కమాన్ చౌరస్తా మీదుగా ఎన్ఎస్ గార్డెన్స్ వరకు విద్యార్థి ప్రదర్శన ర్యాలీ నిర్వహించి అనంతరం ఎఐఎస్‌ఎఫ్ జెండాను మాజీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మార్కపురి సూర్య ఆవిష్కరించారు. జిల్లా మహాసభ సాయి ఆజాద్ అధ్యక్షతన జరగగా మహాసభకు రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మణికంఠ రెడ్డి, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలసాని లెనిన్‌లు మాట్లాడుతూ.. దేశంలో మోడీ ప్రభుత్వం 11ఏళ్ల పాలనలో విద్యార్థులను విస్మరించిందని దేశంలో విద్య ప్రవేటీకరణ, కార్పొరేటీ కరణ, కాషాయికరణ చేయడానికి కుట్ర చేస్తుందని నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్యారంగ మొత్తం నిర్వీర్యం చేస్తున్నారని, పాఠ్యాంశాల్లో మతపరపైన అంశాలను చేస్తూ చరిత్రను తొలగించే ప్రయత్నం చేయడాన్నీ విద్యార్థులు తిప్పికొట్టాలని, విభజన హామీల ప్రకారం తెలంగాణకి పెద్దపల్లికి రావాల్సిన నవోదయ పాఠశాల ఏర్పాటు కాలేదని, బిజెపి పార్టీ పెద్దపల్లి జిల్లాపై వివక్ష చూపుతుందన్నారు. ఈ మహాసభలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం, ఉపాధ్యక్షులు మొలుగూరి నితిలేష్, కోశాధికారి ఎల్కపల్లి సురేష్, కార్యవర్గ సభ్యులు మాతాంగి సాగర్, గుండ్లా లక్ష్మి ప్రసన్న, పల్లె హర్ష, సాయి అనుప్, సాయి తేజ, పూదరి సాయి, అభిషేక్, చైత్ర, మైథిలి, సాయి శరణ్య, వైశాలి తదితరులు పాల్గొన్నారు.

## మేడారంలో నేడు దర్శనాలు బంద్

ప్రజాపక్షం/ములుగు: మేడారం సమ్మక్క, సారలమ్మ అమ్మవార్ల దర్శనాలను బుధవారం నిలిపివేస్తున్నట్లు పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు తెలిపారు. మంగళవారం గద్దెల ఆవరణలో ఆయన మాట్లాడారు. గోవిందరాజు, పగిడిద్ద రాజుల గద్దెల ప్రతిష్ఠాపన కార్యక్రమాలతో పాటు గద్దెల విస్తరణ పనులు సాగుతున్నట్లు చెప్పారు. దీనితో ఒక్క రోజు అమ్మవార్ల దర్శనాలు నిలిపివేస్తున్నామని, భక్తులు సహకరించాలని ఆయన కోరారు.

**మేడారం సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్న మంత్రులు**

ములుగు జిల్లా మత్స్యశాఖ అధ్యక్షులు కంబాల రవి మేడారం సమ్మక్క తల్లిని దర్శనం చేసుకున్న అనంతరం మంగళవారం జాతరలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించుటకు విచ్చేసిన రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, సిఎం ఒఎస్‌డి వేం నరేందర్ రెడ్డి, ఎంపి బలరాంనాయక్‌తో కలిసి మేడారం జాతర అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు ఏ ప్రభుత్వం ఇంత శ్రద్ధ వహించి పని చేయలేదని ఈ సందర్భంగా వారు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.



## హత్య కేసులో 9 మందికి జీవిత ఖైదు

ప్రజాపక్షం/భూపాలపల్లి : జయశంకర్ భూపాలపల్లి జిల్లా, కాటారం మండలం గంగారం గ్రామంలో భూమి తగాదాల నేపథ్యంలో జరిగిన హత్య కేసులో 9 మంది నిందితులకు ప్రిన్సిపల్ జిల్లా, సెషన్స్ న్యాయస్థానం, న్యాయమూర్తి సిహెచ్.రమేష్ బాబు జీవిత ఖైదు శిక్ష విధిస్తూ సంచలన తీర్పు వెలువరించారు. ఈ కేసులో నిందితుల వివరాలు ఇలా ఉన్నాయి. ఏ1 లౌడియా మహంకాళి నాయక్, ఏ2 లౌడియా భాస్కర్ నాయక్, ఏ3 లౌడియా సర్దార్ నాయక్, ఏ4 లౌడియా బాపు, A5 కౌసల్య (భార్య మహంకాళి నాయక్) ఏ6 లౌడియా సారయ్య నాయక్, ఏ7 బాబు నాయక్, ఏ8 లౌడియా సమ్మయ్య, ఏ9 అజ్మీర రాజ్ కుమార్ లకు జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెల్లడించారు. కొంతకాలంగా భూమి తగాదాల విషయమై ఇరు వర్గాల మధ్య తరచూ గొడవలు జరుగుతుండగా, 2021 జూన్ 19న ఉదయం 11 గంటల సమయంలో మాంజా నాయక్ తన కుమారులతో పత్తి చేనులో పనులు చేసుకుంటున్న సమయంలోపై నిందితులు గొడ్డళ్లు, కర్రలు పట్టుకుని కారం చల్లుతూ మాంజా నాయక్ అతని ఇద్దరు కుమారులు సారయ్య నాయక్, భాస్కర్ నాయక్లపై దాడి చేశారు. ఈ దాడిలో మాంజా నాయక్, అతని ఇద్దరు కుమారులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో కుమారుడు తీవ్ర గాయాలతో ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ హత్య కేసును పోలీసులు శాస్త్రీయంగా దర్యాప్తు చేసి పక్కా ఆధారాలతో కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎదులాపురం శ్రీనివాస్ సమర్థవంతంగా వాదనలు వినిపించడంతో, కోర్టు 9 మంది నిందితులను దోషులుగా నిర్ధారించి జీవిత ఖైదు శిక్షతో పాటు 31000/ రూపాయలు జరిమానా విధించింది. ఈ కేసు దర్యాప్తులో అప్పటి డీఎస్పీ బోనాల కిషన్ పర్యవేక్షణలో ఎస్ఐ సాంబమూర్తి, సిడిఒ కె.రమేష్, లైజనింగ్ ఆఫీసర్ జి.వెంకన్నలు కీలకంగా పని చేశారు. వారి సమర్థవంతమైన సేవలను జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అభినందించారు. ఈ తీర్పుతో నేరాలకు పాల్పడే వారికి కఠిన శిక్షలు తప్పవని, చట్టం ముందు ఎవరూ తప్పించుకోలేరని పోలీసులు స్పష్టం చేశారు.






### వృత్తి విద్యా నైపుణ్యం పెంపొందించుకున్న

## మానసిక దివ్యాంగ పిల్లలు

ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి

ప్రజాపక్షం/కరీంనగర్ : కరీంనగర్ జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న మానసిక దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులే స్వయంగా పేపర్ ప్లేట్లు, కొవ్వొత్తులు, సర్ఫ్, చాక్ పీస్, ఫినాయిల్ స్వయంగా తయారు చేస్తూ వృత్తి విద్యా నైపుణ్యం పెంపొందించుకుంటున్నారని కరీంనగర్ జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్టు చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడా వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం మానసిక దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థుల, తల్లిదండ్రులతో సమావేశం తిమ్మాపూర్ మండలం ఎల్.ఎం.డి కాలనీలోని పాఠశాల ఆవరణంలో ట్రస్ట్ చైర్మన్ మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగింది. ట్రస్ట్ చైర్మన్ చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. కరీంనగర్ నగరంలో 1989లో ఆనాటి స్వాతంత్ర్య సమరయోధులు అంతా కలిసి మానసిక దివ్యాంగుల పాఠశాలను ఏర్పాటు చేయడం కోసం సంకల్పించారని, 1990లో రిజిస్ట్రేషన్ చేసుకొని పాఠశాలను కరీంనగర్‌లో కొద్దికాలం నడిపారని అనంతరం 2005లో ఎల్ఎండి కాలనీలోని సొంత భవనాన్ని నిర్మించుకొని నిర్విరామంగా నడిపిస్తున్నామని, పాఠశాల ఏర్పాటు చేసి 35 సంవత్సరాలకు పైగా అవుతుందని, పాఠశాల నిర్వహణ కోసం, విద్యార్థుల సంరక్షణ కోసం అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా మొక్కవోని ధైర్యంతో ఎంతోమంది దాతల సహకారంతో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అనేకమంది ప్రజాప్రతినిధుల, అధికారుల సహాయ సహకారాలతో ఈ పాఠశాల నిర్వహించబడుతుందని, పిల్లల తల్లిదండ్రుల వద్ద నుండి ఎలాంటి ఫీజులు వసూలు చేయకుండా పాఠశాలను నిర్వహిస్తున్నామని, పిల్లల తల్లిదండ్రులే స్వచ్ఛందంగా పాఠశాల నిర్వహణ పిల్లల సంరక్షణ వారికి కావలసిన వస్తువుల రూపేనా తల్లిదండ్రులకు తోచిన విధంగా సహాయ సహకారాలు అందిస్తున్నారని వెంకటరెడ్డి తెలిపారు. మానసిక వైకల్యంతో ఉన్న విద్యార్థులు రోజురోజుకు అభివృద్ధి చెందుతున్నారని, వృత్తి విద్యా నైపుణ్యాన్ని పెంపొందించుకుంటున్నారని, స్వయంగా విద్యార్థులే పేపర్ ప్లేట్లు, చాక్‌పీసులు, సబ్బులు, కొవ్వొత్తులు, ఫినాయిల్, సర్ఫ్ తయారు చేస్తున్నారని వెంకటరెడ్డి తెలిపారు. కరీంనగర్ రెవెన్యూ డివిజన్ అధికారి మహేశ్వర్ మాట్లాడుతూ.. మానవ సమాజంలో ఎంతోమంది బ్రతుకుతున్నారని కానీ 'మానవసేవయే మాధవ సేవ'గా భావించి పనిచేస్తున్న వారంతా చిరకాలం గుర్తుండిపోతారని ఆ కోవకు చెందిన వ్యక్తి చాడ వెంకటరెడ్డి అని, మానసిక వైకల్యంతో బాధపడుతున్న పిల్లల కోసం ఒక పాఠశాల ఉండాలనే సంకల్పంతో, మానవత్వంతో ఎంతో మంది స్వాతంత్ర్య సమరయోధులంతా కలిసి పాఠశాలను స్థాపిస్తే ఆ పాఠశాలను నిరంతరం కొనసాగించడానికి పాఠశాల ట్రస్ట్ చైర్మన్, సభ్యులు, పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్న అధ్యాపకులు, సంరక్షిస్తున్న వారందరిని ఆర్దీవో ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ జ్యోతి ట్రస్ట్ సభ్యులు జి.కొమురెల్లారెడ్డి, ఎస్.జనార్ధన్ రావు, జి.భగవాన్, జెవి.రమణా రెడ్డి, డి.మధుసూదన్ రావు, మహాత్మనగర్ సర్పంచ్ పొన్నాల సంపత్, సర్పంచ్ కిషన్ రావు, సి.ఏ ఆదిత్యా, డిడబ్ల్యువో సరస్వతి, పాఠశాల ప్రిన్సిపాల్ సతీశ్, ఏ.వో బాల్ రాజు ఉపాధ్యాయ, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామ స్వరాజ్యమే లక్ష్యం.. ప్రజాసేవే పరమావధి!

నూతన సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు మంత్రి అడ్లూరి, ఎంపి చామల దిశానిర్దేశం

గోశాల నుంచి లక్ష్మీ నరసింహ గార్డెన్ వరకు కాంగ్రెస్ శ్రేణుల భారీ ప్రదర్శన



ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి : స్థానిక సంస్థలు ప్రజాస్వామ్యానికి పునాదులని, కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి బాటలు వేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యలు పిలుపునిచ్చారు. మంగళవారం యాదగిరి గుట్టలోని శ్రీ లక్ష్మీ నరసింహ ఫంక్షన్ హాల్లో ఆలేరు నియోజకవర్గ స్థాయి సర్పంచ్లు, ఉప సర్పంచ్ల ఆత్మీయ సన్మాన సభ అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు, ఎన్నికైన ప్రతినిధులను శాలువాలతో సత్కరించి, మెమొంటోలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'ప్రజలు మీపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకండి. క్షేత్రస్థాయిలో ప్రజలకు అత్యంత అందుబాటులో ఉండేది మీరే. సమస్యల పరిష్కారంలో సర్పంచ్లు, ఉప సర్పంచ్లు సమన్వయంతో పనిచేస్తూ ఆదర్శంగా నిలవాలి' అని సూచించారు. బీర్ల అయిలయ్య మాట్లాడుతూ.. 'ఆలేరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నంబర్ వన్ ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే నా సంకల్పం. నిధుల కేటాయింపులో గానీ, అభివృద్ధి పనుల్లో గానీ ప్రతి గ్రామానికి నా పూర్తి సహకారం ఉంటుంది' అని హామీ ఇచ్చారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం పరిధిలోని గోశాల నుంచి వైకుంఠ ద్వారం మీదుగా మున్సిపల్ కార్యాలయం పోలీస్ స్టేషన్ తాసిల్దార్ కార్యాలయం మీదుగా ఫంక్షన్ హాల్ వరకు కాంగ్రెస్ శ్రేణులు భారీ ఎత్తున ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈరసారపు యాదగిరి గౌడ్, బీర్ల శంకర్, కానుగు బాలరాజ్, మంగ సత్య నారాయణ, దుంబాల వెంకటరెడ్డి, సర్పంచ్ కళ్ళెం జహంగీర్ తదితరులు పాల్గొన్నారు



# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## కాలనీల సమస్యల పరిష్కారానికి కృషి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** కాలనీల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్‌లోని సాయిరాం కాలనీలో పార్టీ జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లోని కాలనీల్లో భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్, కాలనీ సంక్షేమ భవనం పై మొదటి అతస్తు నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి ఇంజనీరింగ్ విభాగం ఎఇ కార్తీక్, కాలనీ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షులు యంవై రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ఆదిత్య, కోటేశ్వర్‌రావు, బ్రహ్మచారి, రాములు, జలంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి సహకారం అందిస్తా

చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య



**ప్రజాపక్షం/షాబాద్:** సంకెపల్లిగూడ గ్రామ అభివృద్ధికి సహకారం అందిస్తానని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. మంగళవారం షాబాద్ మండల పరిధిలోని సంకెపల్లిగూడ గ్రామ సర్పంచ్‌గా కుమ్మరి లావణ్య చెన్నయ్య గెలుపొందిన సందర్భంగా ఎమ్మెల్యేను కలిసి మొక్కను అందజేశారు. అనంతరం సర్పంచ్‌గా గెలుపొందిన కుమ్మరి లావణ్య చెన్నయ్య, వార్డు సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మెన్ ఎలుగంటి మధుసుదన్ రెడ్డి, రాజేందర్, అంజి రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి



**ప్రజాపక్షం/అబ్దుల్లాపూర్ మెట్:** బందరావిరాల గ్రామ సర్పంచ్‌గా విజయం సాధించిన స్వేరో సర్కిల్ ఫౌండర్, స్వేరోస్ మాజీ వైస్ చైర్మన్ కందికంటి విజయ్ కుమార్ మంగళవారం బిఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు స్వేరోస్ వ్యవస్థాపకులు డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌ను ఆయన నివాసానికి ఆహ్వానించి ఆత్మీయంగా సన్మానించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్‌కు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ దిశానిర్దేశం చేస్తూ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, గ్రామాన్ని అన్ని రంగా ల్లో అభివృద్ధి చేసి, బందరావిరాలను ఒక ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి అని కోరారు. అలాగే విజయ్ కుమార్ గెలుపు కోసం అహర్నిశలు కష్టపడి, నిరంతరం శ్రమించిన బందరావిరాల స్వేరోస్ అందరినీ ప్రవీణ్ కుమార్ ప్రత్యేకంగా అభినందించి సన్మానం చేశారు. కార్యక్రమంలో స్వేరోస్ సభ్యులు,బిఆర్‌ఎస్ శ్రేణులు, వార్డ్ సభ్యులు పాల్గొన్నారు.

## కాలనీలకు మౌలిక వసతులు కల్పిస్తా

హయత్ నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** శుభోదయ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కారం చేయడంతో పాటు మౌలిక వసతులు కల్పించే విధంగా చర్యలు తీసుకంపటామని హయత్ నగర్ డివిజన కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం కాలనీల్లో కాలనీ వాసులతో కలిసి పలు సమస్యలు అడిగి తెలుస్తున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి మాట్లాడుతూ పార్కు అభివృద్ధి చేయడంతో పాటు వాకింగ్ ట్రాక్, గ్రీనరీ, లైటింగ్ వంటి సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. కాలనీల్లో నెలకొన్న ప్రతి సమస్యలను దశల వారిగా పరిష్కారం చేస్తామన్నారు. డ్రైనేజీ, రోడ్ల దుస్థితి, స్ట్రీట్ లైట్లు, తాగునీటి సమస్యలపై త్వరలోనే ఉన్నత అధికారులతో సమీక్ష నిర్వహించి సమస్యను పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి ఏఈ రమావత్ హేము నాయక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్, బిజెపి నాయకులు గంగాని శ్రీనివాస్, పొరంద మహేష్, కాలనీ అధ్యక్షులు ఇట్టబోయిన నర్సింహా, గాఫర్ తదితరులు పాల్గొన్నారు.


## హయత్‌నగర్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జ తక్షణమే ఏర్పాటు చేయాలి


కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, కళ్లెం నవజీవన్ రెడ్డి




**ప్రజాపక్షం/హయత్ నగర్ :** జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిర్మాణ పనులు ఎక్కడికక్కడ మధ్యలోనే నిలిచిపోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతూ అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితి నెలకొంది. ఈ సమస్యకు నిరసనగా హయత్ నగర్ డిపో, పరిసర ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా ఉన్న వివిధ కాలనీల సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో వందలాది కాలనీవాసులతో కలిసి బిజెపి కార్పొరేటర్లు నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో హయత్ నగర్ మరియు మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్ రెడ్డి, కొప్పుల నర్సింహా రెడ్డి రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు సామ రంగారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నవజీవన్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణ పనులు మధ్యలోనే నిలిపివేయడం వల్ల ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. భాగ్యలత నుండి హయత్ నగర్ వరకు ఎక్కడా ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ లేకపోవడంతో రోడ్డు దాటే సమయంలో అనేక మంది అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవలే రోడ్డు దాటే క్రమంలో ఓ మెడికల్ విద్యార్థిని మృతి చెందడం బాధాకరమన్నారు. రోడ్ విస్తరణ పనుల్లో భాగంగా హయత్ నగర్ సూర్య నగర్ , ఆర్‌టీసీ కాలనీ, ఆటోనగర్ పరిసర ప్రాంతాల్లో ఇప్పటికీ సర్వీస్ రోడ్లు పూర్తిగా నిర్మించకపోవడం వల్ల వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. సర్వీస్‌రోడ్లకు ఆనుకుని ఉన్న కాలనీ రోడ్లకు ఇప్పటివరకు బిటీ రోడ్డు లింక్‌లు నిర్మించకపోవడం వల్ల వాహనాలు అకస్మాత్తుగా ప్రధాన రోడ్డుపైకి రావాల్సి వస్తుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా అవసరమైన చోట్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, సర్వీస్ రోడ్లు, సురక్షిత క్రాసింగ్ సదుపాయాలతో పాటు కాలనీ రోడ్లకు బి టీ లింక్ రోడ్లు కూడా వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో వివిధ కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

# బుక్‌ఫెయిర్‌లో సిపిఐ నేత డాక్టర్ నారాయణ సందడి









**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ ఎన్‌టిఆర్ స్టేడియంలో ఏర్పాటుచేసిన 38వ హైదరాబాద్ బుక్ ఫెయిర్‌తో నగరంలో పండగ వాతావరణం నెలకొంది. రచయితలు, కవులు, ప్రముఖులతో పాటు విద్యార్థులు, ప్రజలు తండోపతండాలుగా బుక్‌ఫెయిర్‌కు తరలి వచ్చి, ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బుక్ స్టాళ్లను సందర్శించి నచ్చిన పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. మంగళవారం సిపిఐ జాతీయ నాయకులు బుక్‌ఫెయిర్‌కు వచ్చారు. బుక్ స్టాళ్లను సందర్శించిన అనంతరం పలువురు రచయితలతో పుస్తకాల ప్రాధాన్యతపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. బుక్‌ఫెయిర్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నవచేతన పబ్లిషింగ్ హౌస్ స్టాల్‌ను సందర్శించి పుస్తకాలపై ప్రజల అభిప్రాయం ఏలా ఉంది? యువత ఎలాంటి పుస్తకాలు కొనుగోలు చేస్తున్నారు? అనే వివరాలను స్టాల్స్ నిర్వహకులను అడిగి తెలుసుకున్నారు. బుక్‌ఫెయిర్ ఏర్పాట్లపై హర్షం వ్యక్తం చేస్తూ హైదరాబాద్ బుక్‌ఫెయిర్ సొసైటీని అభినందించారు. సకుటుంబ సమేతంగా బుక్ ఫెయిర్‌ను సందర్శించి నచ్చిన పుస్తకాలను కొనుగోలు చేయాలని ప్రజలకు డాక్టర్ నారాయణ సూచించారు.

# పెరుగుతున్న ధరలకనుగుణంగా హమాలీ రేట్లు

సివిల్ సప్లయిస్ హమాలీ వర్కర్స్ యూనియన్, (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్ డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హమాలీ రేట్లను క్వింటా ఎగుమతి, దిగుమతికి రూ.38లకు పెంచి, వెంటనే అమలు చేయాలని సివిల్ సప్లయిస్ హమాలీ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ కోరారు. 350 కిలోల బేల్స్ బండల్ ఒక్కటికి ఎగుమతి, దిగుమతికి రూ.200లకు పెంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రతి దసరా పండుగ సందర్భంగా హమాలీలకు ఇచ్చే స్వీటును రూ.900ల నుండి రూ.1200లకు పెంచాలన్నారు. తెలంగాణ స్టేట్ సివిల్ సప్లయిస్ హమాలీ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో ఈ నెల 18న సివిల్ సప్లయిస్ భవన్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించామని, దీనిపైన స్పందిస్తూ సివిల్ సప్లయ్ కమిషనర్ స్టీఫెన్ చర్చలకు ఆహ్వానించారని బాల్‌రాజ్ మంగళవారం పేర్కొన్నారు. హమాలీ కార్మికులకు ఇఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. హమాలీ కార్మికులు పనిచేస్తున్న క్రమంలో అనేకమంది ప్రమాదాలకు గురై కాళ్ళు, చేతులు విరిగి చనిపోయినప్పటికీ కార్పొరేషన్ పట్టించుకోవడం లేదని బాల్‌రాజ్ వివరించారు. దీనిపైన కమిషనర్ స్టీఫెన్ స్పందిస్తూ వెంటనే ఇన్సూరెన్స్ కంపెనీలను సంప్రదించి అందరికీ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించేలా ప్రయత్నిస్తామన్నారు. ప్రతి సంవత్సరం చెల్లించే బోనస్ రూ.7500ల నుండి రూ.10వేలకు పెంచాలని, అన్ని గోడౌన్లలో పని చేస్తున్న స్వీపర్లకు సమాన పనికి సమాన వేతనం రూ.12వేలు చెల్లించాలని బాల్‌రాజ్ కమిషనర్‌ను కోరారు. హమాలీ కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్ అమలవుతున్నప్పటికీ రిటైర్డ్ అయిన హమాలీ కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్ పెన్షన్ చెల్లించకుండా ప్రావిడెంట్ ఫండ్ అధికారులు, సివిల్ సప్లయిస్ అధికారులు అనేక రకాల అభ్యంతరాలతో ప్రతినెలా చెల్లించాల్సిన పెన్షన్ అందడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హమాలీ కార్మికులు పనిచేసి రిటైరైన వారి కుటుంబంలోని అర్హులైన వారిని 4వ తరగతి ఉద్యోగులుగా నియమించాలని కోరారు. యూనిఫాం, కుట్టు కూలీ రూ 2వేలకు పెంచాలని, గోడౌన్లలో కార్మికుల అవసరాన్ని బట్టి కార్మికులను నియమించుకునే అవకాశం హమాలీలకే ఉండాలని కోరారు. కాగా కమిషనర్ అన్ని డిమాండ్ల పట్ల సానుకూలంగా స్పందించారని, అన్ని సమస్యలనూ జనవరి చివరి వారంలో మరోసారి కూర్చోని పరిష్కరిస్తానని హామీ నిచ్చారని బాల్‌రాజ్ తెలిపారు. చర్చలలో సిఐటియు రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు, టిఆర్‌ఎస్‌కెవి హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు హమాలీ శ్రీను, అదిలాబాద్ జిల్లా అప్రోచ్, నిజామాబాద్ జిల్లా కార్యదర్శి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## 'మైదాన గిరిజనులకు చట్టసభల్లో రిజర్వేషన్లు తేవాలి'

**ప్రజాపక్షం /ఖైరతాబాద్ :** రాష్ట్ర మైదాన ప్రాంత గిరిజనులకు జనాభా ప్రాతిపదికన చట్టసభలలో రిజర్వేషన్లు కల్పించాలని బంజారాభారతి, అఖిల భారతీయ బంజారా మహా సేవా సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరాయి. మంగళవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బంజారా భారత్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాజీ ఎంపీ రవీంద్రనాయక్ మాట్లాడుతూ అన్ని రాష్ట్రాలలో బంజారాలను ఎస్టీలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. దేశ రాజధాని ఢిల్లీలోని వివిధ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న గిరిజన బంజారా విద్యార్థులకు ప్రభుత్వం రెండు హాస్టళ్ళను మంజూరు చేసి అన్ని సదుపాయాలు కల్పించాలని కోరారు. అక్రమణకు గురైన బంజారా భూములను తిరిగి అప్పగించాలన్నారు. బంజారాల గోర్బోలి భాషాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపాలని ఆయన కోరారు. త్వరలో బంజారాలలో చైతన్యం తీసుకురావడానికి 'బంజారా చైతన్యం రథయాత్ర' నిర్వహిస్తామన్నారు. సమావేశంలో కోర్ కమిటీ సభ్యులు చందులాల్, హన్మనాయక్, భోనా నాయక్, రవి, భీమానాయక్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా.. ఫిట్జీ టాలెంట్ టెస్ట్ రద్దు చేయాల్సిందే

ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి కార్యదర్శి శ్రీకాంత్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా డిసెంబర్ 28న నిర్వహించనున్న ఫిట్జీ రివార్డ్ టాలెంట్ టెస్ట్‌ను తక్షణమే రద్దు చేయాలని, సంబంధిత విద్యాసంస్థపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) హైదరాబాద్ జిల్లా సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జ్ విద్యాశాఖాధికారి (డిఈఓ) ఉషారాణికి ఎఐవైఎఫ్ ప్రతినిధి బృందం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం విద్యార్థులపై టాలెంట్, మెరిట్, స్కాలర్‌షిప్ పరీక్షలను విద్యా వ్యాపారంగా నిర్వహించరాదనే స్పష్టమైన నిబంధనలు ఉన్నాయని తెలిపారు. అయినప్పటికీ కార్పొరేట్ విద్యాసంస్థలు లాభాపేక్షతో ఇలాంటి పరీక్షలు నిర్వహిస్తున్నాయని ఆయన విమర్శించారు. 5వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థుల కోసం ఈ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తూ, ఒక్కో విద్యార్థి నుంచి రూ.300 చొప్పున ఎంట్రన్స్ ఫీజు వసూలు చేయడం అన్యాయమన్నారు. హిమాయత్‌నగర్, సికింద్రాబాద్, మాదాపూర్, అమీర్‌పేట్ ప్రాంతాల్లోని ఫిట్జీ కేంద్రాల్లో డిసెంబర్ 28న ఈ పరీక్షను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా జరిగే ఈ అనధికార పరీక్షను ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో అడ్డుకుంటామని శ్రీకాంత్ ఈ సందర్భంగా హెచ్చరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆలోచించి ఫిట్జీ లాంటి మోసపూరిత విద్యాసంస్థల పట్ల అప్రమత్తంగా ఉండాలని శ్రీకాంత్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా నేతలు కళ్యాణ్, అనిల్ కుమార్, అరుణ్ పాల్గొన్నారు.

# అవగాహనతోనే ప్రమాదాలకు అడ్డుకట్ట

అదనపు కలెక్టర్ శ్రీనివాస్





**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని, అవగాహనతోనే ప్రమాదాలకు అడ్డుకట్ట వేయొచ్చని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కె.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ కమిటీ మీటింగ్ నిర్వహించారు. ప్రధానంగా రోడ్డు ప్రమాదాల నివారణ, భద్రత చర్యలు అనే అంశంపై పూర్తి స్థాయిలో సమీక్ష నిర్వహించారు. పవర్ ప్రజెంటేషన్ ద్వారా రోడ్డు ప్రమాదాలు అధికంగా అవుతున్న ప్రాంతాలపై అవగాహన కల్పించారు. ప్రమాదాలను పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారించేందుకు పోలీస్ మున్సిపల్ నేషనల్ హైవే ఆర్అండ్‌బి, ఆర్‌టిసి అధికారులంతా సమిష్టిగా కృషి చేయాలన్నారు. ఇందులో ప్రజలు కూడా సహకరించాలన్నారు. వాహనదారులు, ప్రజలు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని సూచించారు. రోడ్డు ప్రమాదాలు అత్యధికంగా జరుగుతున్న ప్రాంతాల్లో వాటి నియంత్రణకు భద్రత చర్యలు చేపడతామన్నారు. ఇందుకు అవసరమైన చోట ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సంవత్సరం జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదాలు లేని జిల్లాగా రంగారెడ్డి జిల్లాను అధికారులంతా సమిష్టిగా తీర్చిదిద్దాలని సూచించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ అన్ని పని చేసేలా అధికారులు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ఎక్కడ ఏం అవసరం ఉన్నా అధికారులు భద్రత చర్యలు చేపట్టాలన్నారు. కళాశాల విద్యార్థులు స్కూల్ పిల్లలకు అవగాహన కల్పించాలని, ఎవరైనా రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. రాంగ్ రూట్లో వాహనాన్ని నడిపి ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దని సూచించారు. సమావేశంలో ఆర్అండ్‌బి, ట్రాన్స్పోర్ట్, నేషనల్ హైవే, పోలీస్, ట్రాఫిక్,ఆర్టీసీ అధికారులు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రహదారి ఆక్రమణపై విచారణ చేపట్టాలి



**ప్రజాపక్షం /ఖైరతాబాద్ :** గండిపేటలోని స్థానిక కాలనీ నివాసుల రాకపోకలకు ఉపయోగపడే వీధి రహదారిని ఆక్రమించుకొన్న వారిపై చర్యలు తీసుకోవాలని న్యాయవాది డా.బి.వంశీధర్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో స్థానిక నివాసులు సివిల్ ఇంజనీర్ రాఘవేంద్ర, నర్సింహారెడ్డి, బి. ప్రసన్నకమలతో కలిసి ఆయన మాట్లాడారు. గండిపేట్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 35, 38, 39లో దశాబ్దాలుగా ప్రజలు వినియోగిస్తున్న ఈ అంతర్గత రహదారిపై ఆక్రమణలు జరుగుతున్నాయన్నారు. ఈ రహదారి గండిపేట్ మెయిన్ రోడ్డు నుంచి అనేక ప్లాట్లు,ఇళ్లకు ప్రధాన మార్గంగాఉన్నదన్నారు. స్థానిక కార్పొరేటర్ గోపాల్ సునీతపై ఈ రహదారిని అక్రమించుకొన్నారని ఆరోపించారు. వెంటనే ప్రభుత్వాధికారులు రహదారి కబ్జాపై విచారణ చేపట్టి కాలనీవాసులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

# సైబారాబాద్‌లో తగ్గిన నేరాలు, పెరిగిన మోసాలు..

2025 వార్షిక నివేదిక వెల్లడించిన సిపి అవినాష్ మోహంతి

ట్రాఫిక్ చాలన్ల వసూళ్ళలో రూ.239 కోట్ల 37లక్షలతో రికార్డు



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** సైబారాబాద్ కమిషనరేట్ పరిధిలో 2025 సంవత్సరంలో నేరాలు తగ్గి, మోసాలు పెరిగాయని వార్షిక నివేదికను వెల్లడించారు. సైబారాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం 2025 క్రైం వార్షిక నివేదికను నిర్వహించారు. కార్యక్రమానికి సైబారాబాద్ సిపి అవినాష్ మోహంతి, డిసిపిలు విచ్చేసి వివరాలను వెల్లడించారు. ఈ ఏడాది సైబారాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో సైబర్ క్రైమ్స్ నేరాలు తగ్గాయని, పార్ట్ టైం జాబ్ ట్రేడింగ్ స్మిషింగ్ మోసాలు ఎక్కువగా పెరిగాయని 2024లో 11,914 కేసులు నమోదు కాగా 2025లో 7,636 కేసులు నమోదు అయినట్లు తెలిపారు. ఈ ఏడాది పార్ట్ టైం జాబ్ ఫ్రాడ్ 2079, ట్రేడింగ్ ఫ్రాడ్ 1256, స్మైషింగ్ ఫ్రాడ్ 689 ఫ్రాడ్లు , విష్టింగ్ కాల్ ఫ్రాడ్స్ 652 జరిగాయని గతంతో పోలిస్తే ఇది ఎక్కువేనని, కాని ఇంకా తగ్గించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

**సైబర్ క్రైమ్ డేటా..** 2023లో రూ.269 కోట్ల 48 లక్షలు ఉండగా, 2024లో రూ.793 కోట్ల 18 లక్షలు అని, 2025లో రూ.404 కోట్ల 61 లక్షలు అని తెలిపారు. మర్డర్ ఫర్ గెయిన్ కేసులు ..2024లో 126 కాగ, 2025లో 111 అని, దోపిడి, దొంగతనాలు 2024లో 94 కాగ, 2025లో 104 అని, మొత్తంగా మర్డర్లు, దోపిడి, దొంగతనాలు ఇతరత్ర దొంగతనాలు అన్ని కలసి 304 కేసులు 2025లో నమోదైనాయని ఆయన తెలిపారు.

**డ్రగ్స్ కేసులు..**ఈ ఏడాది డ్రగ్స్ కేసులలో రూ.25 కోట్ల 44 లక్షల విలువైన 8108 గ్రాముల డ్రగ్స్, 2712 కిలోల గంజాయిని ,ఎల్‌ఎస్డి 1766 గాములు, 476 గ్రాముల కోకెయిన్, 2163 గ్రాముల హెరాయిన్, సిథటిక్ ఇతర డ్రగ్స్‌లను పట్టుకొని నేరస్థులను అదుపులోకి తీసుకున్నామని డ్రగ్స్ కేసులలో 1228 మంది నిందితులను అరెస్ట్ చేశామని, 575 డ్రగ్స్‌కేసులు నమోదు చేశామని తెలిపారు.

**జైలు శిక్షలు..** ఈ ఏడాది 6745 కేసులలో 91 మందికి జైలు శిక్ష ఖరారు కాగ గత ఏడాదితో పోలిస్తే 47 వాతం కన్విక్షన్ రేటు పెరిగిందని తెలిపారు. డిజిటల్ అరెస్ట్ ఫ్రాడ్లలో ... 117 కేసులు నమోదు కాగ 96 లక్షల రూపాయలు రిఫండ్ ద్వారా వచ్చాయన్నారు.

రోడ్డు ఆక్సిడెంట్ట్స్‌లలో .. 2024లో రోడ్డు అక్సిడెంట్ లలో 2973 మంది మరణిస్తే 2025లో 3805 మంది మృతి చెందారని రోడ్డు అక్సిడెంట్‌లలో ఈ ఏడాది మరణాలు పెరిగాయని తెలిపారు.

**ట్రాఫిక్ చాలన్లలో ..** 2024లో రూ.111 కోట్ల 81 లక్షలు వసూళ్ళు కాగా, 2025లో రూ.239 కోట్ల 37 లక్షలు రికార్డు వసూళ్ళు అయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో సైబారాబాద్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస (ట్రాఫిక్) డా.గజరావు భూపాల్, మాదాపూర్ డిసిపి రితిరాజ్, బాలానగర్ డిసిపి కె.నరేష్ కుమార్, రాజేంద్ర నగర్ డిసిపి యోగేష్ గౌతమ్, శంషాబాద్ డిసిపి (క్రైమ్స్ ) ముత్యంరెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డిసిపి వైవిఎస్ సురేంద్ర, మహిళలు, పిల్లల భద్రత విభాగం డిసిపి సృజన కర్ణం ఎస్‌ఓటి డిసిపి శోభన్‌కుమార్ పాల్గొన్నారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కుల అందజేత



**ప్రజాపక్షం/కాప్రా** : మల్లాపూర్ డివిజన్ ప్రాంతాలకు చెందిన కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ స్కీమ్‌ల ద్వారా ప్రభుత్వం మంజూరు చేసిన చెక్కులను 17మంది లబ్దిదారులకు మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జిహెచ్ఎంసి ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో అందచేశారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, ఉప్పల్ మండల తహసీల్దార్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



## హై రిస్క్ కేసులను ముందస్తుగానే గుర్తించాలి: డిఎంహెచ్ఓ ఉమాగౌరి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి** : గర్భిణీల వివరాలను నమోదు చేసే దశలోనే హై రిస్క్ కేసులను ముందస్తుగానే గుర్తించి క్రమం తప్పకుండా ప్రసవ సమయం వరకు వైద్యుల పర్యవేక్షణ చేస్తూ అవసరమైన జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా ప్రసవ సంబంధిత మాతృ మరణాలను నివారించవచ్చని డిఎంహెచ్ఓ డా.ఉమాగౌరి తెలిపారు. జిల్లాలో ఇటీవలికాలంలో నమోదైన మూడు మాతృ మరణాలపై మంగళవారం సంబంధిత గాజుల రామారం, నారపల్లి, చర్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. గర్భిణీల విషయంలో వైద్య సిబ్బంది, అధికారులు ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు. అవసరమైతే ఏ మాత్రం జాప్యానికి తావు ఇవ్వకుండా మెరుగైన వైద్య సదుపాయాలు లభించే జిల్లా, రాష్ట్ర స్థాయి ఆస్పత్రులకు సమయానికి రిఫర్ చేస్తూ పంపించాలన్నారు. జిహెచ్ గైనకాలజిస్టు డా॥మాధవీలత, ప్రోగ్రాం వైద్యాధికారులు గీత, సత్యవతి, లావణ్య, సెక్షన్ ఇన్‌చార్జి, సంబంధిత కేసులకు సంబంధించిన సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.

## ఫోటో, వీడియో గ్రాఫర్ల హక్కులను సాధించుకుంటాం : సత్యనారాయణ

**ప్రజాపక్షం/శామీర్‌పేట** : ఫోటో వీడియో గ్రాఫర్ల హక్కులను సాధించుటకు నూతన కమిటీ కృషి చేస్తుందని ఫోటో వీడియో గ్రాఫర్ల నూతన కమిటీ అధ్యక్షులు మామిండ్ల సత్యనారాయణ అన్నారు. మంగళవారం అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని సంగీత్ ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి శామీర్‌పేట మండల ఫోటో వీడియో గ్రాఫర్ల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడుగా మామిండ్ల సత్యనారాయణ,ఉపాధ్యక్షులుగా కనకాల లక్ష్మ ణ్, బోగ సురేష్, ప్రధాన కార్యదర్శిగా గుండ్లపల్లి సాయిబాబుగౌడ్, సహాయ కార్యదర్శిగా గుండ్లపల్లి నర్సింహాగౌడ్, కోశాధికారిగా కమాటి రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు మామిండ్ల సత్యనారాయణ మాట్లాడుతూ ఫోటో వీడియో గ్రాఫర్ల సమస్యలను సాధించుటకు చర్యలు చేపడుతానని చెప్పారు. జిరాక్స్ షాపుల్లో ఫోటోలు తీస్తున్నారని వాటిని అరికట్టడానికి కృషి చేస్తానని అన్నారు. ఫోటో గ్రాఫర్ల సమస్యలను పరిష్కరించుటకు ప్రతి నెల అమావాస్య రోజున సమావేశాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఫోటోగ్రాఫర్లు ప్రసాద్, వెంకటేష్, మహేష్, బోగ రాజు, తదితరులు పాల్గొన్నారు.

## అదనపు స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా నరేష్ కుమార్



**ప్రజాపక్షం/బోడుప్పల్**: భారత ప్రభుత్వ అదనపు స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా నర్సింగోజు నరేష్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ లా అండ్ జ్యుడీషియల్ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. కేంద్ర ప్రభుత్వం తనను స్టాండింగ్ కమిటీ సభ్యులుగా నియమించడం సంతోషకరంగా ఉందని, తన పదవికి పూర్తి న్యాయం చేస్తానని నరేష్ కుమార్ తెలిపారు. కౌన్సిల్ మెంబర్‌గా నియమించిన కేంద్ర ప్రభుత్వానికి, సహకరించిన సీనియర్ న్యాయవాదులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## కుషాయిగూడలో డ్రగ్స్ పెడ్లర్లు అరెస్టు

**ప్రజాపక్షం/నాగారం**: నలుగురు డ్రగ్స్ పెడ్లర్లను అరెస్టు చేసిన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సైనిక్‌పురి కాఫీ కప్ షాప్ సమీపంలో ఎల్ఎస్‌డి(సైకోట్రోపిక్ డ్రగ్)బ్లాట్స్ అమ్మకానికి వచ్చిన నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన నిందితుడు మునియాడి సతీష్‌కుమార్ @ స్టీవ్ నుండి 12 మల్టీకలర్ ఎల్ఎస్‌డి బ్లాట్స్(0.2గ్రాములు)స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు డ్రగ్స్‌ను ఇతర వ్యక్తుల నుండి కొనుగోలు చేసి యువతకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. నిందితుడితో పాటు పాండా స్టీవ్‌హన్స్, హృతిక్ డెన్నిస్ మార్టిన్‌లను అదుపులోకి తీసుకుని నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని ఎన్‌డిపిఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



## లిమ్రా ఫర్నిచర్ షాపులో అగ్నిప్రమాదం

**ప్రజాపక్షం/ఉప్పల్** : ఉప్పల్ బాగాయత్‌లోని లిమ్రా ఫర్నిచర్ అండ్ సోఫా వర్క్ షాప్‌లో మంగళవారం మధ్యాహ్నం తీవ్రమైన అగ్నిప్రమాదం సంభవించింది. షెడ్డు ప్రారంభోత్సవానికి ముందు వెల్డింగ్ పనులు జరుగుతున్న సమయంలో వెల్డింగ్ స్పార్క్ ఫోమ్‌కి అంటుకోవడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే పరుపులు, ఫోమ్‌లు పూర్తిగా జ్వలించడంతో అగ్ని వేగంగా వ్యాపించింది. అగ్నిప్రమాదం జరుగుతుండగా పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌లలో నివసిస్తున్న వారు భయంతో బయటకు పరుగులు తీశారు. స్థానికులు వెంటనే ఫైర్ సర్వీస్‌కు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది నాలుగు అగ్నిమాపక వాహనాలతో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎల్బీ నగర్ అగ్నిమాపక అధికారి శ్రీధర్ మాట్లాడుతూ, మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకున్నాం.పెద్ద ఎత్తున ఆస్తి నష్టం చోటు చేసుకున్నా, ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు అని వెల్లడించారు. అలాగే ప్రతిఒక్కరూ ఫైర్ సేఫ్టీ అనుమతులు తీసుకోవాలని, ఫైర్ సేఫ్టీ కి సంబంధించిన పరికరాలు ఉంటే వెంటనే మంటలను అదుపులోకి తీసుకురావచ్చని అన్నారు. ఈ ఘటనపై బిజెపి నాయకులు బొంగులూరి శ్రీనివాస శర్మ, మహంకాళి లక్ష్మణ్, సంఘటనా స్థలాన్ని సందర్శించి ఉప్పల్ బాగాయత్ ప్రాంతంలో అనుమతులు లేకుండా నియమ నిబంధనలు పాటించకుండా ఏర్పడిన షెడ్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ప్రజలకు కమ్యూనిస్టులు అంటే ఎంతో గౌరవం


### సిపిఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉమా మహేష్



**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్**: సిపిఐ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 26న జరిగే సిపిఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించాలని మంగళవారం షాపూర్‌నగర్‌లో మండల కార్యదర్శి స్వామి నాయకత్వంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్ర్యం కోసం 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో ఏర్పడి సంపూర్ణ స్వరాజ్యం అనే నినాదాన్ని ఇచ్చిన ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ మాత్రమేనని అన్నారు. స్వతంత్ర్య పోరాటంలో నేడు వీరులుగా చెప్పుకొనే సుభాష్ చంద్రబోస్, చంద్రశేఖర్ ఆజాద్, భగత్‌సింగ్ లాంటి వారిని విప్లవకారులుగా మార్చిన సిద్ధాంతం మార్క్సిజం అని, ప్రజలందరికి సమాన హక్కులు, దోపిడీ వ్యవస్థను ధ్వంసంచేసి సహజ వనరులపై ప్రైవేటు ఆధిపత్యం తొలగించి ప్రజలకు పంచాలనే ఒక గొప్ప ఆశయంతో కమ్యూనిస్టు పార్టీ తన పోరాటాలను నిర్వహిస్తుందన్నారు. ఈ దేశంలో దున్నేవానికి భూమి, అందరికి ఇండ్ల స్థలాలు ఇవ్వాలని భూపోరాటం నిర్వహించి అనేక కోట్ల ఎకరాల భూమిని లక్షల కుటుంబాలకు పంపిణీ చేసిన చరిత్ర కేవలం సిపిఐకే చెందుతుందని అన్నారు. ఈ దేశంలో ప్రజలకు ఎన్నికల్లో డబ్బులు పంచకుండా మద్యం పంపిణీ చేయకుండా నిజాయితీగా పోటీ చేస్తున్నామని, అందుకే ప్రజలకు కమ్యూనిస్టులు అంటే ఇంకా గౌరవం ఉందన్నారు. నేడు ప్రజలు కమ్యూనిస్టులవైపు చూస్తున్నారని, సిపిఐ కార్యకర్తలు ఆవిర్భావ దినోత్సవాన్ని వాడవాడల ఘనంగా నిర్వహించి ప్రజలకు మన చరిత్రను వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి హరినాథ్, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు ప్రవీణ్, సిపిఐ నాయకులు నర్సింహారెడ్డి, మల్లేష్, శ్రీనివాస్‌రెడ్డి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# ముడుపులు అందితే ఓకే .. లేకుంటే కూల్చుడే..!

### బోడుప్పల్ ఆర్ఐ తీరుపై సర్వత్రా విమర్శలు





**ప్రజాపక్షం/బోడుప్పల్**: ప్రభుత్వ భూములు గజం కూడా కబ్జా కాకుండా చూసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా మండల స్థాయి అధికారుల తీరులో ఎలాంటి మార్పు రావడం లేదు.

వివరాల్లోకి వెళితే మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం బోడుప్పల్ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 63/1 లో ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు భూ కబ్జా దారులు బోగస్ పత్రాలను సృష్టించి ఎలాంటి అనుమతులు లేకుండానే రాత్రికి రాత్రే ఇండ్ల నిర్మాణం చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవడంలో రెవెన్యూ అధికారులు విఫలం అవుతున్నారు. ముఖ్యంగా దేవేందర్ నగర్ ఫేజ్2లో ప్రభుత్వ స్థలాన్ని ఓ వ్యక్తి తన ధనబలంతో అధికారులను మభ్యపెట్టి రాత్రికి రాత్రే ఇంటి నిర్మా ణం చేపట్టాడు. దానిపై చర్యలు తీసుకోవడంలో రెవెన్యూ అధికారులు మీన మేషాలు వేస్తుండడంతో అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ముడుపులు ముడితే ఒకే**

ప్రభుత్వ భూముల్లో చేపడుతున్న నిర్మాణాల విషయంలో అధికారులు పాత్ర చాలా ఉందని తెలుస్తుంది. నిర్మాణ దారులు ఇంటి నిర్మాణం చేపట్టిన సమయంలో రెవెన్యూ ఆర్ఐతో సంప్రదింపులు జరిపి ముడుపులు తీసుకుని కబ్జా దారులకు సహకరిస్తున్నారనేది అందరికి తెలిసిన బహిరంగ రహస్యం. అదే స్థలంలో ఎవరైనా పేదలు ఇంటి నిర్మాణం చేపడితే రెవెన్యూ అధికారులకు ఆమ్యామ్యాలు అందించకపోతే మాత్రం వారిపై స్వైర విహారం చేస్తూ కూల్చివేతలు చేపడుతున్నారని ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.

**ఆర్ఐ తీరుపై విమర్శలు** : ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని ఆర్ఐకి ఎవ్వరైనా ఫిర్యాదు చేస్తే నాకు ముందే తెలుసు... మీరు చెపితే నేను వినాలా ... గతంలో చాలామంది ఫిర్యాదు చేశారు. నాకు టైం లేదు, వారు కట్టుకుంటే మీకు ఏమి అవస రం. మేము చూసుకుంటాం అంటూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి.

**అక్రమ నిర్మాణాలను ఉపేక్షించం: డివిఎస్ఎస్ కృష్ణ,మేడిపల్లి తహసీల్దార్**

మేడిపల్లి మండలంలోని ప్రభుత్వ భూములలో ఎలాంటి అక్రమ నిర్మాణాలు జరిగినా ఉపేక్షించేది లేదని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

## అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ పూర్తిస్థాయి కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/శామీర్‌పేట** : అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ నూతన కమిటీని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ సారధ్యంలో ఎన్నుకోవడం జరిగిందని అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్ తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ పూర్తిస్థాయి కమిటీని ఎన్నుకున్నామని చెప్పారు.

అలియాబాద్ మున్సిపల్ అధ్యక్షుడుగా తుంకి రమేష్, ఉపాధ్యక్షులుగా భూమిరెడ్డి నవీన్‌రెడ్డి (మురహరిపల్లి), ముద్దం సుధాకర్‌రెడ్డి (అలియాబాద్), సిరిసాదుల శంకర్ (లాల్‌గడిమలక్‌పేట), చాట్లపల్లి నర్సింగరావు (లాల్‌గడిమలక్‌పేట), కొమ్ము వినోద్ (యాడారం), మున్సిపల్ కార్యదర్శులుగా కమతం కృష్ణారెడ్డి (అలియాబాద్), యాంజాల శశిధర్‌రెడ్డి (యాడారం), చిలుగురి మల్లేష్ (లాల్ గడిమలక్‌పేట), మున్సిపల్ సెకటరీలుగా నేమూరి అర్జున్‌గౌడ్ (లాల్ గడి మలక్‌పేట), ముద్దాపురం కృష్ణగౌడ్(అలియాబాద్), తుమ్మ యాదగిరి(అలియాబాద్), ముద్దం కిట్టుకుమార్‌రెడ్డి(అలియాబాద్), ఉప్పల చంద్రారెడ్డి (తుర్కపల్లి), కుడుముల వెంకటేష్ (మజీద్‌పూర్), మునిగొండ నవీన్ (యాడారం), అబ్బగౌని వినోద్ (మజీద్‌పూర్), కోశాధికారి దొండ మనోహర్ ముదిరాజ్, (అలియాబాద్), అధి కార ప్రతినిధులు మేడి మల్లేష్ (అలియాబాద్), ముద్దం ధర్మారెడ్డి అధికార ప్రతినిధి (అలియాబాద్), అనుబంధ సంఘాల అధ్యక్షులు గిర్మాపూర్ నర్సింగరావుగౌడ్ బిసి సెల్ అధ్యక్షుడు (తుర్కపల్లి), ముద్దం సంజీవరెడ్డి కిసాన్‌సెల్ అధ్యక్షుడు (అలియాబాద్), సయ్యద్ ఇనాయత్ మైనార్టి సెల్ అధ్యక్షుడు (లాల్‌గడి మలక్‌పేట్), అప్పవత్ రమేష్ నాయక్ ఎస్టి సెల్ అధ్యక్షుడు (తుర్కపల్లి తండా), సంగమైన కుమార్‌యాదవ్ సేవాదళ్ అధ్యక్షుడు (అలియబాద్), సరసం జైపాల్‌రెడ్డి లీగల్ సెల్ (న్యాయవాది), (మజీద్‌పూర్), జమాల్‌పూర్ బన్సీలాల్ ఐఎన్‌టియుసి బిసి (అలియాబాద్) లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని అలియాబాద్ మున్సిపల్ అధ్యక్షుడు తుంకి రమేష్ తెలిపారు.



## కోటి అరవై లక్షల మంది ఖాతాదారులకు లబ్ధి

**ప్రజాపక్షం/వికారాబాద్**: 'మీ డబ్బు మీ హక్కు' క్లయిమ్ చేసుకోని సొమ్మును తిరిగి పొందండి అని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉదయం 10గంటల నుండి 4గంటల వరకు జిల్లాలోని ఒక లక్షా 48వేల 511ఖాతాలలో 30.44కోట్ల రూపాయలు నిల్వ ఉన్నాయని తెలిపారు. వాటిలో నుండి ఈ ప్రోగ్రాం ద్వారా184 ఖాతాలలో కోటి అరవైలక్షల మంది ఖాతాదారులు తిరిగి పొందారని, ప్రజల సొమ్ము ప్రజలకే చేరాలనే ఉద్దేశంతో రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐఆర్‌డిఒ ఎఐ పిఎఫ్ ఆర్‌డిఎ డిఎఫ్ ఎస్ వంటి జాతీయ స్థాయి భీమ సంస్థలు బ్యాంకులు, బీమా సంస్థలు ఉమ్మడిగా ఈ శిబిరాలను నిర్వహిస్తున్నాయని, ప్రత్యేక శిబిరంలో ఆస్తుల క్లయిమ్ విధానాలపై మార్గ నిర్దేశం చేయడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఈడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ , డిఆర్ఒ మంగ్లీలాల్, ఎల్‌డిఎం యాదగిరి, ఆర్‌బిఐఊజిఎం చేతన్ గోరేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత నట్టల నివారణ మందుల పంపిణీ

**ప్రజాపక్షం/కోట్‌పల్లి**:వికారాబాద్ నియోజకవర్గంలోని కోట్‌పల్లి మండల పరిధిలోని బార్వాద్ గ్రామ సర్పంచ్ ప్రతిభ రమేష్ ఉచిత నట్టల నివారణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే ఉచిత నట్టల నివారణ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని బార్వాద్ గ్రామ మేకల, గొర్రెల పెంపకం దారులు వినియోగించుకోవాలని సూచించారు. జూనియర్ వెటర్నిటి అధికారి నర్సింహులు మాట్లాడుతూ నట్టల నివారణ వలన జీవాలు ఆరోగ్యంగా ఉంటాయని చిన్న పిల్లలు తొందరగా బరువు పెరుగుతాయని, నాణ్యమైన గొర్రెలు లభిస్తాయని అన్నారు. కోట్‌పల్లి మండలంలోని 23 తేదీ నుండి 31వరకు నట్టల నివారణ మందుల పంపిణీ చేపడుతామన్నారు.

## క్రిస్మస్ వేడుకలు శాంతియుతంగా జరుపుకోవాలి

### ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

**ప్రజాపక్షం/తాండూరు**:క్రిస్మస్ వేడుకలను ప్రతి ఒక్కరు శాంతియుతంగా జరుపుకోవాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి తాండూరు పట్టణంలోని మెట్రో ప్యాలెస్ ప్రభుత్వపరంగా నిర్వహించిన క్రిస్మస్ వేడుకలను జరుపుకున్నారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ముఖ్యఅథితులుగా హాజరైనారు. నియోజకవర్గ క్రైస్తవ సోదరీ సోదరులకు ముందస్తుగా శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేద క్రిస్టియన్‌లకోసం సంక్షేమ పథకాలు చేపట్టిందన్నారు.

ప్రపంచ శాంతికోసం ఏసు కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో క్రిష్టియన్ నాయకులు కిరణ్‌కుమార్, డిసిసి అధ్యక్షులు ధారాసింగ్, పట్టణ పార్టీ అధ్యక్షులు హబీబ్‌లాల, మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య, మాజీ కౌన్సిలర్‌లు ప్రభాకర్‌గౌడ్, రాము, పాస్టర్‌లు, క్రిష్టియన్ సోదరులు పాల్గొన్నారు.





## సర్పంచ్ శ్వేతను సన్మానించిన స్పీకర్

**ప్రజాపక్షం /వికారాబాద్** : మండల పరిధిలోని కొటలగుడ గ్రామ సర్పంచుగా పదవీ బాధ్యతలు స్వీకరించిన బచ్చంగారి శ్వేత సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట ప్రభుత్వం అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అందించే బాధ్యత సర్పంచ్‌లపై ఉంటుంది. ఇప్పుడు గెలిచిన సర్పంచ్‌లు అదృష్టవంతులు, రాష్ట్రంలో ఇందిరమ్మ పాలనతో ప్రజారంజక పరిపాలన జరుగుతున్నది. రాష్ట ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు ఇప్పుడు పదవిలో ఉన్న సర్పంచ్‌ల ద్వారా అమలుతాయి. కాబట్టి మీకు మంచి పేరు వస్తుంది. వికారాబాద్ నియోజకవర్గంలో 137గ్రామ పంచాయతీలలో ఎన్నికలు జరిగితే 105స్థానాలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. రాష్ట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయత్వంలోని ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటుగా ప్రజలకు మాపై నమ్మకం, విశ్వాసం ఉందన్నారు. సర్పంచు కోరిక మేరకు గ్రామంలో అండర్ డ్రైనేజీ కోసం కృషి చేస్తానని, గ్రామ అభివృద్ధికి తన వంతు కృషి చేయడం జరుగుతుందని అన్నారు. గ్రామనికి వచ్చే రెండు రోడ్ల పనులను త్వరలో పూర్తి చేయించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌టి సెల్ మండల అధ్యక్షులు రమేష్ నాయక్, నాయకులు వెమరెడ్డి, గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## యువతి వివాహానికి సాయం



**ప్రజాపక్షం/మల్కాజిగిరి**: తండ్రి లేని ఓ యువతి వివాహానికి గాను మల్కాజిగిరి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత ఉదార స్వభావంతో పట్టు చీర, పది వేల రూపాయల నగదు సాయంగా అందించారు. కాప్రా సర్కిల్ వంపుగూడ సాయిబాబా నగర్‌లో నివసించే ఫర్జానా బేగం వివాహం కోసం ఆమె నివాసానికి వెళ్లిన ఆయన తల్లి జాంగిర్ బిని కల్సి సాయం అందించారు.




## అట్రాసిటీ కేసుల్లో పోలీసుల నిర్లక్ష్యంపై ఎమ్మెల్యే మర్రి ఆవేదన

**ప్రజాపక్షం/మల్కాజిగిరి**: ఎస్సీ, ఎస్టీలపై అట్రాసిటీ కేసుల నమోదు, దర్యాప్తు తదితర అంశాల్లో ఉన్నతాధికారులతో సహా కిందిస్థాయి పోలీస్ సిబ్బంది అవలంబిస్తున్న నిర్లక్ష్యం, అలసత్వం తీవ్ర ఆందోళన కల్గిస్తోందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి ఆవేదన వ్యక్తం చేసారు. ఇటీవలి కేసులను పరిశీలిస్తే పోలీసులు అగ్రవర్ణాల బెదిరింపులు, ఒత్తిళ్లకు లోపడి పనిచేస్తూ బాధితులకు న్యాయం చేయకుండా నిందితులను తప్పించే యత్నాలకు పాల్పడుతున్నట్లు స్పష్టమవుతోందన్నారు. మల్కాజిగిరి ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం ఆర్డీఓ శ్యాంప్రకాష్ అధ్యక్షతన జరిగిన సబ్ డివిజనల్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్(ఎస్‌డివిఎంసి) సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో పాటు ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో డా. బిఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసిన బిఆర్ఎస్ నేతలు, కార్యకర్తలపై అక్రమకేసులు నమోదు చేసారని, వెంటనే ఈ కేసులను తొలగించాలని డిమాండ్ చేసారు. ఎస్సీ, ఎస్టీ దళిత కుటుంబాలు అధికంగా నివసించే వెంకటాపురం డివిజన్ యాదమ్మనగర్ ప్రాంతంలో విద్యుత్ సౌకర్యం సక్రమంగా ఉండక పోవటం వల్ల అక్కడి నిరుపేదలు అనేక అవస్థలకు గురవుతున్నారనా రు. ఎస్సీలకు కుల ధృవీకరణ పత్రాలను మంజూరు చేయటంలో తహసీల్దార్లు నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతగా విధులు నిర్వహించేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో పోలీసు విభాగానికి చెందిన ఏసిపి శంకరరెడ్డి, చక్రపాణి, వెంకటరెడ్డి, ఎస్ఐలు ప్రశాంత్, రవి, సుధీర్, తహసీల్దార్లు వాణి, రాములు, సీతారం, ఏఎస్‌డబ్ల్యు తులసి కృష్ణ, గోపి చంద్, పిడిఎ యాక్ట్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## క్రీస్తు అందించిన క్షమాగుణం పాటించాలి

### ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి**:క్రీస్తు అందించిన ప్రేమ, శాంతి, దయ, క్షమాగుణం ప్రతీ ఒక్కరూ తమ జీవితంలో పాటించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పిలుపునిచ్చారు. మంగళవారం కూకట్‌పల్లి శేషాద్రి నగర్ కమ్యూనిటీ హాల్లో నియోజకవర్గంలోని క్రిస్టియన్ మహిళలు పాస్టర్లతో కలిసి సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా పాల్గొని, క్రిస్టియన్ సోదర, సోదరీమణులకు బట్టలను పంపిణీ చేసి, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం క్రిస్మస్ సందర్భంగా నియోజకవర్గంలోని క్రిస్టియన్ ప్రజలకు భోజనాలు పెట్టి, బట్టలు పంపిణీ చేయడం ఆనవాయితీగా చేస్తున్నామన్నారు. కెసిఆర్ ప్రభుత్వ హయాంలో కులాలకు మతాలకు అతీతంగా ప్రతి మతానికి వాళ్ల ముఖ్యమైన పండుగలకు బట్టలు పంపిణీ చేసేవాళ్లమని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, రవీందర్‌రెడ్డి, సతీష్‌గౌడ్, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రీల్

## ‘డైమండ్ డెకాయిట్’ టీజర్ లాంచ్



‘డైమాండ్ డెలాయిట్’ సినిమా హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్‌లో సినీ ప్రముఖుల సమక్షంలో ఘనంగా టీజర్ రిలీజ్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హీరో పార్ధ గోపాల్ మాట్లాడుతూ నేను మా డైరెక్టర్ సూర్య జియాదవ్ గత మూడు సంవత్సరాలనుండి జర్నీ చేస్తూ చాలా ఒడి దుడుకులు ఎదుర్కొని చిత్రాన్ని తెర కెక్కించ్చినాము. మీ అందరి సమక్షంలో టీజర్ రిలీజ్ చేయటం చాలా ఆనందంగా వుంది, డైమండ్ డెకాయిట్ ఒక ఫ్యామిలీ ఎమోషనల్ డ్రామా 2026 ఫిబ్రవరిలో ప్రేక్షకులు ముందుకు తీసుకువస్తున్నాం అని అన్నారు. హీరోయిన్ మేఘన మాట్లాడుతూ ఈ సినిమాని చాలా కష్ట పడి పనిచేసాము. ముఖ్యంగా మా డైరెక్టర్, హీరో, ప్రొడ్యూసర్‌గా చేసిన పార్ధ గోపాల్ అందరం కష్ట పడి పనిచేసాము చెప్పారు. మ్యూజిక్ డైరెక్టర్ పెద్దపల్లి రోహిత్, డైరెక్టర్ సూర్య జి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ‘ఏదో ఏదో’ పాట ఆవిష్కరణ




‘లూసియా’ ఫేమ్ సతీష్ నినాసం హీరోగా, నిర్మాతగా భారీ ఎత్తున రూపొందిస్తున్న చిత్రం ‘ది రైజ్ ఆఫ్ అశోక’. ఈ సినిమాని వృద్ధి క్రియేషన్, సతీష్ పిక్చర్ హౌస్ బ్యానర్ల మీద వర్ధన్ హరి, జైష్ణవి, సతీష్ నినాసం సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇక ఈ మూవీకి వినోద్ వి ధోండలే దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో సతీష్ నినాసంకి జోడిగా ‘కాంతార’, ‘తమ్ముడు’ ఫేమ్ సప్తమి గౌడ నటిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన పోస్టర్స్, తాజాగా రిలీజ్ చేసిన పవర్ ఫుల్ సాంగ్ ‘వినరా మాదేవ’ అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. తాజాగా ప్రేమ జంటను కట్టి పడేసేందుకు ఓ మంచి రొమాంటిక్ మెలోడీతో టీం ముందుకు వచ్చింది. తాజాగా ‘ది రైజ్ ఆఫ్ అశోక’ నుంచి ‘ఏదో ఏదో’ అంటూ సాగే యుగళ గీతాన్ని విడుదల చేశారు. ‘ఏదో ఏదో’ అనే ఈ పాటను జయచంద్ర జె.డి. రచించారు. సాయి చరణ్, ఎం.డి. పల్లవి గాత్రం ఈ పాటను గుండెకు హత్తుకునేలా చేసింది. పూర్ణచంద్ర తేజస్వీ ఇచ్చిన బాణీ అయితే ఎంతో వినసొంపుగా ఉంది. సంతు మాస్టర్ కొరియోగ్రఫీ ఎంతో సింపుల్‌గా, చాలా ఎఫెక్టివ్‌గా కనిపిస్తోంది. లహరి మ్యూజిక్ ద్వారా ఆడియో మార్కెట్లోకి విడుదలైంది. త్వరలోనే ఈ మూవీకి సంబంధించిన అన్ని పనుల్ని పూర్తి చేసుకుని ఆడియెన్స్ ముందుకు తీసుకు వచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## జనవరి 14న నారి నారి నడుమ మురారి



శర్వానంద్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ నారి నారి నడుమ మురారి. రామ్ అబ్బరాజు దర్శకత్వం వహించారు. ఎకె ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రంలో సంయుక్త, సాక్షి వైద్య కథానాయికలుగా నటించారు. మేకర్స్ ఇప్పుడు సినిమా టీజర్ను లాంచ్ చేశారు. కథ శర్వా పాత్ర చుట్టూ తిరుగుతుంది, అతను ప్రేమలో పడతాడు, తన గర్ల్ ఫ్రెండ్ తండ్రిని వారి వివాహానికి ఆమోదించమని ఒప్పిస్తాడు. అంతా సజావుగా జరుగుతున్న సమయంలో, అతని మాజీ ప్రియురాలు అకస్మాత్తుగా ఆఫీస్ లోకి రావడంతో ఊహించని మలుపు తిరుగుతుంది. తరువాత జరిగే హ్యూమరస్ సంఘటనలు ఇద్దరు అమ్మాయిల మధ్య చిక్కుకున్న శర్వా పాత్ర.. వినోదాత్మక కథనం ఆకట్టుకున్నాయి బ్లాక్ బస్టర్ ‘సామజవరగమన’ను అందించిన తర్వాత, దర్శకుడు రామ్ అబ్బరాజు మరోసారి క్లీన్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ ను రూపొందించడంలో తన ప్రతిభ నిరూపించుకున్నాడు. నారి నారి నడుమ మురారి టీజర్ ప్రారంభం నుండి ముగింపు వరకు హ్యూమర్ తోనిండి ఉంది, ప్రేక్షకులను ఆద్యంతం అలరిస్తుంది. ప్రజెంట్ లవర్‌గా సాక్షి వైద్య, మాజీ లవర్‌గా సంయుక్త నటించారు. ఇద్దరూ తమ పాత్రలకు న్యాయం చేస్తూ ఆకట్టుకున్నారు. నరేష్ తనదైన స్టైల్ కామెడీతో సినిమాకు పెద్ద ప్లస్ అయ్యారు. సత్య, సునీల్, సుదర్శన్ లాంటి సహాయ నటులు హాస్యాన్ని మరింత పెంచుతూ వినోదాన్ని అందించారు. జనవరి 14న రిలీజ్ అవుతుంది. 5:49 ఫస్ట్ షో. తప్పకుండా అందరూ థియేటర్స్‌లో చూడండి. చాలా ఎంజాయ్ చేస్తారు.

## అందర్ని భయపెట్టే సినిమా - అఖిల్ రాజ్



‘ఈషా’ పేరుతో ఓ హారర్ థ్రిల్లర్‌ను ప్రేక్షకుల ముందుకు డిసెంబరు 25న రానుంది. ఈ సందర్భంగా హీరో అఖిల్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఈషా కథ చెప్పగానే ఎంతో షాకింగ్‌గా అనిపించింది. తప్పకుండా హారర్ థ్రిల్లర్ సినిమాలు చూస్తే వారికి కొత్త అనుభూతినిస్తుంది. సినిమాలో ట్విస్టులు చాలా ఉంటాయి. కథ చెప్పినప్పుడు నేను కూడా ఉలిక్కి పడ్డాను. ట్రైలర్ చూసినప్పుడు కూడా అదే ఫీలింగ్. లిటిల్‌హార్ట్స్, రాజు వెడ్స్ రాంబాయి సినిమాను విడుదల చేసిన వంశీ నందిపాటి, బన్నీవాస్ ఆ సినిమా విషయాల్లో ఎలా సక్సెస్ అయ్యారో. ఈసినిమా విషయంలో కూడా అంతే సక్సెస్ అవుతారని నమ్ముతున్నాను. తప్పకుండా అందర్ని భయపెట్టే సినిమా ఇది. వినయ్ అనే పాత్రను చేస్తున్నాను. నలుగురు చిన్నప్పటి స్నేహితుల్లో నేను ఒకర్ని. త్రిగుణ్, సిరి, హెబ్బా పటేల్, మైమ్ మధు వంటి మంచి నటులతో కలిసి నటించడం సంతోషంగా ఉంది. ఈ సినిమా నుంచి చాలా నేర్చుకున్నాను. దర్శకుడు శ్రీనివాస్ రాగా నుంచి కూడా చాలా నేర్చుకున్నాను. ప్రతి ప్రాజెక్టును ఓన్ చేసుకొని చేస్తాను. ఈ సినిమా పట్ల కూడా అంతే నమ్మకంతో ఉన్నాను. నా వైపు నుంచి ఉన్న ప్రమోషన్స్ కూడా చేస్తాను. కంటెంట్ బాగున్న సినిమాను ఎవరూ ఆపలేరు. అరకులో షూటింగ్ పూర్తయిన తరువాత ఓ పురుగు కుట్టి ఫీవర్ వచ్చింది. ఆ తరువాత నెల రోజులు జ్వరం వచ్చింది. అంతే తప్ప ఇంకే మీ అనుకోని సంఘటనలు జరగలేదు. సౌండ్ డిజైనింగ్ భయంకరంగా ఉంటుంది. అందరూ భయపడే విధంగా ఉంటుంది. నిజంగా హార్ట్ వీక్‌గా ఉన్నవాళ్లు ఈ సినిమాను చూడలేరేమో. సఖియా అనే వెబ్సిరిస్ సంబంధించి గ్లింప్స్ చూసి దర్శకుడు నన్ను ఎంపిక చేసుకున్నాడు. చిన్నప్పుడు నుంచి నాకు భయం ఉండేది. ఏజ్ పెరుగుతున్న కొద్ది ఆ భయం పోయింది. ప్రస్తుతం నాలుగైదు ప్రాజెక్టులు చర్చల దశలో ఉన్నాయి. ఆన్‌సెట్స్‌లో తరుణ్‌భాస్కర్, అనుపమతో కలిసి ఓ సినిమా చేస్తున్నాను భద్రి దర్శకుడు.

## ‘రాజుగారి పెళ్లి’ అంటున్న నవీన్ పొలిశెట్టి




నవీన్ పొలిశెట్టి హీరోగా మీనాక్షి హీరోయిన్‌గా నిర్మిస్తున్న అనగనగా ఒక రాజు సినిమా నుంచి సెకండ్ సాంగ్ రిలీజ్ చేస్తున్నారు. వెడ్డింగ్ పాటగా రాజుగారి పెళ్లిరో అనే పాట ప్రోమోను విడుదల చేశారు. ఈ పూర్తి సాంగ్‌ను ఈనెల 26న విడుదల చేయనున్నారు. చిత్రానికి సంబంధించిన అన్ని పనులు పూర్తి చేసి జనవరి 14న సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. మిక్కిజే మేయర్ సంగీతం అందించిన ఈ సినిమాకు నిర్మాతలు నాగ వంశీ, సాయి సోజన్య. సితార ఎంటర్టైన్మెంట్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్, శ్రీకార స్టూడియోస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

## ‘చిన్ని చిన్ని’ సాంగ్ రిలీజ్



మలయాళ స్టార్ హీరో మోహన్ లాల్ నటిస్తున్న ‘వృషభ’. ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని ఈ నెల 25న గీతా ఫిలిం డిస్ట్రిబ్యూషన్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొస్తోంది. ‘వృషభ‘ సినిమాను దర్శకుడు నందకిషోర్ మలయాళం, తెలుగులో రూపొందించారు. ‘వృషభ‘ సినిమా నుంచి బ్యూటిఫుల్ లవ్ సాంగ్ ‘చిన్ని చిన్ని..’ రిలీజ్ చేశారు. సమర్జిత్ లంకేష్, నయన్ సారికపై చిత్రీకరించిన ఈ లవ్ సాంగ్‌కు కల్యాణ్ చక్రవర్తి క్యాచీ లిరిక్స్ రాయగా, అనురాగ్ కులకర్ణి మంచి లవ్ ఫీల్‌తో పాడారు. సామ్ సీఎస్ కంపోజ్ చేశారు. ‘చిన్ని చిన్ని..’ ఎవ్వరే నువ్వెవ్వరే చెప్పవే ఓ దేవత, ఏమిటే ఇదేమిటే ఓ మాయగా ఉన్నదే, ఏ శరానివో నీవు, ఏ స్వరానివో నీవు, ఓ వరానివో నీవు, తేలే వీలే లేదే, నా ప్రయాణమే మారి, నీ పదాలలో చేరి, నా ప్రపంచమే స్మృతివే, ఎవ్వరే నువ్వెవ్వరే, నీ ఆలోచనే నా ఆలాపనైపోయో, చిన్ని, చిన్ని నా చిన్ని చిన్ని నా కన్నీ నువ్వే అయిపోయావే..’ అంటూ పాట సాగుతుంది.

అవినాష్ తిరువీధుల హీరోగా, దర్శకుడిగా పరిచయమవుతున్న సినిమా ‘వానర’. ఈ చిత్రంలో సిమ్రాన్ చౌదరి హీరోయిన్‌గా నటిస్తోంది. నందు ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. ‘వానర’ చిత్రాన్ని శంతను పత్తి సమర్పణలో సిల్వర్ స్క్రీన్ సినిమాస్ బ్యానర్‌పై అవినాష్ బుయానీ, ఆలపాటి రాజా, సి.అంకిత్ రెడ్డి నిర్మిస్తున్నారు. సాయిమాధవ్ బుర్రా డైలాగ్స్, వివేక్ సాగర్ మ్యూజిక్ ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణ కాబోతున్నాయి. మైథలాజికల్ రూరల్ డ్రామా కథతో తెరకెక్కిన ‘వానర‘ సినిమా న్యూ ఇయర్ సందర్భంగా జనవరి 1న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్ ’లబోరే లబోరే..’ రిలీజ్ చేశారు.

## ‘లబోరే లబోరే..’ పాట విడుదల



## ఎన్నో రూమర్లు వచ్చాయి! శృతి హాసన్..



శృతి హాసన్.. గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. లోకనాయకుడు కమల్ హాసన్ కూతురిగా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన శృతి హాసన్ చాలా తక్కువ టైమ్‌లోనే తనకంటూ సొంత గుర్తింపు తెచ్చుకుని నటిగా, గాయనిగా, మ్యూజిక్ డైరెక్టర్‌గా పలు రంగాల్లో సత్తా చాటుతోంది. అయితే శృతి గతంలో కొన్ని సార్లు ప్రేమలో పడి, దాని వల్ల చాలా తీవ్రంగా బాధపడిన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని తానే చాలా ఓపెన్‌గా మాట్లాడుతూ, తన లవ్ స్టోరీస్ వేరే వాళ్లకు సిల్లీగా అనిపించినా, తనకు వేరేగా ఉంటుందని చెప్పిన అమ్మడు తన తండ్రి ప్రతీ విషయంలోనూ తనకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని తెలిపింది. తన తండ్రి తనకు ఏ విషయంలోనూ అడ్డు చెప్పలేదని, దాని వల్ల తానెప్పుడూ జీవితంలో ఇబ్బంది పడింది లేదని శృతి చెప్పుకొచ్చింది. నాపై ఎన్నో రూమర్లు వచ్చాయని, వాటిలో కొన్ని నిజాలుంటే, కొన్ని అబద్ధాలుంటాయని, కానీ తన తండ్రి మాత్రం ఎప్పుడూ తనకు సపోర్ట్ గానే నిలిచారని, తన తండ్రి ఓ వ్యక్తిగా ఎంతో మందిలో స్ఫూర్తిని నింపారని, అందుకే తనకు తన తండ్రి అంటే ఎంతో అభిమానమని చెప్పింది శృతి. సినీ బ్యాక్ గ్రౌండ్ ఉన్న ఫ్యామిలీ నుంచి వచ్చినప్పటికీ, తాను మాత్రం సొంతంగానే ఈ పొజిషన్‌కు వచ్చినట్టు శృతి పేర్కొంది.

# పివి నిజమైన జాతీయవాది

సీనియర్ జర్నలిస్ట్ ఎ.కృష్ణారావు




**న్యూఢిల్లీ :** విద్యార్థిగా ఉండగానే నిజాం ప్రభుత్వ నిషేధాజ్ఞలను ధిక్కరించి వందేమాతర గీతాలాపన చేసిన మాజీ ప్రధాని పివి నరసింహారావు నిజమైన జాతీయవాది అని సీనియర్ జర్నలిస్ట్ ఎ.కృష్ణారావు అన్నారు. పివి నరసింహారావు వర్ధంతి సందర్భంగా శ్యామాప్రసాద్ ముఖర్జీ రీసెర్చ్ ఫౌండేషన మంగళవారం క్యానిస్టిట్యూషన క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన కీలక ప్రసంగం చేస్తూ.. ఆర్యసమాజ్, వందేమాతరం ఉద్యమాలు స్వాతంత్ర్య ఉద్యమం, నిజాం వ్యతిరేక పోరాటం పీవీపై ప్రగాఢ ప్రభావాన్ని చూపాయని ఆయన అన్నారు. నెహ్రూ నుంచి రాజీవ్ గాంధీ వరకు స్వాతంత్ర్యఅనంతర సామాజిక, ఆర్థిక చరిత్ర ఒక ఘట్టమైతే ఆధునిక భారత దేశ చరిత్ర పీవీతోనే ప్రారంభమైందని ఆయన అన్నారు. భారతను తీవ్ర ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించిన పీవీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో దేశం ఒంటరిగా మిగిలిపోకుండా ఒక అభివృద్ధి చెందిన దేశంగా మారేందుకు బాటలు వేశారన్నారు. టెలికమ్యూనికేషన విప్ల వం, మౌలిక సదుపాయాల రంగాల్లో భారీ పెట్టుబడులు, ఐటీ విప్లవం, ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం వంటి అనేక పరిణామాలు పివి హయాంలోనే మొదలయ్యాయని చెప్పారు. నరేగాకు ముందే 1991లోనే జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ప్రవేశపెట్టడం, పంచాయతీరాజ్ వ్యవస్థను పటిష్టం చేయడం, మహిళలకు స్థానిక సంస్థలలో 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం ఇవన్నీ పివి హయాంలోనే జరిగాయన్నారు. బాబ్రీ మసీదు కూల్చివేత తర్వాత ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోకపోతే రామమందిర నిర్మాణం సాధ్యమయ్యేదీ కాదని ఆయన చెప్పారు. కాశ్మీర్, పంజాబ్ సమస్యలను పరిష్కరించడం, మైనారటీ ప్రభుత్వంలో ఉన్న ఏకాభిప్రాయంతో నిర్ణయాలు తీసుకోవడం పివికే చెల్లిందని చెప్పారు.

ఈ సమావేశంలో మాట్లాడిన రాజ్యసభ బిజెపి ఎంపి సుధాంశు త్రివేది, ఆల్ ఇండియా యాంటీ టెర్రరిస్ట్ ఫ్రంట్ చైర్మన మణీందర్‌జీత సింగ్ బిట్టా.. పివి దేశానికి చేసిన సేవలను కొనియాడారు. వాజ్‌పేయితో పీవీకి సత్సంభందాలు ఉండేవని, వాజ్‌పేయిని జెనీవాకు పంపి కాశ్మీర్‌పై పాక్‌ను ఎండగట్టే బాధ్యతను అప్పజెప్పారని సుంధాశు త్రివేది అన్నారు.

# సిపిఐకి రూ.50 వేల విరాళం





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మగ్దూం భవన్‌లో మంగళవారం సిపిఐ రాష్ట్ర పార్టీకి భూరి విరాళం అందింది. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గడ్డమీది చంద్రమోహన్ గౌడ్ సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావుకు రూ.50 వేల నగదు విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ సీనియర్ నాయకులు డాక్టర్ కె. నారాయణ, కూనంనేని సాంబశివ రావులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర నాయకులు రాయబండి పాండురంగ చారి సిపిఐ రాష్ట్ర పార్టీకి రూ.10 వేల చెక్కును విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ కె. నారాయణ, కూనంనేని సాంబశివ రావు విరాళాలు అందించిన చంద్రమోహన్ గౌడ్, రాయబండి పాండురంగచారిలను అభినందించారు. పార్టీ కార్యక్రమాలకు ఇటువంటి సహకారం మరింత బలాన్ని చేకూరుస్తుందని వారు అన్నారు.

# చదువుకున్న పాఠశాలకు ఆర్వో ప్లాంట్ విరాళం

152 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ అందచేసిన లక్ష్మీ రామచందర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రామ అభివృద్ధికి తన సహకారం ఎప్పుడు ఉంటుందని హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ మేనేజర్ లక్ష్మీ రామచందర్ అన్నారు. చదువుకున్న మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మండలం సూరారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు తన తల్లిదండ్రులు శామమ్మ, నరహరిల జ్ఞాపకార్థం ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్‌ను మంగళవారం పాఠశాలకు అందజేసి ప్రారంభించారు.. గ్రామీణ ప్రాంత పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు కొంత ఆసరాగా ఉండాలనే ఉద్దేశంతో తన సొంత గ్రామంలో చదువుకున్న పాఠశాలకు మినరల్ వాటర్ ప్లాంట్ అందజేశామన్నారు. అదేవిధంగా పాఠశాలలో చదువుకుంటున్న 152మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ అందచేసిన ఆయన భవిష్యత్తులో అందిస్తానని లక్ష్మీ రామచందర్ పే ర్కొన్నాడు. పాఠశాలలో ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసినందుకు లక్ష్మీ రామచందర్ కు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చిలుక నాగరాజు, ఉపసర్పంచ్ మల్లేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిరెడ్డి, గ్రామ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎందుకంత పట్టుదల?

(మొదటి పేజీ తరువాయి)

ఇటీవలి వివరణలు మరిన్ని ప్రశ్నలుస సందేహాలను రేకెత్తిస్తున్నాయన్నారు. ఆరావళీల 1.44 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో కేవలం 0.19 శాతం మాత్రమే ప్రస్తుతం మైనింగ్ లీజుల కింద ఉందని మంత్రి చెబుతున్నారని, ఇది ఇప్పటికే 68,000 ఎకరాలు, అంటే ఒక విశాలమైన ప్రాంతమని అన్నారు. అయితే 1.44 లక్షల చదరపు కిలోమీటర్ల సంఖ్య తప్పుదోవ పట్టించేదిగా ఉందని, ఇది నాలుగు రాష్ట్రాలలో మంత్రిత్వ శాఖ గుర్తించిన 34 ఆరావళి జిల్లాల మొత్తం భూభాగాన్ని విస్తరించి ఉందన్నారు. 34 జిల్లాలకుగానూ 15 జిల్లాలలో ఆరావళీల కింద ఉన్న ప్రాంతం మొత్తం భూభాగంలో 33 శాతంగా ఉందని రమేష్ పేర్కొన్నారు. ఈ ఆరావళీ ప్రాంతాలలో ఎంత భాగాన్ని కొత్త నిర్వచనం కింద మినహాయించి, మైనింగ్, ఇతర అభివృద్ధి పనుల కోసం అందుబాటులోకి తెస్తారనే దానిపై ఎటువంటి స్పష్టత లేదన్నారు. స్థానిక ప్రొఫైల్‌లను బేస్‌లైన్‌గా తీసుకుంటే, మంత్రి సూచిస్తున్నట్లుగా, 100+ మీటర్ల ఎత్తైన కొండలు రక్షణ కవచం నుండి మినహాయించబడతాయి. సవరించిన నిర్వచనంతో ఢిల్లీ—ఎన్‌సిఆర్‌లోని ఆరావళిలో ఉన్న చాలా కొండ ప్రాంతాలు రియల్ ఎస్టేట్‌కు ద్వారాలు తెరవబడుతాయని, ఈ చర్య పర్యావరణ ఒత్తిడిని పెంచుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సరిస్కా టైగర్ రిజర్వ్ సరిహద్దులను మైనింగ్‌కు అనుమతించే చర్యకు నాయకత్వం వహిస్తున్న మంత్రి, తప్పనిసరిగా ఒకదానితో ఒకటి అనుసంధానించబడిన పర్యావరణ వ్యవస్థను విచ్ఛిన్నం చేయడం దాని పర్యావరణ విలువను దెబ్బతీస్తుందనే ప్రాథమిక ఆందోళనను విస్మరిస్తున్నారని, ఇతర చోట్ల ఇటువంటి విచ్ఛిన్నం ఇప్పటికే వినాశనానికి కారణమవుతోందని ఆయన అన్నారు. కాగా, సోమవారం యాదవ్ ఆరావళి కొత్త నిర్వచనం అంశంపై కాంగ్రెస్ తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తోందని ఆరోపించారు. పర్వత శ్రేణిలోని 0.19 శాతం ప్రాంతంలో మాత్రమే చట్టబద్ధంగా మైనింగ్ నిర్వహించవచ్చన్నారు. ఇదిలా ఉండగా, ఈ ఏడాది నవంబరులో పర్యావరణ మంత్రిత్వ శాఖ నేతృత్వంలోని కమిటీ సిఫార్సుపై సుప్రీం కోర్టు ఆరావళి కొండలు, ఆరావళి శ్రేణి దేనిని కలిగి ఉంటుందనే దానిపై ఏకరీతి చట్టపరమైన నిర్వచనాన్ని ఆమోదించింది. ఈ నిర్వచనం ప్రకారం... ‘ఆరావళీ కొండ అనేది దాని స్థానిక చుట్టుపక్కల భూభాగం కంటే కనీసం 100 మీటర్ల ఎత్తులో ఉన్న భూరూపం. ‘ఆరవల్లి శ్రేణి అనేది ఒకదానికొకటి 500 మీటర్ల లోపల రెండు లేదా అంతకంటే ఎక్కువ కొండల సమూహాన్ని సూచిస్తుంది.

## భవిష్యత్తు ప్రశ్నార్థకమే

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ.. సింగరేణి సంస్థపై ఆధారపడి దాదాపు 89వేల మంది జీవిస్తున్నారని, ప్రైవేట్‌తో పోటీ పడకపోతే వాళ్ల భవిష్యత్తు ఇబ్బందుల్లో పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం విద్యుత్ రంగం వైపు దృష్టి పెట్టిన సింగరేణి మరో అడుగు ముందుకు వేసి గ్రీన్ ఎనర్జీ ఉత్పాదన, సోలార్, హైడల్ ఎనర్జీ, బ్యాటరీ స్టోరేజ్, హైడ్రోజన్ పవర్, క్రిటికల్ మినరల్స్, రేర్ ఎర్త్ మినరల్స్ ప్రొడక్షన్ వంటి తదితర రంగాల వైపు దృష్టి పెట్టి సంస్థ పై ఆధారపడి జీవిస్తున్న ప్రతి కుటుంబానికి భరోసా కల్పించాలని సూచించారు. క్రమేపి బొగ్గు ఆధారిత పరిశ్రమల సంఖ్య తగ్గుతుందని, దూసుకుపోతున్న టెక్నాలజీకి అనుగుణంగా సింగరేణి సంస్థ పరుగులు పెట్టాలన్నారు. ముఖ్యంగా గ్రాఫైట్, కాపర్ ఉత్పత్తులపై దృష్టి పెట్టాలని కోరారు. ఇప్పటికే కర్ణాటకలో కాపర్ ఉత్పత్తి, గోల్డ్ మైన్స్ సర్వే బాధ్యతలు స్వీకరించిన సింగరేణి మరింత వేగంతో పోటీ ప్రపంచంలోకి రావాలని ఆహ్వానించారు. సింగరేణి జెండా ప్రపంచవ్యాప్తంగా ఎగిరేలా ప్రతి ఒక్కరు కష్టపడాలని పిలుపునిచ్చారు. జైపూర్‌లో విద్యుత్ ఉత్పాదన ప్లాంట్లు ఏర్పాటు చేశామని, ఎక్స్పర్ట్స్ సూచనలు, సలహాలు తీసుకుని ముందడుగు వేయాలని కోరారు. ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళితేనే సంస్థను కాపాడుకోగలమని తెలిపారు. ఆ దిశగా సింగరేణి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని విజ్ఞప్తి చేశారు.

**సంక్షేమం వైపు కూడా..**

సింగరేణి వ్యాపారం ఒక్కటే కాకుండా ప్రజల సంక్షేమం వైపు కూడా దృష్టి పెడుతుందని డిప్యూటీ సిఎం తెలిపారు. ప్రభావిత గ్రామల అభివృద్ధి కోసం సింగరేణిలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఎక్కడా నష్టం జరగకుండా బొగ్గు పావుల నిర్వహణ జరిగే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు.

**శైలో బంకర్ తొలగించండి..**

సత్తుపల్లి మండలం, కిష్టారం పంచాయతీలోని అంబేద్కర్ నగర్ ప్రజలకు ప్రాణ సంకటగా మారిన శైలోబంకర్ సమస్య పరిష్కరించాలని శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ కోరారు. అంబేద్కర్ నగర్ ను రీ హ్యాబిటేషన్ జరపాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఏరియాలో ఇప్పటికే చాలామంది ప్రాణాలు కోల్పోయారని, ఇంకా అనేకమంది శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బంది పడుతున్నట్లుగా ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్య వెంటనే పరిష్కరించాలని కోరారు..

## రైతులను ఆదుకోండి

(మొదటి పేజీ తరువాయి)

రైతుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణలో సోయాబీన్ ఒక ప్రధాన ఖరీఫ్ పంట అని, ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో గిరిజన రైతులు పెద్ద ఎత్తున ఈ పంటపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. 2025—26 సీజన్‌లో సుమారు 3.66 లక్షల ఎకరాల్లో సోయాబీన్ సాగు జరగగా, దాదాపు 2.79 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా ఉందన్నారు. అయితే, కోత దశలో కురిసిన భారీ వర్షాల వల్ల సోయాబీన్ పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందని, దీంతో పెద్ద మొత్తంలో పంట ఎఫ్ఎక్యూ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా లేకుండా మారిందని వివరించారు. ఆదిలాబాద్, నిర్మల్, కామారెడ్డి, సంగారెడ్డి వంటి జిల్లాల్లో ప్రధానంగా గిరిజన రైతులు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో వర్షాల కారణంగా సుమారు 36 వేల మెట్రిక్ టన్నుల సోయాబీన్‌ను ధర మద్దతు పథకం (పిఎస్ఎస్) కింద కొనుగోలు చేసేందుకు అనుమతించాలని కేంద్రాన్ని కోరారు. అవసరమైతే ఎఫ్ఎక్యూ నిబంధనల్లో సడలింపులు ఇస్తూ, అమలుకావాల్సిన ధర విధానాన్ని రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. అప్పుడే రైతులు దళారుల చేతిలో నష్టపోకుండా, గిట్టుబాటు ధర పొందగలుగుతారని మంత్రి పేర్కొన్నారు.

**నాఫెడ్ ద్వారా మొక్కజొన్నను కేంద్రం కొనుగోలు చేయాలి**

అదేవిధంగా, మొక్కజొన్న రైతుల పరిస్థితిపై కూడా మంత్రి తుమ్మల కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణలో ఈ సంవత్సరం మొక్కజొన్న సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని, మార్కెట్లకు భారీగా పంట రావడంతో ధరలు కనీస మద్దతు ధర కంటే చాలా తక్కువకు పడిపోయాయని తెలిపారు. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు సుమారు 2.96 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కొనుగోలు చేసి, వేలాది రైతులకు అండగా నిలిచిందన్నారు. అయితే, ఈ కొనుగోళ్ల వల్ల రాష్ట్ర ఖజానాపై ఇప్పటికే దాదాపు రూ.750 కోట్ల ఆర్థిక భారం పడిందని తెలిపారు.ఈ నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వ సంస్థ నాఫెడ్ ద్వారా రాష్ట్రం కొనుగోలు చేసిన మొక్కజొన్నను ఎథనాల్, డిస్టిల్లరీ పరిశ్రమలకు సరఫరా చేసేలా తక్షణ ఆదేశాలు జారీ చేయాలని కేంద్రాన్ని కోరారు. దీనివల్ల రాష్ట్రంపై పడుతున్న ఆర్థిక భారం కూడా తగ్గడంతో పాటు మొక్కజొన్న రైతులకు గిట్టుబాటు ధర కల్పనలో రాష్ట్రప్రభుత్వానికి చేయూతనిచ్చినట్లు అవుతుందని అన్నారు. ఈ అంశాలపై చేశారు.కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డిలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖలు రాశారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సానుకూల నిర్ణయం తీసుకునేవిధంగా చొరవ చూపాలని ఆయన కేంద్ర మంత్రులను కోరారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com